ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు, : fb.com/vaartha

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-1-2025 సోమవారం సంపుటి: 30 సంచిక: 352 పేజీలు: 12 వెల: 6.50


అమెరికా అధ్యక్షుడిగా
## ట్రంప్
పదవీ స్వీకారం నేడే
కేపిటల్ హిల్స్‌కు చేరిన దేశ, విదేశ ప్రముఖులు



2లో

## 6 నెలల్లో రాష్ట్రానికి రూ. 3 లక్షల కోట్లు



ఆదివారం గన్నవరంలో ఎన్ఐడిఎం భవనం ప్రారంభిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ తదితరులు

- ఏపి అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం
- ప్రకృతి విపత్తులకు ఎన్‌డిఆర్‌ఎఫ్, మానవ విపత్తులకు ఎన్‌డిఎ
- గత ఐదేళ్లలో జరిగిన నష్టాన్ని అనేక రెట్ల అభివృద్ధితో భర్తీ చేస్తాం
- 2028కి పోలవరం పూర్తి: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- ప్రధాని సూర్యఘర్ ద్వారా మరింత సౌరశక్తి: సిఎం చంద్రబాబు

**గన్నవరం(కృష్ణా), జనవరి 19, ప్రభాతవార్త :** ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా హామీఇచ్చారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరునెలల కాలంలో రూ.3లక్షల కోట్ల కేటాయింపులు చేసినట్లు వివరించారు. విజన్ గల ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలోని అభివృద్ధి, దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి మోడీ పూర్తిస్థాయిలో సహకరిస్తారని భరోసా ఇచ్చారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరు గ్రామంలో ప్రకృతి విపత్తు స్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) 20వ వార్షికోత్స వేడుకల్లో పాల్గొన్న అమిత్‌షా ఇక్కడ నిర్మించిన జాతీయ విపత్తు నిర్వహణ శిక్షణసంస్థ (ఎన్ఐడియం) భవనాన్ని, ఎన్‌డిఆర్‌ఎఫ్ 10వ >>2

## సిఎం చంద్రబాబు దావోస్ పయనం

రాష్ట్రానికి పెట్టుబడులపై పారిశ్రామిక ప్రముఖులతో భేటీలు

**విజయవాడ జనవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబ ఆదివారం దావోస్ పర్యటనకు వెళ్తున్నారు. సాయంత్రం అమరావతి నుంచి ఢిల్లీ చేరుకుని అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో బృందంతో కలిసి జ్యూరిచ్ బయల్దేరతారు. అక్కడి భారత రాయబారితో భేటీ అవుతారు. మొదటిరోజు జ్యూరిచ్‌లో 10 మంది పారిశ్రామివేత్తలతో సిఎం సమావేశమవు >>2

## జగన్ ఆస్తులపై అమిత్‌షా ఆరా!

**విజయవాడ,జనవరి 19,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆస్తులు, ప్యాలెస్‌లపై ఏపీ మానవవనరుల శాఖా మంత్రిని అమిత్‌షా అడిగినట్లు టిడిపి వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతుంది. జగన్‌కు ఎక్కడెక్కడ ఎన్నెన్ని ప్యాలెస్‌లు ఉన్నాయి, వాటి విస్తీర్ణం ఎంత అని ఆరా తీసినట్లు తెలిసింది. విశాఖ రుషికొండపై కట్టిన ప్యాలెస్‌కు ఎన్జీటీ నిబంధనల ప్రకారం రూ.200 కోట్ల జరిమానా కట్టేల్సిందేనని అమిత్‌షా అభిప్రాయపడినట్లు తెలిసింది.

సిఎం చంద్రబాబు నివాసంలో జరిగిన గత రాత్రి విందు సందర్భంగా జరిగిన భేటీలో అమిత్‌షా జగన్ ప్యాలెస్‌ల గురించి అడిగి మరీ తెలుసుకున్నట్లు సమాచారం. ఇడుపులపాయ, బెంగళూరు ఎలహంక, హైదరాబాద్ లోటస్‌పాండ్, తాడేపల్లిలో ప్యాలెస్‌లు ఉన్నాయని లోకేశ్ అమిత్‌షాకు వివరించారు. ఒక్కొక్కటి ఎన్ని ఎకరాలు

### విశాఖ ప్యాలెస్‌కు రూ. 200 కోట్ల జరిమానా?

ఉండొచ్చని అడగ్గా హైదరాబాద్, తాడేపల్లి ప్యాలెస్‌లో పది ఎకరాల్లోపు ఉంటాయని లోకేశ్ బదులిచ్చారు. బెంగళూరు ప్యాలెస్ విస్తీర్ణం గురించి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. సుమారు 30 ఎకరాలకు పైనే ఉందని లోకేశ్ అందుకు బదులిచ్చారు. దానికి అన్నిఎకరాల్లోనా? అంటూ అమిత్ షా ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు సమాచారం.

**ఎన్జీటీ 200 కోట్ల జరిమానా వేసిందన్న లోకేశ్ :**

విశాఖలోనూ రూ.500 కోట్లు వెచ్చించి ప్యాలెస్ కట్టించారని లోకేశ్ చెప్పగా అది ప్రభుత్వ డబ్బుతో కట్టిందే కదా? అని అమిత్ షా అన్నారు. నిక్షేపంగా ఉన్న పాత పర్యాటకశాఖ కాటేజీలను కూల్చేసి, పర్యావరణాన్ని విధ్వంసం చేసి ఆ >>2










20-01pg2exHMNWJQER.qxd:20-01pg2exHMNWJQER.qxd 01/01/01 9:05 AM Page 1





ఆదివారం ఎన్‌ఐడియం ప్రాంగణం నమూనాను పరిశీలిస్తున్న అమిత్‌షా, సిఎం చంద్రబాబు

# రూ. 3 లక్షల కోట్లు

>> బెటాలియన్ ప్రాంగణంను ఆదివారం మధ్యాహ్నం ప్రముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా హోమ్ మంత్రి ఎన్‌ఐడియం క్యాంపస్ నమూనాను పరిశీలించి మొక్కలు నాటారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అనంతరం జరిగిన సభలో అమిత్‌షా ప్రసంగిస్తూ ప్రకృతి విపత్తుల పట్ల ఎన్‌డిఆర్‌ఎఫ్ స్పందిస్తుందని, మానవులు సృష్టించే విపత్తులను ఎన్‌డిఎ ప్రభుత్వం స్పందిస్తుందని చెమత్కరించారు. మానవ విపత్తు కారణంగా గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు తీరని నష్టం వాటిల్లిందని దానిని సరిచేసేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవం అయిన విశాఖ స్టీలు ప్లాంటుకు రూ.11440కోట్లు కేటాయించామని, మోదీ భూమిపూజ చేసిన రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.27వేలకోట్లు ప్రపంచబ్యాంకు, హడ్కో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న రైల్వేజోన్ ఇచ్చామని, రాష్ట్రప్రజల జీవనాడి అయిన పోలవరం 2028నాటికి నిర్మాణం పూర్తిచేసి గోదావరి నీటిని రాష్ట్రమంతా అందిస్తామని భరోసా ఇచ్చారు. మంగళగిరిలో రూ.1600కోట్లతో ఎయిమ్స్ నిర్మాణం పూర్తిచేసామని, విశాఖపట్నంలో రూ.2లక్షల కోట్లతో గ్రీన్‌హైడ్రోజన్ ఎనర్జీప్లాంటుకు ప్రధాని భూమిపూజ చేసిన సంగతిని గుర్తు చేసారు. లక్షలకోట్లు ఖర్చుతో రహదారుల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. గత ఎన్నికల్లో నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో కూటమికి రాష్ట్రప్రజలు తిరుగులేని మెజార్టీ ఇవ్వటం పట్ల ఈసందర్భంగా అమిత్‌షా రాష్ట్రప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రఅభివృద్ధికి మోడీనేతృత్వంలోని కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ మన దేశంలోనే కాకుండా టర్కీ, వియత్నాం, నేపాల్, ఇండోనేషియా, మయాన్మార్ తదితర దేశాల్లోని ఆపదలోఉన్న ప్రజలకు సేవల అందిస్తూ ఆయా దేశాధినేతల మన్ననలు పొందటం పట్ల సంతోషం వ్యక్తం చేసారు. డిజాస్టర్ మేనేజ్‌మెంటులో మన దేశం గ్లోబల్ లీడర్‌గా మారనుందని ధీమా వ్యక్తం చేసారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ తమ అత్యుత్తమ సేవలతో ప్రపంచదేశాల్లోని ప్రజల నమ్మకాన్ని పొందటం పట్ల సిబ్బందిని హోంమంత్రి అభినందించారు. గతంలో ఒరిస్సాలో పెను తుఫాను సంభవించినపుడు 10వేల మంది మృత్యువాత పడగా ఈమధ్య వచ్చిన రెండు తుఫానుల్లోనూ ఒక్కరు కూడా మృత్యువాత పడకుండా ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది కాపాడటం అభినందనీయమన్నారు. గతంలో ఎన్‌డిఆర్‌ఎఫ్‌కి రూ.1200కోట్ల నిధులు కేటాయించగా, ఎన్‌డిఆర్‌ఎఫ్ ప్రాధాన్యతను గుర్తించిన కేంద్రం ఈసారి 14వ ఆర్థికసంఘం ద్వారా రూ.61వేలకోట్ల నిధులు కేటాయించినట్లు వివరించారు. గతంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు కేవలం ఉపశమన చర్యలు చేపట్టేవారని, ప్రస్తుతం ముందస్తు రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు, ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించటం ద్వారా ప్రాణనష్టాన్ని నివారిస్తున్నామన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని హోంమంత్రి అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో ఎన్‌సిసి, స్కౌట్స్, పంచాయతీలు అందరూ సమన్వయంతో పనిచేస్తే ఆస్తి, ప్రాణనష్టాలను నివారించవచ్చన్నారు. ఇక్కడ ఎన్‌ఐడిఎం శంకుస్థాపన కార్యక్రమంలో సిఎంగా చంద్రబాబు పాల్గొన్నారని, మళ్లీ ఆయన సిఎంగా ఉండగానే ఈభవనం ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. 2024లో మహారాష్ట్ర, హర్యానాలో ఘనవిజయం సాధించామని, 2025లో ఢిల్లీలో జెండా ఎగురవేయబోతున్నట్లు హోంమంత్రి ధీమా వ్యక్తం చేసారు.

**గ్లోబల్ లీడర్‌గా మన దేశం : చంద్రబాబు**

ప్రధాని మోడీ, అమిత్‌షాల నేతృత్వంలో చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికల వల్ల 2047నాటికి మనదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి గ్లోబల్ లీడర్‌గా ఎదిగి, ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశాభావ ం వ్యక్తం చేసారు. 2014లో రాష్ట్రవిభజన, 2019నుండి 24వరకు ఆర్థిక విధ్వంసంతో నష్టపోయిన రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఇస్తున్న సహకారం మరువలేమన్నారు. గత ప్రభుత్వం రూ.10లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని, వీటిని అధిగమించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టేందుకు కేంద్రం మరింత సాయం అందించాలని విజ్ఞప్తి చేసారు. ఎన్నికల సమయంలో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రఆర్థిక పరిస్థితి కేంద్రం సహకారంతో ప్రస్తుతం వెంటిలేటర్ నుండి బయటకు వచ్చినా ప్రస్తుతం పేషెంట్‌గానే ఉందని తెలిపారు. కేంద్రప్రభుత్వ సహకారంతో 2027 ఏప్రిల్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేసారు. గోదావరి -కృష్ణా అనుసంధానం పూర్తి అవుతుందని, గోదావరి-పెన్నా, గోదావరి-బనకచర్ల అనుసంధానానికి కేంద్రం సహకరించాలని అమిత్‌షాకు విజ్ఞప్తి చేసారు. ప్రధాని మోడీ చేపట్టిన సూర్యఘర్ పథకం ద్వారా రాష్ట్రంలో పేదలకు చిన్న ఇళ్లకు సైతం సోలార్ వ్యవస్థల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏవిపత్తు సంభవించినా ముందుగా గుర్తుకు వచ్చేది ఎన్‌డిఆర్‌ఎఫ్ అలాంటి సంస్థని మన రాష్ట్రంలో ఏర్పాటు చేయటం సంతోషకరమని సిఎం పేర్కొన్నారు.

**ఎన్‌డిఆర్‌ఎఫ్ సేవలు నిరుపమానం : ఉపముఖ్యమంత్రి పవన్**

ఆపదలో ఉన్న ప్రజల్ని, మూగజీవాలను కాపాడటంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ చేస్తున్న సేవలు నిరుపమానమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎన్‌డిఆర్‌ఎఫ్ సేవల్ని కొనియాడారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ ఏర్పాటు అయిన నాటి నుండి నేటి వరకు 12,320 రెస్క్యూ ఆపరేషన్స్ నిర్వహించి, 1.58లక్షల మందిని ప్రాణాపాయం నుండి కాపాడారని, 8.92లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారని తెలిపారు. అంతేకాకుండా విపత్తుల్లో ప్రాణాలు కోల్పోయిన 7,465 మంది మృతదేహాలను వెలికితీసి కుటుంబసభ్యులకు అప్పగించి వారి మనో వేదనను తొలగించారని ప్రశంసించారు. అంతేకాకుండా 19,368 మూగజీవాల ప్రాణాలను కాపాడారని వివరించారు. రాష్ట్రంలో ఎజెజ ఫార్మసీ ప్రమాదంలోనూ, అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంలోనూ ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి సేవలు అందించారని గుర్తుచేసారు. విజయవాడ వరదల్లో వీరి సేవలు ప్రజల అభిమానాన్ని చూరగొన్నాయన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రాష్ట్రానికి ప్రధాని మోడీ, అమిత్‌షాలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్న ఆయన వీరిద్దరికీ ఈసందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో కేంద్రమంత్రులు బండి సంజయ్, రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్రమంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ప్రభుత్వవిప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, బిజెపి రాష్ట్రఅధ్యక్షులు పురందేశ్వరి, కేంద్రహోంశాఖ కార్యదర్శి గోవింద్‌మోహన్, అదనపు కార్యదర్శి సంజీవ్‌కుమార్ జిందాల్, ఎన్‌డిఆర్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్ పియూష్ ఆనంద్, ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, జిల్లాఎస్పీ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో అమిత్‌షాకు వీడ్కోలు పలుకుతున్న సిఎం చంద్రబాబు

# అమిత్‌షాకు ఘనంగా వీడ్కోలు

**గన్నవరం, జనవరి 19, ప్రభాతవార్త :** రెండురోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వచ్చిన కేంద్రహోం మంత్రి అమిత్‌షా తన పర్యటన ముగించుకుని ఆదివారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్రమంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, రాష్ట్రబిజేపి అధ్యక్షులు పురందేశ్వరి, యంపి లావు కృష్ణదేవరాయలు, కనకమేడల రవీంద్రకుమార్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ, ఏలూరురేంజ్ ఐజి హరీష్‌కుమార్, ఎస్పీ గంగాధరరావు తదితరులు విమానాశ్రయంలో పుష్పగుచ్చాలు అందించి కేంద్రహోంమంత్రికి వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీ తరలివెళ్లారు. అమిత్‌షా రాక సందర్భంగా ఆయన పర్యటన ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేసారు.

# సిఎం చంద్రబాబు దావోస్ పయనం

>> తారు. అనంతరం హోటల్ హయత్‌లో మీట్ అండ్ గ్రీట్ విత్ తెలుగు డయాస్పొరా పేరుతో జరిగే తెలుగు పారిశ్రామికవేత్తల సమావేశంలో పాల్గొని, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చిస్తారు. అనంతరం దావోస్ పెల్లి పారిశ్రామివేత్తలతో సమావేశంలో పాల్గొంటారు. ఆర్సెలార్ మిత్తల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిత్తల్‌తో ప్రత్యేకంగా భేటీ అవుతారు. రెండోరోజు సీఐఐ సెషన్‌లో గ్రీన్ హైడ్రోజన్ అంశంపై చర్చ, సోలార్ ఇంపల్స్, కోకకోలా, వెల్‌స్పన్ ఎల్‌జి, కార్ల్స్‌బర్గ్, సిస్కో వాల్‌మార్ట్ ఇంటర్నేషనల్ , కాగ్నిజెంట్ తదితర సంస్థల ఛైర్మన్లు, సిఇఒలతో జరిగే సమావేశానికి యుఎఇ ఏకానమీ మంత్రి అబ్దుల్లా బిన్‌తో కలిసి చంద్రబాబు హాజరవుతారు. అనంతరం ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ చర్చల్లో పాల్గొంటారు. అంతర్జాతీయ మీడియా సంస్థలు నిర్వహించే చర్చాగోష్టులు బ్లూమ్‌బర్గ్‌కు ఇచ్చే ఇంటర్వ్యూలో ఆంధ్రప్రదేశ్ విధానాలను వివరిస్తారు. మూడోరోజు అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. రోజుకు కనీసం పదికి పైగా భేటీలు, సమావేశాల్లో చంద్రబాబు పాల్గొని, రాష్ట్రంలో మానవవనరులు, మౌలిక సౌకర్యాలు ప్రభుత్వ రాయితీలు సమర్థ నాయకత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై వివరిస్తారు. నాలుగోరోజు ఉదయం స్వదేశానికి బయల్దేరతారు.

# అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్
# పదవీ స్వీకారం నేడే

### 47వ అధ్యక్షుడుగా మళ్లీ అధికారంలోకి
### కేపిటల్ హిల్స్‌కు చేరిన దేశ, విదేశ ప్రముఖులు
### భారత్ తరపున హాజరవుతున్న విదేశాంగ మంత్రి జైశంకర్

**వాషింగ్టన్, జనవరి 19:** అగ్రరాజ్యం అధ్యక్షపదవీస్వీకారంపై ప్రపంచదేశాలు ఎంతో ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నాయి. ఆహ్వానాలు అందుకున్న అధినేతలు అందరూ ఇప్పటికే అమెరికాకు చేరుకున్నారు. గడ్డకట్టే చలిలో అమెరికా 47వ అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారంచేసేందుకు ఇప్పటికే డొనాల్డ్‌ట్రంప్ వాషింగ్టన్ చేరుకున్నారు. సోమవారం వాషింగ్టన్ డిసిలో మైనస్ 11 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుందన్న అంచనాలతో ట్రంప్ పార్లమెంటు భవనంలోనే రోటుండా కాంప్లెక్స్‌లో ప్రమాణ స్వీకారంచేస్తారు. తూర్పు ప్రామాణిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుంది. అదే భారత కాలమానంప్రకారం రాత్రి 10.30 గంటలకు ప్రమాణస్వీకారం జరుగుతుంది. ముందుగా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ ప్రమాణంచేసి బాధ్యతలు స్వీకరిస్తారు. తర్వాత అధ్యక్షుడి ప్రమాణస్వీకారం ఉంటుంది. తన తల్లి ఇచ్చిన బైబిల్‌తోపాటు మరొక ప్రత్యేక బైబిల్‌ను చేతబూని ట్రంప్‌చేత అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేయిస్తారు. క్యాపిటల్ హిల్స్‌లో జరిగే ప్రమాణ స్వీకారానికి శరవేగంగా ఏర్పాట్లుపూర్తిచేసారు. డొనాల్డ్‌ట్రంప్ కుటుంబ సమేతంగా ఇప్పటికే వర్జీనియాలోని తన గోల్ఫ్‌క్లబ్‌కు చేరుకున్నారు. తన కేబినెట్ నామినిలు పీటే హెగ్‌సేత్, లీజెల్డిన్‌లు కూడా ఆయన వెంట ఉన్నారు. పూర్వ అధ్యక్షులతోపాటు పలుదేశాల ప్రతినిధులు, అధినేతలు మాజీలు కూడా ఈ ప్రమాణస్వీకారానికి హాజరవుతున్నారు. ఇప్పటికే టికెట్లు పొందిన అతిథులు అందరూ క్యాపిటల్‌హిల్స్ వైపు రాసాగారు. టెక్, పారిశ్రామిక దిగ్గజాలతోపాటు మాజీ అధ్యక్షులు వారి కుటుంబా లతో సహా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పూర్వ అధ్యక్షులు బిల్‌క్లింటన్, జార్జి డబ్ల్యు బుష్, బరాక్ ఒబామా, ప్రస్తుతం దిగిపోనున్న అధ్యక్షుడు జోబైడెన్ సతీసమేతంగా హాజరవుతారు. అయితే బరాక్ ఒబామా సతీమణి మిషెల్ ఒబామా తాను రాలేనని ప్రకటించడంతో ఒబామా మాత్రమే హాజరవుతున్నారు. హిల్లరీ క్లింటన్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, ఇటాలియన్ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ, అర్జంటీనా అధ్యక్షుడు గ్జేవియర్‌మిలీ, హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్, భారత్ తరపున విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్, జపాన్ విదేశాంగమంత్రి తకేసి ఇవాయాలు హాజరవుతున్నారు. ఇంగ్లండ్ మాజీ అధ్యక్షుడు నిగెల్‌పాల్ ఫారెజ్, ఎరిక్ జెమ్మూర్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్‌బోల్సో నారోలు కూడా ఆహ్వానితుల్లో ఉన్నారు. ఎనిమిదేళ్లక్రితం ట్రంప్ తొలిసారి 2017లో అమెరికా అధ్యక్షుడుగా వచ్చారు. 2017నుంచి 2021వరకూ సేవలందించారు. 2020 ఎన్నికల్లో జోబైడెన్ చేతిలో ఓటమి చవిచూసారు. అయితే అనూహ్యంగా గత ఏడాదిజరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ట్రంప్ విజయం సాధించారు. దీనితో సోమవారం 47వ అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారంచేస్తారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్‌కు ఆహ్వానం వెళ్లలేదు. అయితే తర్వాత పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక భేటీ కానున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీలు ఈ కార్యక్రమానికి హాజరుకావడంలేదు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ వున్‌కు ఆహ్వానం ఉందా లేదా అన్నది స్పష్టత రాలేదు. కాగా 2020లో క్యాపిటల్‌హిల్స్ భవనంపై దాడిలో ఉన్న నిందితులకు కూడా ఆహ్వానం అందింది. వారంతా కోర్టు అనుమతులు తీసుకుని ఈకార్యక్రమంలో పాల్గొంటున్నట్లు సమాచారం.

## టిటిడి ఘటనలపై కేంద్రహోంశాఖ
# పర్యటనలో ఆసక్తికర పరిణామం

### రాత్రికి రాత్రే రెండు ఉత్తర్వులు, ఆఖరునిమిషంలో
### హోంశాఖ అదనపు కార్యదర్శి పర్యటన రద్దు

**తిరుమల,జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు ముగింపుకు చేరుకునే తరుణంలో టోకెన్లుజారీకి 8వతేదీ మొదటిరోజే తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన, 13వతేదీ లడ్డూవితరణశాలలో అగ్నిప్రమాదంపై ఆరా తీయడానికి కేంద్రహోంశాఖ అదనపు కార్యదర్శి సంజీవ్ కుమార్‌జిందాల్ పర్యటన ఆసక్తికరంగా మారింది. ఆంధ్రప్రదేశ్ పర్యటనలో ఉన్న జిందాల్ ఆదివారం రాత్రికి తిరుమలకు వస్తున్నట్లు శనివారం రాత్రి కేంద్రహోంశాఖ వర్గాలు ఢిల్లీనుండి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు ఆదేశాలందాయి. రెండురోజులు తిరుమలలో ఉండి టిటిడిలో విషాద ఘటనలపై విచారణ చేస్తారని సమాచారం ఇచ్చారు. దీనిపై టిటిడి అధికారులు కూడా అవసరమైన చర్యలు తీసుకునేలా సిద్ధమయ్యారు. ఈ విషయం విజయవాడ పర్యటనలోనేఉన్న కేంద్రహోంశాఖమంత్రి అమిత్‌షా, సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు చేరింది. అయితే టిటిడిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఇప్పటికే చర్యలు తీసుకున్న విషయాన్ని సిఎం టిటిడి అధికారులతో, ఇటు అమిత్‌షాతో కూడా చర్చించారు. ఈ నేపథ్యంలో జిందాల్ పర్యటన ఉండటంతో ఏం జరుగుతుందో తెలుసుకునేలోపు రాత్రికిరాత్రే శనివారంరోజే జిందాల్ తిరుమలపర్యటన రద్దయినట్లు రాత్రి 11గంటలకు టిటిడికి ఢిల్లీ హోంశాఖ కార్యాలయం నుండి మరోసారి ఉత్తర్వులు అందాయి. దీంతో టిటిడిలో తొలి సారిగా కేంద్రహోంశాఖ విచారణ చేపట్టనుండటం అన్ని వర్గాలను విస్మయం కలిగించి.



ఆదివారం విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కి దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

## దుర్గమ్మను దర్శించుకున్న
# కేంద్రమంత్రి బండి సంజయ్

**ఇంద్రకీలాద్రి, జనవరి 19, ప్రభాతవార్త :** దుర్గమ్మవారిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మ దర్శనానంతరం దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను ఆలయాధికారులు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# జగన్ ఆస్తులపై అమిత్‌షా ఆరా!

>> ప్యాలెస్ కట్టారని లోకేశ్ వివరించారు. దానికి ఎన్జీటీ రాష్ట్రప్రభుత్వానికి 200 కోట్ల జరిమానా వేసిందని లోకేశ్ గుర్తు చేశారు. ఆ భారం ఇప్పుడు తమ ప్రభుత్వంపై పడిందని వివరించారు. ఆ జరిమానా కట్టేశారా? అని షా ప్రశ్నించగా ఇంకా లేదని లోకేశ్ బదులిచ్చారు.

**ఎన్జీటీ జరిమానాను కట్టాల్సిందేనన్న అమిత్ షా :**

ఎన్జీటీ నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయని అమిత్ షా తెలిపారు. ఎన్జీటీకి ఆ డబ్బు ఎప్పటికైనా కట్టాల్సిందేనని అమిత్‌షా అన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్ ప్రజల్లో తిరుగుతున్నారా? అని షా ప్రశ్నించారు. అందుకు బదులుగా ఎక్కువగా బెంగళూరులోనే ఉంటూ, అప్పుడప్పుడూ వచ్చి ప్రకటనలు మాత్రం ఇస్తున్నారని లోకేశ్ వివరించారంటున్నారు. ఆదివారం అమిత్‌షా జగన్ ఆస్తులపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను ఆరా తీసారంటున్నారు.

# ట్రంప్ త్వరలోనే భారత్ పర్యటన?

**వాషింగ్టన్, జనవరి 19:** అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ మరికొన్ని గంటల్లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. బాధ్యతల స్వీకరణ తర్వాత ఆయన భారత్‌లో పర్యటించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు చైనాలోనూ పర్యటించే అవకాశాలున్నాయని సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. తాను అధికారం చేపట్టాక చైనా దిగుమతులపై సుంకాలు విధిస్తానంటూ ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీజింగ్‌తో తన సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా బాధ్యతల స్వీకరణ తర్వాత చైనాలో పర్యటించనున్నట్లు సమాచారం.
మరోవైపు.. భారత్‌లో పర్యటించే అంశంపైనా సలహాదారులతో చర్చలు జరిపినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. మరికొద్ది నెలల్లో వైట్‌హౌస్‌లో జరిగే దేశాధినేతల సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోడీని ట్రంప్ ఆహ్వానించే అవకాశముంది.
ఈ సమావేశాల అనంతరం ఆయన భారత్‌లో పర్యటిస్తారనేది మీడియా కథనాల సారాంశం. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## మిమ్స్ మెడికల్ కళాశాలలో
# విద్యార్థి ఆత్మహత్య

### మృతుని స్వస్థలం నిడదవోలు

**నెల్లిమర్ల (విజయనగరం జిల్లా),జనవరి 19 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా నెల్లిమర్ల లోని మిమ్స్ మెడికల్ కళాశాల ఎంబిబిఎస్ చివరి సంవత్సరం విద్యార్థి ఆత్కూరు సాయి మణిదీప్ (24) కళాశాల హాస్టల్‌లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం రాత్రి వరకు స్నేహితులతో మాట్లాడిన మణిదీప్ ఆదివారం ఉదయం పది గంటల వరకు బయటకు రాకపోవడంతో పక్క రూమ్‌లో విద్యార్థులు తలుపులు పగలకొట్టి పరిశీలించారు. తన రూమ్‌లోని బాత్ రూమ్‌లో విగత జీవిగా పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే విషయం తెలుసుకున్న కళాశాల యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు హాస్టల్‌కు చేరుకున్నారు. మృతదేహం వద్ద లభించిన ఆధారాల మేరకు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.



ఎ.సాయి మణిదీప్ (ఫైల్)

మృత దేహంవద్ద సూసైడ్ నోట్‌కూడా పోలీసులకు లభించింది. 'అమ్మా, నాన్న, తమ్ముడూ క్షమించండి' అంటూ వేడుకుంటూ సూసైడ్ లేఖ రాశాడని పోలీసులు తెలిపారు. ఎంబిబిఎస్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో తప్పడంతో ఆ పరీక్షలు రాసేందుకు సంక్రాంతి పండుగకు ఇంటికి వెళ్లకుండా రూమ్‌లోనే ఉండిపోయాడు. తన రూమ్‌లో ఉన్న మిగిలిన స్నేహితులు పండుగకు ఇంటికి వెళ్లిపోవడంతో రూమ్‌లో గత ఐదురోజుల నుంచి ఒంటరిగా ఉన్నాడు. చదువులో వెనుకబడడంతో పాటు మానసికంగా కుంగుబాటుకు గురికావడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతుని స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు. తండ్రి రామారావు నిడదవోలు మండలం అట్లపాడులోని వికాస్ కళాశాల డైరెక్టర్. తల్లిదండ్రులకు ఉన్న ఇద్దరు కుమారుల్లో మృతుడు మణిదీప్ పెద్దకుమారుడు. మిమ్స్ వైద్య కళాశాల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడంతో కళాశాలలో విషాదం నెలకొంది. విద్యార్థి మృతి పట్ల కళాశాల యాజమాన్యం తీవ్ర విచారం, సంతాపం వ్యక్తంచేసింది. తల్లిదండ్రులు, సహ విద్యార్థులు భోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 20-01-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
షష్ఠి ఉ.9.59
హస్త రా.8.29
వర్జ్యం : తె.5.31-7.20
దు.ము.12.48-1.33, 2) మ.3.03-3.48
శుభసమయం: ఉ.6.00-7.00
సా.3.50-4.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** తనఖాలను విడిపించ గలుగుతారు. చాలా సందర్భాలలో మీ అంచనాలు తారుమారు అవుతాయి.

**వృషభం:** కుటుంబ ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది.

**మిథునం:** కీలక నిర్ణయాలలో స్వంత ఆలోచనలు చేయడం మంచిది. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**కర్కాటకం:**సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఉపకరిస్తాయి. ధనలాభం.

**సింహం:** మానసిక, శారీరక శ్రమ అధికంగా ఉండటం వలన కొన్ని సందర్భాలలో ఏకాగ్రత లోపిస్తుంది.

**కన్య :** ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఒక వర్గానికి కావాలని చెరువ అవుతారు.

**తుల :** అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. అయితే ఇది తాత్కాలికంగా అయివుంటాయి.

**వృశ్చికం:**ఊహాజనితమైన మాటలతో మిమ్మల్ని నమ్మించడం కష్టతరమని ఇతరులు తెలుసుకోగలుగుతారు.

**ధనుస్సు:** ఉన్నతాధికారులు మీ శ్రమను గుర్తిస్తారు. తనఖా వస్తువులను విడిపించుకోగలుగుతారు.

**మకరం:** తోటలు కొనాలనుకునే మీ ఆలోచనలకు రూపం కల్పించడంలో కృతకృత్యులవుతారు.

**కుంభం:** కోర్టు వ్యవహారాలు వాయిదాలలో ఉంటాయి. సెల్ఫ్ డ్రైవింగ్‌లో జాగ్రత్తలు అవసరం.

**మీనం :** క్రమశిక్షణకు ప్రాధాన్యత నిచ్చి లాభపడుతారు. పట్టుదలతో ముందుకు సాగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నదుల అనుసంధానానికి కేంద్రం సానుకూలం

**విజయవాడ,జనవరి18,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రం మద్దతుతో సంక్షోభా లను సమర్థవంతంగా ఎదుర్కొని రాష్ట్రాన్ని అగ్రపథాన నిలబెడతామన్న నమ్మకం తమలో ఉందని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. రాష్ట్రంలో నదుల అనుసంధానికి కేంద్రప్రభుత్వ పూర్తి సానుకూలరీతిలో ఉందన్నారు. ఎన్‌ఆర్‌డిఎఫ్ వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గౌరవార్థం ముఖ్యమంత్రి చంద్రబాబు గత రాత్రి తన నివాసంలో విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనతో సిఎం చంద్రబాబు ఏకాంతంగా మాట్లాడారు. ఈ అంశాలను సిఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా ఆదివారం వెల్లడించారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్రం భారీ ప్యాకేజీ ప్రకటించినందుకు అమిత్‌షాకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో మనమంతా చేసిన ప్రచారంతో 93 శాతం స్ట్రైక్ రేట్ వచ్చింది. ప్రజలు మనకు విజయాన్ని కట్టబెట్టారు. కానీ గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసింది. వాటికి వడ్డీలు కడుతూనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసు కుంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ ఇవ్వడంతో వెంటిలేటర్‌పై నుంచి బయటపడ్డాం. ఇంకా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15 వేల కోట్లు గ్రాంటు ఇచ్చింది. పోలవరం డయాఫ్రం వాల్ పనులు కూడా శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. మీ నాయకత్వంలో ఏప్రిల్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ఏపీ ప్రజలకు చాలా సెంటిమెంట్ అంశం. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ప్లాంట్ ఏర్పాటైంది. గత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే కేంద్రం ప్రాణం పోసింది. రూ.11,400 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఉత్తరాంధ్ర వాసులు కాంక్ష అయిన విశాఖ రైల్వేజోన్, బిపిసిఎల్‌కు ప్రధాని మోడీ ఇటీవల శంకుస్థాపనచేశారు. రాష్ట్రాన్నికరువు రహితంగామార్చేందుకు నదుల అనుసంధాన్ని చేపడుతున్నాం. గోదావరి- బనకచర్ల అనుసంధానాన్ని చేపడుతున్నాం. గోదావరి నీళ్లను బనకచర్లకు తీసుకెళ్లేందుకు విధివిధానాలు సిద్ధం చేశాం. ప్రాజెక్టును పిపిపివిధానంలో చేపట్టేందుకు కూడా ఆలోచి స్తున్నాం. ఈ బృహత్తర కార్యక్రమానికి సాయం చేయాలని అమిత్‌షాకు విజ్ఞప్తిచేసినట్లు చంద్రబాబు తెలిపారు, భారతదేశంలో తిష్టవేసిన సమస్యలను పరిష్కరించేందుకు అమిత్‌షా పట్టుదలతో పని చేస్తున్నారు. శాంతిభద్రతలు కాపాడటంలో వినూత్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యేకంగా డ్యాష్ బోర్డు ఏర్పాటు చేసుకుని వ్యక్తిగతంగా పరిశీలిస్తున్నారు. నేను చాలామంది హోంమంత్రులను చూశాను కానీ... ఇలాంటి సమర్థవంతమైన మంత్రిని మొదటిసారి చూస్తున్నా. అవసరమైన సాంకేతికత వినియోగించుకోవడం, నియామకాలు చేపట్టడమొక్కటే కాకుండా విపత్తుల సమయంలో ఎలా వ్యవహరించాలో సూచిస్తున్నారు. దేశంలో ఏ మూలాన ఆపదలో ఉన్నా వారి ప్రాణాలు కాపాడాలన్న సంకల్పంతో అమితాషా ఉన్నారు. దేశంలో ఎక్కడ శాంతిభద్రతలకు విఘాతం కలిగినా సమర్థవంతంగా పని చేసి చక్కదిద్దుతున్నారు. దేశంలో ఉగ్రవాదం, నక్సలిజం వంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారు. సమర్థతతో పని చేస్తున్న అమిత్ షా పనితీరును చూస్తే కొన్నికొన్ని సార్లు నాకు అసూయ కలుగుతుంది. మనిషిలా కాకుండా మిషన్‌లా పని చేస్తున్నారు. చాలా మంది నేతలు రిబ్బన్‌లు కట్ చేసి ప్రసంగించి వెళ్లిపోతారు. కానీ అమిత్‌షా మాత్రం ఏ అంశాన్ని తీసుకున్నా లోతుగా వివరాలు తెలుసుకుంటారు.

**గోదావరిని బనకచర్లదాకా తీసుకువెళ్తా : సిఎం చంద్రబాబు**

# వికసిత్ పంచాయత్ లక్ష్యంగా ప్రణాళిక

## ఎంపీ కేశినేని చిన్ని ఎన్.ఐ.ఆర్.డి ప్రతినిధులు, కలెక్టర్ లక్ష్మీశతో ప్రత్యేక సమావేశం



ఎన్ఐఆర్డిలతో సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,జనవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ పార్లమెంట్ పరిధిలోని 295 గ్రామాలను అభివృద్ధి చేసి, ప్రతి కుటుంబంలో ఒక ఎంటర్ ప్రెన్యూర్ వుండే విధంగా కృషి చేస్తున్నట్లు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. ఆదివారం గురునానక్ కాలనీ ఓ ప్రైవేట్ హోటల్‌లో ఎన్.ఐ.ఆర్.డి ప్రతినిధులు, కలెక్టర్ లక్ష్మీశతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామీణ ప్రాంతాలను వికసిత్ పంచాయత్ దిశగా అభివృద్ధి చేయటానికి అమలు చేయాల్సిన ప్రణాళికను ఎంపి కేశినేని శివనాథ్ ఎన్.ఐ.ఆర్.డి ప్రతినిధులు, ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశకు వివరించారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వున్న 295 గ్రామాలను రెండున్న సంవత్సరాల్లోపు సమగ్ర అభివృద్ధి గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపి కేశినేని శివనాథ్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ లక్ష్మీశ గ్రామాభివృద్ధి కోసం చేపట్టబోయే కార్యక్రమాలకు తన సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో ముందుగా పైలట్ ప్రాజెక్ట్ చేయబోతున్నట్లు ఎన్.ఐ.ఆర్.డి ప్రతినిధులు తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి ఆరు గ్రామాలు ఎంపిక చేసి ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేసి నాలుగునియోజకవర్గాలకు కలిపి 32 మందికి హైదరాబాద్ లోని ఎన్.ఐ.ఆర్.డి లో శిక్షణ అందిస్తామన్నారు పదిహేను రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి 3 వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంత అభివృద్ధికి ఎన్.ఐ.ఆర్.డి మద్దతుగా నిలబడుతుందన్నారు. వికసిత్ పంచాయత్ లక్ష్యంలో భాగంగా గ్రామాలను ఎనర్జీ సఫిషియేంట్ విలేజ్, హెల్తీ విలేజ్, చైల్డ్ వెల్ఫేర్ విలేజ్, వుమన్ ఎన్పవర్మెంట్ విలేజ్, వుమెన్ ఫ్రెండ్లీ విలేజ్, పావర్టీ ఫ్రీ విలేజ్(పేదరికంలేని గ్రామం) గా ఏ విధంగా తీర్చి దిద్దుకోవచ్చు అనే అంశం పై అవగాహన కల్పించటంతో పాటు స్వయం ఉపాధి రంగానికి సంబంధించి కూడా శిక్షణ అందిస్తామని తెలిపారు. ఎన్.ఐ.ఆర్.డి లో శిక్షణ అందుకున్న వారు వారి గ్రామాల్లో తయారు చేసే ప్రొడక్ట్స్ కి సంబంధించి ఎంపి కేశినేని శివనాథ్ పేరున్న పెద్ద సంస్థల తో మాట్లాడి మార్కెటింగ్, బ్రాండింగ్ విషయాల్లో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఐ.ఆర్.డి సీనియర్ కన్సల్టెంట్ మహ్మద్ ఖాన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అంజన్ కుమార్ బాంజా, ఎన్.ఐ.ఆర్.డి అధికారులు దిలీప్ కుమార్ పాల్, మురళీకృష్ణ, ఓ.ఎస్.డి. వెంకటరత్నంలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల నిరసనలు

**విజయవాడ,జనవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** భారతరాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం,సీపీఐ.ఇతర వామపక్ష ప్రజాతంత్ర పార్టీలు,కార్మిక సంఘాలు నిరసనలు నిర్వహించారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డా.అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఇంచుమించు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిరసనలు జరిగాయి.సామ్రాజ్యవాద అనుకూల,లౌకిక రాజ్యాంగ వ్యతిరేకిగా ఉన్న అమిత్‌షా రాష్ట్రానికి రావడం సిగ్గుచేటని ఈ సందర్భంగా ఆందోళన కారులు వ్యాఖ్యానించారు. గోబ్యాక్ అమిత్‌షా అని నినాదాలు చేసారు. రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై అవమానకర వ్యాఖ్యలు చేసిన అమిత్ షాగో బ్యాక్ అంటూ వామపక్షాల ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ లో నిరసన కార్యక్రమం చేసారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం, నందిగామ. జగ్గయ్యపేట, తిరువూరు.



ఆదివారం విజయవాడ ధర్నా చౌక్‌లో అమిత్‌షా రాకకు నిరసనగా వామపక్షాల ధర్నా

ఇబ్రహింపట్టణంలో ధర్నాలు చేసారు. కృష్ణాజిల్లా మచిలీపట్టణం, గన్నవరం, ఉయ్యూరులో వామపక్షాల ధర్నాలు జరిగాయి.శ్రీకాళహస్తిలో ధర్నా వామపక్షాలు ధర్నాల నిర్వహించారు.అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ కు స్వంత ఘనులు కేటాయించి, సెయిల్ లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్రమంత్రి పర్యటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్‌లో విలీనం చేసే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ,శ్రీకాకుళం,అనకాపల్లి, రాజ మండ్రి, కాకినాడ, గుంటూరు, ఒంగోలుల్లో సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి.

# జీఓ 53ను రద్దు చేసిన హైకోర్టు

**విజయవాడ జనవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** మాదాసి కురువ/మాదారి సామాజికవర్గానికి చెందినవారి విషయంలో కుల ధ్రువీకరణ పత్రాన్ని మండల స్థాయిలో తహసీల్దార్ డిప్యూటీ తహసిల్దార్ ఇచ్చేందుకు వీలుగా 2022 నవంబర్ 2న అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 53ను హైకోర్టు రద్దు చేసింది. హైకోర్టు న్యాయవాదుల సంఘ ప్రతినిధులు ఈ రోజు సంబంధిత సమాచారం వెల్లడించారుజమాదాసి కురువ/మాదారి కురవ సామాజిక వర్గానికి చెందినవారికి రెవెన్యూ సబ్ డివిజనల్ అధికారి/ డిప్యూటీ కలెక్టర్/డిప్యూటీ కమిషనర్ మాత్రమే ధ్రువ పత్రాలు జారీచేయాలని, మండలస్థాయిలో ఇవ్వడానికి వీల్లేదని సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా జీఓ 53 ఉందని స్పష్టంచేసింది. ఆ జీఓను రద్దుచేస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్. రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. జీ6 53ను సవాలు చేస్తూ మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు మాలమహానాడు రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చలువాది రంగయ్య తదితరులు హైకోర్టులో వ్యాజ్యంవేశారు. మాదాసి కురువ/మాదారి కురువ పేర్లనుపోలిన, బీసీ సామాజిక వర్గానికి చెంది నవారు ఎస్సీ ధ్రువపత్రాలను పొందుతున్నారని, దీంతో అసలైన ఎస్సీలు ఫలాలను కోల్పోతున్నారన్నారు. పిటిషనర్ల తరపున న్యాయవాది శ్రీమాన్ వాదనలు వినిపించారు. కొన్ని కులాల విషయంలో ఆర్డీవో మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయాలన్నారు. సుప్రీం తీర్పును హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం జీవో 53 ను రద్దు చేసింది.

# ఆరోగ్యసహాయకుల పునర్నియామకం త్వరితగతిన జరగాలి

## ఆంధ్రప్రదేశ్ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీ.వీ.వీ ప్రసాద్

**విజయవాడ, జనవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తమను ఉద్యోగాల నుంచి తొలగించి రెండో నెల కావస్తోంది. ఇప్పటి వరకూ ప్రభుత్వం మీద, తమ శాఖ ఉన్నతాధికారుల మీద అపారమైన నమ్మకం, విశ్వాసంతో ఇన్ని రోజులూ వేడుకుంటూ వచ్చాం. కోర్టు తీర్పుతో తొలగించిన మమ్మల్ని, మెరిట్ ద్వారా తిరిగి పునర్నిమాయకం చేయాలన్న హైకోర్టు తీర్పును అమలు చేసి న్యాయం చేయాలని ఇప్పటికి కోరుతున్నాం! ఈ విషయంలో ఎవ్వరికీ ఎలాంటి న్యాయం జరగకుండా వైద్య ఆరోగ్య శాఖకే ఆదర్శవంతంగా జరగాలి.. ఇదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైద్యఆరోగ్యశాఖలో తొలగింపుకు గురైన దాదాపు వెయ్యి మంది ఆరోగ్యసహా యకుల ఆకాంక్ష. ఇదే విషయమై ఆంధ్రప్రదేశ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీ.వీ.వీ ప్రసాద్ ఆదివారం పత్రికల వారితో మాట్లాడుతూ పలు విషయాలను వివరించారు. రాష్ట్రంలోని 920మంది కాంట్రాక్టు ఆరోగ్యసహాయకులను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం డిసెంబర్ 5న తొలగించిందన్నారు. నియామక విధాన ప్రక్రియలోలోపాలున్నాయని వాటిని సరిచేసి ఆర్డర్ ఆఫ్ మెరిట్‌తో జాబితా తయారు చేసి అర్హులైనా వారందరికీ పునర్నిమాయకం చేయాలని తెలంగాణా ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తరీఉ్ప తక్షణమే అమలు చేయాలని ఆరోగ్యసహాయకులు కోరుతున్నారన్నారు.అత్యవసర సర్వీస్‌ల్లో భాగమైన వైద్య ఆరోగ్యశాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరింత బలోపేతం అయ్యేలా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఆరోగ్యసహాయకుల పునర్నియామక ప్రక్రియ జరగాలని ప్రసాద్ ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకోసం ఆర్థికశాఖ ఆమోదం పొంది ఇప్పటికీ ట్రెజరీ ద్వారా జీతాలు పొందుతూ పనిచేస్తున్న ఆరోగ్య సహాయ కులందరినీ మెరిట్ ప్రతిపాదికన తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. ముఖ్యంగా 2006లో సుప్రీంకోర్టు అనుమతితో అప్పటి ప్రభుత్వం మంజూరు చేయించుకునన అదనపు శాంక్షన్డ్ ఆరోగ్య సహాయకుల 1780 పోస్టులుని కూడా ఈ పునర్నియామక ప్రక్రియలో పరిగణలోకి తీసుకుని రూల్ ఆఫ్ రిజర్వేషన్ మెరిట్ ఆర్డర్ చేసి వీలైనంత ఎక్కువ మందికి అవకాశం కల్పించడం ద్వారా క్షేత్రస్థాయిలో పనిచేసే ఆరోగ్యసహాయకుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. తద్వారా కేంద్రప్రభుత్వం ఆశిస్తున్నా గ్రామీణ స్థాయిలో ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్రంలో చర్యలు తీసుకోవడమే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమరింత బలోపేతమయ్యే అవకాశం వుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాకుండాఏళ్ల తరబడి ఉద్యోగం చేసి, యాభైఏళ్ల పైబడి వయస్సులో ఉద్యోగాలు కోల్పోయిన బాధితులందరికీ న్యాయబద్ధంగానే పునర్నియామకం పొందే అవకాశం, అది కూడా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెట్టిన భిక్షగా ఆ ఆరోగ్యసహాయకులందరూ భావిస్తారని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘనేత ప్రసాద్ వివరించారు.



ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి ఆర్ కృష్ణయ్య

# ఒబిసి డిమాండ్ల సాధనకు 28న సమావేశం

**విజయవాడ, జనవరి 19, ప్రభాతవార్త :** ఓబిసి డిమాండ్ల సాధనకోసం ఈనెల 28న బిసికుల సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం ఏపి స్టేట్ బిసి కమీషన్ మెంబర్ రాష్ట్ర అధ్యక్షులు డా ఎన్ మారేష్ తెలిపారు. 80పైగా బిసి కుల సంఘాలతో జరిగే ఈ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను బిజెపి ఎంపి ఆర్ కృష్ణయ్య ఆదివారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో కేంద్రప్రభుత్వం ద్వారా ఓబిసిలకు జాతీయస్థాయి న్యాయం సాధించుకుందామని, చట్టసభల్లో బిసిలకు 50శాతం సీట్లు, ఉద్యోగాల్లో ప్రమోషన్లు కలి ్పంచాలని, 56శాతంకు బిసిల రిజర్వేషన్లు పెంచాలని, ఈ మేరకు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు బిసిలకు అట్రాసిటి యాక్ట్ పెట్టాలని, ప్రవైటు రంగంలో ఉద్యో గాలకు, హైకోర్టు జడ్జిల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్లుండాలన్నారు. బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్ల సాధనకు జరిగే ఈ సమావేశంలో ప్రతి బిసి కుల సంఘం నుండి ప్రతినిధులు పాల్గొనాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో సంఘం నేషనల్ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నేషనల్ యూత్‌ప్రెసిడెంట్ భరత్‌కుమార్, సి రాజేందర్, వేముల రామకృష్ణ, నీలం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్‌ని కలిసిన ఎపి అమెరికన్ అసోసియేషన్ ప్రతినిధులు

**విజయవాడ జనవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు హరి మోటుపల్లి, జాతీయ అధ్యక్షుడు బాలాజీ వీర్నాల పవన్ కల్యాణ్ కలిసి అమెరికాలోని పెన్సిల్వేనియా ఓక్స్ ఫిలడెల్ఫియాలో జరిగే ఏఏఏ తొలి జాతీయ కన్వెన్షన్ ఆహ్వానపత్రిక అందజేశారు. మార్చి 28,29 వ తేదీల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

# శ్రీవారి ఆశీస్సులతో శుభాలు కలగాలి

**తిరుమల,జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంత ద్వార దర్శనంతో మనసు సంతోషంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, రాష్ట్రమంత్రి సవిత కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. వైకుంతద్వార



దర్శనం చేసుకున్నారు.



# అర్ధరాత్రి మూతబడిన వైకుంఠద్వారం

## పదిరోజుల్లో 6.82 లక్షల మందికి పైగా దర్శనం

**తిరుమల,జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పది రోజుల వైకుంఠద్వార దర్శనాలు ఆదివారం అర్ధరాత్రితో మూతబడ్డాయి. పవిత్రమైన ధనుర్మాసం పురస్కరించుకుని ఈనెల 10వతదీ తెల్లవారుజామున 1.45గంటలకు తెరచుకున్న తిరుమల ఆలయంలోని వైకుంఠ ద్వారం నిరవధికంగా పదిరోజులపాటు తెరచిఉంచి భక్తులకు ప్రశాంత దర్శనం చేయించారు. 10వతేదీ వైకుంఠఏకాదశి,11నద్వాదశి ఘడియల తో బాటు అదనంగా ఎనిమిదిరోజులు 19వతేదీ ఆదివారం అర్ధరాత్రి 12గంటల వరకు భక్తులు ఆన్‌లైన్ టిక్కెట్లు, ఆఫ్‌లైన్ టోకెన్లుకలిగి వైకుంఠద్వారంలో శ్రీనివాసుడిని దర్శించుకోవడం సంతోషం చెందారు. పదిరోజుల్లో రోజుకు సరాసరి 65వేలమంది భక్తులకు ప్రశాంతంగా మూలవిరాట్టు శ్రీవారి దర్శనం తోబాటు వైకుంఠద్వార దర్శనాలు చేసుకున్నారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలలో 6,82,478మంది భక్తులు ఆదివారం రాత్రి వరకు మహాలఘులో దర్శనం చేసుకోగలిగారు. హుండీ ఆదాయం 34.75కోట్ల రూపాయలు పైగానే చేకూరింది. తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో 4.35లక్షల టోకెన్లు,ఆన్‌లైన్‌లో ఎస్ఇడి టిక్కెట్లు 1.40లక్షలు, శ్రీవాణి బ్రేక్ 19,500, దాతలు 8వేలవరకు ,ఇక్రప్రోటోకాల్ ప్రముఖులు ఇలా వరుసగా 65వేలమంది వరకు దర్శనాలు చేసుకోగలుగుతున్నారు. మోక్షమార్గం వైకుంఠ ద్వారంలో వెంకన్నను దర్శనం చేసుకుని భక్తులు ఆధ్యాత్మిక భావంతో అనుభూతి చెందారు. కాగా గత ఏడాది పదిరోజుల వైకుంఠద్వార దర్శనంలో 6.50లక్షలమంది భక్తులు దర్శనం చేసుకున్నారు.



# భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

## సాధారణ సర్వదర్శనం సమయం విస్తృతంగా ప్రచారం చేయాలి: టిటిడి ఇఒ శ్యామలరావు

**తిరుమల,జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** పది రోజుల వైకుంఠద్వార దర్శనాలు అర్ధరాత్రితో ముగియడంతో సోమవారం(నేడు) తెల్లవారుజాము నుండి అనుమతించనున్న సాధారణ సర్వదర్శనం వైకుంఠమ్2 భక్తులకుఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులకు ఆదేశించారు. భక్తులకు దర్శన సమయం, టోకెన్లుటిక్కెట్లు లేకపోవడంతో అనుమతించే విధానం తెలియజేయాలన్నారు. ఆదివారం ఉదయం తిరుపతిలోని విష్ణునివాసంలో ఆయన జెఇఒ వీరబ్రహ్మంతో కలసి తనిఖీ చేశారు. విష్ణునివాసంలో భక్తులు వేచివుండటం, గదులు లేక లోపల లాకర్లు పొందడం, తిరుమలకు వెళ్ళే విధానం భక్తులతో మాట్లాడి తెలిపారు. తిరుమలకు చేరుకునే విధానంపై నిరంతరాయంగా ప్రచారం చేయాలని సూచించారు.



# కొండపై పొగమంచు

## ఆహ్లాద వాతావరణంలో భక్తులు పరవశం

**తిరుమల,జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** సప్తగిరులపై మారిన వాతావరణం, చిరుజల్లులు కురుస్తుండటంతో ఆదివారం వేకువజామున పూర్తిగా తిరుమల ఆలయం పరిసరాలు పొగమంచుతో కమ్మేసింది. ఆలయం పూర్తిగా పొగమంచులో అద్భుతంగా కనువిందుచేసింది. ఆలయ నాలుగు మాఢవీదులు, జిఎంసి, ఘాట్‌రోడ్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు కూడా పొంగమంచులో కమ్ముకోవడంతో భక్తులు వైకుంఠంలో విహరించినట్లు అనుభూతి చెందారు. ఆలయం ముందున్న పుష్పాలంకరణలతో తమతమ సెల్‌ఫోన్‌లో సెల్ఫీలు తీసుకున్నారు. పొగమంచుతో ఘాట్‌రోడ్లపై వాహనాలు ప్రయాణానికి కొంత ఇబ్బందిగా మారింది.

# తిరుమల సమాచారం

# ఫిబ్రవరి 4న 'రథసప్తమి'

## ఏడువాహనాలపై ఊరేగనున్న ఏడుకొండలస్వామి

**తిరుమల,జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో ఫిబ్రవరి 4వతేదీ మంగళవారం రథ సప్తమి పర్వదినం పురస్కరించుకుని ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలదేవుడు కటాక్షించనున్నారు. మాఘమాసంలో సప్తమితిథి అత్యంత విశిష్టమైనది. ఆ రోజు దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి ఉదయం సూర్యప్రభ వాహనం నుండి రాత్రి చంద్రప్రభవాహనం వరకు ఏడువాహనాలపై అధిరోహించి ఊరేగుతారు. దీనికి మినీబ్రహ్మోత్సవం అని కూడా పేరు. సాధారణంగా ఏడాదిలో వరుసగా తొమ్మిదిరోజులు పాటు 16వాహనాలపై ఊరేగే శ్రీవేంకటేశ్వరుడు రథసప్తమిన ఒకేరోజు ఏడువాహనాలను అధిరోహించి భక్తులకు దర్శనమివ్వడం ప్రత్యేకత. ఆపదమొక్కులవాడు అనాధరక్షకుడు శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామి శ్రీదేవిభూదేవి ఉభయనాంచారులతో కలసి పలువాహనాలపై విహరిస్తారు. ఫిబ్రవరి 4వతేదీ మంగళవారం ఉదయం 5.30 గంటలకు తొలివాహనంగా సూర్యప్రభతో మొదలై వరుసగా పెద్దశేషవాహనం, చిన్నశేషవాహనం, గరుడవాహనం, చక్రస్నానం, సర్వభూపాలవాహనం, అశ్వవాహనం, చంద్రప్రభవాహనంతో ముగుస్తాయి. ఈ వేడుకలకు తిరుమలను సర్వాంగసుందరంగా ముస్తాబు చేస్తారు. భక్తులు అశేషసంఖ్యలో పాల్గొనే అవకాశం ఉండటంతో ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీలు, షెడ్లు, తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, ఆలయం పరిసరాల్లో రంగవల్లులు తీర్చిదిద్దడం పనులు మొదలుకానున్నాయి. రథసప్తమి వేడుకలను అంగరంగవైభవంగా జరిపించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమవుతోంది.



# అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'

## విజయవంతంతో శ్రీవారి సేవలో సినీబృందం



**తిరుమల.జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** అన్ని వర్గాల ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని సంక్రాంతి పండుగకు విడుదలైన "సంక్రాంతికి వస్తున్నాం"చిత్రం విజయవంతమైందని చిత్రనిర్మాత, దర్శకుడు అనిల్‌రావిపూడి, దిల్‌రాజు తెలిపారు. ఈ చిత్రం నిజంగా సంక్రాంతిపండుగరోజు ప్రతి పల్లెల్లో, పట్టణాల్లోని ఇళ్ళలో ప్రజలు జరుపుకునేలా నిర్మితమైందన్నారు. పండుగకు ఒక మంచి చిత్రం తీసుకురావాలనే అభిప్రా యంతో ఈ చిత్రం విడుదల చేయడం, ప్రేక్షకుల నుండి ఆదరణ రావడం సంతోషమన్నారు. ఆదివారం ఉదయం ఈ చిత్రం బృందం మీనాక్షి చౌదరి, ఐశ్వర్యరాజేష్, అనిల్‌రావిపూడి, దిల్‌రాజు, బులి రాజురేవంత్, శ్రీనివాసులురెడ్డి, చిత్ర నిర్మాత దానయ్య తదితరులు తిరుమలకు చేరుకున్నారు. విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని ఆనందనిలయుడ్ని వైకుంఠద్వారంలో దర్శించుకున్నారు.ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన చిత్రబృందాన్ని చూసేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు, భక్తులు ఆసక్తిచూపారు.

# ఊటకాలువపైనే అక్రమ నిర్మాణాలు

## ఆక్రమణలతో నిబంధనలకు విరుద్ధంగా భవనం

**తిరుమల,జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లోని తిరుమలపై కూడా కొందరు ఏకంగా ఊట కాలువలను ఆక్రమించుకుని భవనాలు నిర్మించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొండపై బహుళ అంతస్థుల నిర్మాణాలు గానీ, కొత్తగా ఎటువంటి కట్టడాలు చేపట్టరాదని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణతోబాటు కాలుష్యనియంత్రణలో భాగంగా కొండపై తవ్వకాలు చేపట్టి కొత్తగా కట్టడాలు నిర్మించరాదని పాలకమండలి కూడా నిర్ణయం. అలాంటిది అందుకు విరుద్ధంగా తిరుమలకొండపై ఓ మఠం ప్రతినిధులు శ్రీవారి ఆలయానికి ఎత్తులో ఐదంతస్థుల భవనం నిర్మాణం చేయడం, దాని పక్కనే ఊటకాలువను ఆక్రమించుకుని కాలువను పూడ్చివేసి రేకులతో షెడ్‌లు వేసుకుని అవసరమైన కార్యక్రమాలు చేసుకొంటున్నారు, ఇదీ టిటిడి నిబంధనలకు, హైకోర్టు ఆదేశాలకు పూర్తి విరుద్ధంగా ఉన్నా టిటిడి అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



ఈ అక్రమ కట్టడాలను, ఊటకాలువ ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదివారం సాధుసంఘ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతిస్వామి, తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మ ఓంకార్ డిమాండ్ చేశారు. ప్రతివాదభయంకర మఠం భవనాలను,ఆక్రమణలను ఆదివారం వాళ్ళు పరిశీలించారు. టిటిడి అధికారులు దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే తిరుమలలోని మఠాల నిర్వహణ, భక్తుల దోపిడీపై ప్రభుత్వం తీవ్రంగా పరిగణించడం, టిటిడి అధికారులు,పాలక మండలి విచారణ చేపట్టడం జరిగింది.

# మొదటిఘాట్‌లో లోయలోపడిన కారు

## ఆర్టీసిబస్సుకు ప్రమాదం

**తిరుమల,జనవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనం చేసుకుని తిరుగుప్రయాణమైన కడప జిల్లా భక్తులు తిరుపతికి మొదటి ఘాట్‌లో దిగుతుండగా 7వమైలు వద్ద ప్రమాదవశాత్తు ఇంజన్ ఆయిల్ కారణంగా అదుపు తప్పి చిన్న పాటి లోయలో పడింది. కారు బోల్తాపడటంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు పెద్దలు, ఇద్దరు పిల్లలు స్వల్పగాయాలకు గురయ్యారు. వెంటనే వెనుకనే వచ్చిన ఆర్టీసి బస్సు కూడా డీజిల్‌కారణంగా బ్రేక్‌లు పడక డివైడర్‌ను ఢీకొని పక్కకు వరిగింది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. కారులో ఉన్న క్షతగాత్రులను టిటిడి విజిలెన్స్ సిబ్బంది తిరుమల అశ్వనీకి తరలించారు. కాగా ఘాట్ రోడ్లపై తరచూ వాహనాల ఇంజిన్ ఆయిల్ కారి ఈ ప్రమాదాలు జరుగు తున్నాయి. తరచూ ద్విచక్ర వాహనదారులు మొదటిఘాట్‌లో ప్రమాదాల బారిన పడతున్నారు.


बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda **బ్యాంక్ ఆఫ్ బరోడా**

ఏలూరు బ్రాంచ్, డి.నెం.25-5-116, ఫైర్ స్టేషన్ దగ్గర, ఎన్.ఆర్.పేట, ఏలూరు - 534002. పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8812 223487

**డిమాండ్ నోటీసు**

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క చాప్టర్-III యొక్క సెక్షన్ 13(2) ప్రకారం)

**ఋణగ్రహీత(లు) :** శ్రీ షేక్ ఖాజా మొహిద్దీన్, తండ్రి : శ్రీ హుస్సేన్, ఇ.నెం.2-37, ఇస్లాం పేట, చీమకుర్తి, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523226.**వేరొక చిరునామా:** శ్రీ షేక్ ఖాజా మొహిద్దీన్, తండ్రి : శ్రీ హుస్సేన్, చీమకుర్తి, ఇస్లాం పేట, ప్రకాశం - 523226. (బరోడా హోమ్ లోన్ అకౌంట్ నెం. : 09700600017332).

**విషయము:** బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏలూరు బ్రాంచ్ మీకు మంజూరు చేసిన ఆర్థిక సహాయం- బరోడా హోమ్‌లోన్ అసలు మరియు వడ్డీ, మొదలగునవి చెల్లించడంలో మీరు విఫలం అయినారు.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క చాప్టర్-III యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా **తేది.14-11-2024**న మీకు తిరుగురసీదులతో కూడిన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. కానీ సదరు నోటీసు మీరు సదరు చిరునామాలో లేనందున ఈ పత్రికాప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది : మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించనందున సదరు అకౌంట్ **తేది.08-11-2024** నుండి నిరర్ధక ఆస్తిగా (ఎన్‌పిఎ) పరిగణింపబడినది. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు బకాయి మొత్తం **రూ.41,52,498.74** పై (అక్షరాల నలభై ఒక్క లక్షల యాభై రెండు వేల నాలుగు వందల తొంభై ఎనిమిది రూపాయల డెబ్బై నాలుగు పైసలు మాత్రమే) + **తేది.10.11.2024** నుండి ఇంకా విధించని వడ్డీ, ఛార్జీలు, ఇతర ఖర్చులు, మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు **బ్యాంక్ ఆఫ్ బరోడా** వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (13) నియమానుసారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించి **బ్యాంక్ ఆఫ్ బరోడా** వారి ముందస్తు లిఖిత అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకం, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేయబడినది.

**తనఖాలో ఉన్న స్థిరాస్తి వివరములు:**

**ఎ-షెడ్యూలు:** ఆంధ్రప్రదేశ్ - 534007, ఏలూరు జిల్లా, ఏలూరు ఎస్ఆర్ఓ, ఏలూరు మండలం, సత్రంపాడు గ్రామ పంచాయితీ, సత్రంపాడు గ్రామ ఆర్.ఎస్.నెం.76 & 82 లోని 512 చ॥గ॥ల మొత్తంలో 35.00 చ॥గ॥ల అవిభాజ్యపు వాటా విస్తీర్ణంతో గల ఎస్‌వి రావు ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, రెండవ అంతస్తు నందు గల ఫ్లాట్ నెం.303 శ్రీ షేక్ ఖాజా మొహిద్దీన్, తండ్రి: శ్రీ బడే హుస్సేన్ షేక్ గారికి చెందినది. **హద్దులు : తూర్పు :** 48 అ॥ల రోడ్డు, **దక్షిణం :** శ్రీ ఈలప్రోలు పార్థసారథి గారికి చెందిన ఆస్తి - 96 అ॥లు, **పడమర :** ఎస్‌బిఐ కాలనీ ప్రహరీ గోడ - 48 అ॥లు, **ఉత్తరం :** మండువ మురళీ గారికి చెందిన ఆస్తి - 96 అ॥లు.,

**పైన తెలిపిన హద్దులలోని అవిభాజ్యపు వాటా స్థల విస్తీర్ణం 35 చ॥గ॥లు.,**

**బి-షెడ్యూలు:** పైన తెలిపిన హద్దులలోని ఝాన్సీ కన్‌స్ట్రక్షన్స్ - ఎస్‌వి రావు ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తు నందు 1150 చ॥అ॥లు విస్తీర్ణంతో మరియు స్టిల్ట్ ఫ్లోర్ నందు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియాతో గల ఫ్లాట్ నెం.303. **హద్దులు : తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** కామన్ కారిడార్ మరియు లిఫ్ట్ మరియు ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై

**తేది : 18-01-2025** — **సం/- అధీకృత అధికారి**

**ప్రదేశం : ఏలూరు** — **బ్యాంక్ ఆఫ్ బరోడా**

వార్త

ఆకలి రుచి ఎరుగనట్టే మనకు అత్యవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.

-ఆస్కార్‌వైల్డ్

# మారణకాండకు ముగింపు

మరుభూమిగా మారుతున్న దేశానికి ఊరట లభించింది. ఏడాది కాలంగా జరుగుతున్న మారణకాండకు తెరపడింది. ఎట్టకేలకు కాల్పుల విరమణకు ముందుకురావడం, ఆపై ఇరుదేశాల్లోని జైళ్లలో ఉన్న ఖైదీలను విడుదల చేసుకోవడం అన్నరెండే రెండు అంశాలపై ఈకాల్పుల విరమణ ఒప్పందం ముగిసింది. ఒక చిన్న గల్ఫ్‌దేశం ఖతార్ ఇందుకు నెరపిన మధ్యవర్తిత్వం మంచిఫలితాలే ఇచ్చిందని చెప్పాలి. సుమారు 40వేలమందికిపైగా మరణించడం లక్షలాదిమంది నిరాశ్రయులు కావడం లేదా ఇతరదేశాలకు శరణార్థులుగా వెళ్లపోవడం వంటి సంఘటనలతో పాలస్తీనా దేశంమొత్తం ప్రపంచ చిత్రపటంలో కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. ఈతరుణంలో కాల్పుల విరమణ ఒప్పందం తెరపైకి రావడం పాలస్తీనా ప్రజలకు కొండంత ఊపిరిపోసినట్లయిందని చెప్పాలి. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఉక్రెయిన్‌పై యుద్ధం, పాలస్తీనాపై దాడులు వంటివి నిలిపివేస్తానని ఒక్కరోజు ఆలస్యం జరిగినా ఉపేక్షించనని ప్రకటించిన ట్రంప్ అనుకున్నట్లుగానే ఈ విరమణ ఒప్పందానికి మిత్రదేశం ఇజ్రాయెల్ ముందుకు వచ్చింది. ఆ దేశ కేబినెట్ కూడా ఇందుకు ఆమోదం తెలపడమేకాదు వెనువెంటనే అమలుకు తెచ్చింది. ఈజిప్ట్, అమెరికా, ఖతార్‌దేశాల మధ్యవర్తిత్వంతో ఎట్టకేలకు పాలస్తీనాలో మారణహోమం ముగిసిందనే విశ్వసించాలి. ప్రపంచ దేశాలు ఎంత అరిచి గీ పెట్టినా పట్టించుకోని ఇజ్రాయెల్ హఠాత్తుగా కాల్పుల విరమణ ఒప్పందానికి దిగివచ్చిందంటే అగ్రరాజ్యం వత్తిళ్లేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. మూడు దశల ఒప్పందంలో కాల్పుల విరమణతోపాటు బందీల విడుదల కూడా జరగాలి. కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని తెలియడంతోనే దేశదేశాల్లో తలదాచుకుంటున్న పాలస్తీనా వాసులు తిరిగి స్వదేశానికి చేరుకుంటున్నారు. ఇజ్రాయెల్‌పై దాడిచేసి గత ఏడాది అక్టోబరు నెలలో హమాస్ వందలాది మందిని చంపి వేయడంతోపాటు కొన్ని వందల మందిని కిడ్నాప్ చేసి పట్టుకుని పోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ప్రారంభమైన ఈ మారణహోమం చివరకు హమాస్ అగ్రనేతల అంతం కూడాచవిచూసింది. మొత్తం హమాస్ ను తుడిచిపెట్టే లక్ష్యంతో పనిచేసిన ఇజ్రాయెల్ గాజా నగరంలో రక్తపుటేరులు పారించింది. ఓవైపు కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వస్తున్నదని చెపుతున్నా మరోపక్క గాజాలో 50కిపైగా లక్ష్యాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఏడాది కాలంగా ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య జరిగిన యుద్ధంలో ఎక్కువ నష్టపోయింది కూడా పాలస్తీనాయే. నగరాలకు నగరాలే ధ్వంసం అయ్యాయి. ఇజ్రాయెల్ ప్రయోగించిన క్షిపణుల తీవ్రతకు బహుళ అంతస్తుల భవనాలు నేలమట్టం అయ్యాయి. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 46 వేలమందికిపైగా చనిపోయారని చెపుతున్నా లెక్కకు రాని మరణాలు ఎన్నెన్నో ఉన్నాయి. ఓ పక్క డీల్ కుదిరిందని ప్రకటించినా కూడా ఇజ్రాయెల్ తన దాడుల పరంపరను కొనసాగించింది. స్పష్టమైన లక్ష్యాలపై జరిపిన దాడుల వల్ల సుమారు 100మందికిపైగా చనిపోగా కొన్ని వందల మంది తీవ్రగాయాలపాలయ్యారు. అటు ఐక్యరాజ్యసమితి చెప్పినా, ఇటు అంతర్జాతీయ నేర న్యాయస్థానం అరెస్టు వారంట్లు జారీచేసినా కూడా ఇజ్రాయెల్ వెనక్కి తగ్గలేదు. హమాస్ అంతమే లక్ష్యంగా ముందుకు సాగింది. కానీ ఈలోపు అమెరికాలో అధికార మార్పిడి జరుగుతుండటం, రిపబ్లికన్లు మళ్లీ అధికారంలోకి వస్తుండటంతో పరిణామాలు కూడా శరవేగంగా మారిపోయాయి. కాల్పులవిరమణ విజయం తమదంటే తమదని అటు డెమొక్రాట్లు, ఇటు రిపబ్లికన్లు ఎవరికివారు చెప్పుకుంటున్నా బాధిత దేశంలో మాత్రం ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. మరుభూమిగా మారిన దేశంలో ఇక నుంచి అయినా ప్రశాంత జీవనం సాగించేందుకు వీలుకల్పించిన మధ్యవర్తులను వారు వేనోళ్ల కొనియాడుతున్నారు. అందుకు దారితీసిన పరిస్థితులే అప్పట్లో అలా అలుముకున్నాయి. తొలిదశలో 42 రోజులపాటు కాల్పుల విరమణ అమలుకు వస్తుంది. 33మంది బందీలను కూడా విడుదలచేయాలన్న షరతులున్నాయి. మొదటిదశ అమలు బాధ్యత మాపై ఉందని మధ్యవర్తిత్వం వహించిన ఖతార్ కూడా ప్రకటించింది. జనసాంద్రత ఎక్కువఉన్న ప్రాంతాల నుంచి ముందు ఇజ్రాయెల్ తన బలగాలను ఉపసంహరించుకోవాలి. అంతేకాకుండా నిరాశ్రయులైన పాలస్తీనియన్లను వారివారి నివాసాలకు వెళ్లేందుకు స్వేచ్ఛనివ్వాలని ఖతార్ ఈ ఒప్పందం మౌలిక సూత్రాలను వివరించింది. మూడు దశల ఒప్పందం అమలైతే గాజాలో యుద్ధకాండ శాశ్వతంగా ముగిసినట్లవుతుందని అమెరికా కూడా ప్రకటించింది. గాజా అధికారుల లెక్కల ప్రకారం చూస్తుంటే సుమారు 24లక్షలమంది నిరాశ్రయులయ్యారు. యుద్ధ తంత్రంలోభాగంగా వారికి ఆహారం మంచినీరు, విద్యుత్ వంటి సరఫరాలను కూడా ఇజ్రాయెల్ కట్టడి చేయడంతో ఆకలి దప్పులతో గాజావాసులు అలమటించిపోయారు. ప్రపంచదేశాలు, ఐక్యరాజ్యసమితి వంటివి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీచేస్తేతప్ప ఇజ్రాయెల్ శాశ్వత శతృత్వం కొని తెచ్చుకోకుండా కొన్ని సడలింపులు ఇచ్చింది. ఉక్రెయిన్‌పై రష్యా కొనసాగిస్తున్న దండయాత్రలా కాకుండా ఏడాది కాలంలోనే పాలస్తీనా ఇజ్రాయెల్ సమస్యను కొలిక్కితీసుకురావడం మంచిపరిణామం. యుద్ధాల శకం ముగిసిందని, చర్చలు సంప్రదింపులతోనే శాంతియుత పరిష్కారాలు అనివార్యమన్నది రుజువైంది.

సంపదకి అహంకారం తోడైతే, అన్ని దుర్గుణాలూ వరుసగా ఉత్పన్నమవుతాయి. వాటి ఫలితం మనిషి నాశనమే.



గోల్డ్‌స్మిత్

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీ రమణ మహర్షి

# మానవ అక్రమ రవాణా దోపిడీకి పరాకాష్ట

**మానవ అక్రమరవాణాను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ చట్టాలు, జాతీయ విధానాలు ప్రభుత్వేతర సంస్థలతోపాటు అనేక మార్గాలున్నాయి. సామాజిక వర్గాల్లో అవగాహన కల్పించడం, స్నేహితులు, కుటుంబసభ్యులకు అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించడం, ఆధునిక బానిసలను కను గొని, విడిపించడానికి, ప్రాణాలతో బయటపడిన వారికి సంరక్షణను అందించడానికి స్థానికపోలీసులతో కలిసిపని చేయడం మొదలైనవి. ఈసమాచార సాంకేతికయుగంలో కూడా మానవ అక్రమరవాణా ఉనికి మానవాళికి అవమానకరం. ప్రపంచదేశాలు సమగ్ర అవగాహనతో దీనినితొలగించాలి.**

డాక్టర్. పిఎస్. చారి

మానవ అక్రమ రవాణా అనేది దోపిడీ ప్రయోజనం కోసం బలవంతం, మోసం ద్వారా వ్యక్తులను ఎంపిక చేయడం, రవాణా చేయడం, బదిలీచేయడం, ఆశ్రయం కల్పించడం లేదా స్వీకరించడం. ఈదోపిడీలో బలవంతపు శ్రమ, లైంగిక బానిసత్వం లేదా ఇతర రకాల వాణిజ్య లైంగిక దోపిడీలు ఉండవచ్చు. ఇది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన ఆధునిక బానిసత్వ రూపం. ప్రతి సంవత్సరం, యునైటెడ్‌స్టేట్స్‌తో సహా మిలియన్ల కొద్దీ పురుషులు, మహిళలు, పిల్లలు ప్రపంచవ్యాప్తంగా అక్రమ రవాణా చేయబడుతున్నారు. ఇది ఏ సంఘంలోనైనా జరగవచ్చు. బాధితులు ఏ వయస్సు, జాతి, లింగం లేదా జాతీయత అయినా కావచ్చు. హింస, తారుమారు చేయడం, మంచి జీతంతో కూడిన ఉద్యోగాల గురించి తప్పుడు వాగ్దానాలు, శృంగార సంబంధాలు మొదలైన వాటికి బాధితులను ఆకర్షించడానికి అక్రమ రవాణాదారులు (ట్రాఫికర్లు) ఈ వివిధ పద్ధతులను ఉపయోగించవచ్చు. మానసిక లేదా భావోద్వేగ దుర్బలత్వం, పేదరికం, నిరుద్యోగం, జ్ఞానంలేకపోవడం, విచ్ఛిన్నమైన కుటుంబాలు, సాంస్కృతికపద్ధతులు, సామాజిక భద్రతావలయం లేకపోవడం, సహజ విపత్తులు, రాజకీయ అస్థిరతతోసహా వివిధకారణాల వల్ల సులభంగా లక్ష్యంగా చేసుకునే వ్యక్తుల కోసం ట్రాఫికర్లు వెతుకుతారు. భాషాఅవరోధాలు, వారిట్రాఫికర్ల భయం, చట్టాన్ని అమలు చేసేవారి భయం తరచుగా బాధితులను సహాయం కోరకుండా చేస్తుంది. దీనితో మానవ అక్రమరవాణా బాధితులు వారి అక్రమ రవాణా అనుభవం సమయంలో, తర్వాత వినాశకరమైన మానసిక ప్రభావాలను అనుభవించవచ్చు. చాలామంది ప్రాణాలతో బయటపడిన వారు నిరాశ, జ్ఞాపకశక్తి కోల్పోవడం, సంబంధాలలో ఇబ్బందులు, ఆందోళన, భయం, అపరాధం, అవమానం, ఇతర తీవ్రమైన మానసిక గాయాలను అనుభవించవచ్చు. మానవ అక్రమరవాణా తరచుగా 'ఆధునిక బానిసత్వం'తో పోల్చబడిన మానవ హక్కుల నేరం ఏసమయంలోనైనా ప్రపంచవ్యాప్తంగా 27 మిలియన్ల మంది బాధితులను ప్రభావితం చేస్తుందని అంచనా వేయబడింది. ఒక నివేదిక ప్రకారం, మానవ అక్రమరవాణాలో (79శాతం) లైంగికదోపిడీ. లైంగికదోపిడీకి గురవుతున్న వారిలో ప్రధానంగా మహిళలు, బాలికలు ఉన్నారు. ఆశ్చర్యకరంగా 30శాతం దేశాల్లో, అక్రమ రవాణాదారులలో మహిళలే అత్యధికంగా ఉన్నారు. లైంగిక దోపిడీకి సంబంధించిన అక్రమ రవాణాకంటే బలవంతపు శ్రమతక్కువ తరచుగా కనుగొనబడింది. ప్రపంచవ్యాప్తంగా, అక్రమ రవాణా బాధితుల్లో దాదాపు 20శాతంమంది పిల్లలున్నారు. ఒక నివేదిక ప్రకారం, గుర్తించబడిన ఆఫ్రికన్ బాధితులు అత్యధిక సంఖ్యలో గమ్యస్థానాలకు చేరుకున్నారు. మొత్తంగా, 2022లో కనీసం 162 వేర్వేరు జాతీయులు 128 వేర్వేరు దేశాలకు రవాణా చేయబడ్డారు. డ్రగ్స్ అండ్ క్రైమ్‌పై ఐక్యరాజ్యసమితి కార్యాలయం ప్రచురించిన వ్యక్తుల అక్రమ రవాణాపై నివేదిక 2024 గ్లోబల్ రిపోర్ట్ 156 దేశాలను కవర్చేస్తుంది. 2019,2023 మధ్య కనుగొనబడిన ట్రాఫికింగ్ కేసులను విశ్లేషించడం ద్వారా వ్యక్తుల అక్రమ రవాణాకు ప్రతిస్పందన అందిస్తుంది. 2019తో పోలిస్తే 2022లోప్రపంచవ్యాప్తంగా గుర్తించబడిన ట్రాఫికింగ్ బాధితుల సంఖ్యలో 25 శాతం పెరుగుదలను నివేదిక నమోదు చేసింది. 2019, 2022 మధ్య, బలవంతపు కార్మికుల కోసం అక్రమ రవాణాకోసం గుర్తించబడిన ప్రపంచవ్యాప్తంగా బాధితుల సంఖ్య 47 శాతంపెరిగింది. 2024 ట్రాఫికింగ్ ఇన్పర్సన్స్ (టిఐపి) నివేదిక బాధితుల గుర్తింపు, నేర ఆరోపణలు మార్పులలో ప్రాంతీయ వ్యత్యాసాలను హైలైట్ చేస్తూ వ్యక్తుల అక్రమరవాణాపై వివరణాత్మక గణాంకాలను అందిస్తుంది. ప్రపంచస్థాయిలో 133,943 మంది బాధితు



లను గుర్తించారు. 7,115 మంది దోషులుగా నిర్ధారించబడ్డారు. ఆఫ్రికాలో 21,877 మంది బాధితులను గుర్తించారు. 758 దోషులు తూర్పుఆసియా, పసిఫిక్‌లో 6,543 మంది బాధితులు గుర్తించబడ్డారు. 1,802మంది దోషులు, ఐరోపాలో 32,996 మంది బాధితులు గుర్తించబడ్డారు. 1,667 దోషులు, దక్షిణమధ్య ఆసియాలో 50,815 మంది బాధితులు, 1,245మందిదోషులు, పశ్చిమ అర్ధగోళంలో18,292 మంది బాధితులు గుర్తించారు. 873 మందిదోషులుగా గుర్తించబడ్డారు. 2024 శ్రేణి ర్యాంకింగ్‌లు ట్రాఫికింగ్ బాధితుల రక్షణచట్టం కనీస ప్రమాణాలకు అనుగుణంగా దేశాలు చేసే ప్రయత్నాల ఆధారంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్‌స్టేట్ దేశాలను నాలుగు అంచెలుగా వర్గీకరిస్తుంది. ఒకటవ అంచెలో దేశాలు పూర్తిగాచట్టం ప్రమాణాలకు అనుగుణంగాఉన్నాయి. ఉదా. అర్జెంటీనా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, రిపబ్లిక్ ఆఫ్కొరియా. రెండవ అంచెలో దేశాలు పూర్తిగా చట్టం ప్రమాణాలకు అనుగుణంగా లేవు. కానీ గణనీయమైన ప్రయత్నాలు చేస్తున్నాయి. ఉదా. భారతదేశం, ఇజ్రాయెల్, దక్షిణాఫ్రికా. మూడవ అంచెలో చట్టం ప్రమాణాలను అందుకోని దేశాలు. ఉదా. ఆఫ్ఘనిస్తాన్, చైనా, రష్యా. నాల్గవ అంచెలో చట్టం ప్రమాణాలకు ప్రయత్నాలు చేయనివి. భారతదేశంలో మానవ అక్రమరవాణా, భారతచట్టం ప్రకారం చట్టవిరుద్ధమైనప్పటికీ, ఒక ముఖ్యమైన సమస్యగా మిగిలిపోయింది. వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ బలవంతపు, బంధిత కార్మికుల ప్రయోజనాల కోసం ప్రజలుతరచుగా భారతదేశం ద్వారా అక్రమంగా రవాణా చేయబడుతున్నారు. బలవంతపు, బంధిత కార్మికులపై విశ్వసనీయమైన అధ్యయనం పూర్తికానప్పటికీ, ప్రభుత్వేతర సంస్థలు20 నుండి 65 మిలియన్ల మంది భారతీయులను ఈసమస్య ప్రభావితం చేసినట్లు అంచనావేసింది. భారతదేశంలో వివిధకారణాల వల్ల పురుషులు, మహిళలు పిల్లలు అక్రమ రవాణాకు గురయ్యారు. వాణిజ్యపరమైన లైంగికదోపిడీ బలవంతపు వివాహాల ప్రయోజనాల కోసం దేశంలో మహిళలు బాలికలు అక్రమ రవాణా చేయబడుతున్నారు. ముఖ్యంగా పురుషులకు అనుకూలంగా లింగనిష్పత్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో పిల్లలలో గణనీయమైన భాగం ఫ్యాక్టరీ కార్మికులుగా, గృహసేవకులుగా, యాచకులుగా, వ్యవసాయ కార్మికులుగా బలవంతపు పనికిలోనవుతున్నారు. కొన్ని తీవ్రవాద తిరుగుబాటు గ్రూపులచే సాయుధ పోరాటయోధులుగా ఉపయోగించబడ్డారు. వాణిజ్యపరమైన లైంగిక దోపిడీకోసం నేపాల్ బంగ్లాదేశ్ నుండి అక్రమరవాణా చేయబడిన మహిళలు బాలికలకు భారతదేశం కూడాగమ్యస్థానంగా ఉంది. సర్కస్లోలలో బలవంతపుపనికోసం నేపాలీపిల్లలను కూడా భారతదేశానికి రవాణా చేశారు. వాణిజ్యపరమైన లైంగిక దోపిడీకోసం భారతీయమహిళలను మధ్యప్రాచ్య దేశాలకు రవాణా చేశారు. భారతదేశం 2011లో 2000 యునైటెడ్ నేషన్ ట్రాఫికింగ్ ఇన్పర్సన్స్ ప్రోటోకాల్‌ను ఆమోదించింది. భారత ప్రభుత్వం ఫిబ్రవరి2014లో మానవ అక్రమరవాణాకు వ్యతిరేక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ప్రభుత్వం వాణిజ్యపరమైన లైంగికదోపిడీకి అక్రమ రవాణాకు జరిమానా విధించింది. అనైతికట్రాఫికింగ్ నిరోధక చట్టంద్వారా ఏడేళ్ల నుంచి యావజ్జీవకారాగార శిక్ష విధించబడుతుంది. భారత ప్రభుత్వం ట్రాఫికింగ్ నిర్మూలనకు కనీసప్రమాణాలను పూర్తిగాఅందుకోలేదు కానీ అలాచేయడానికి గణనీయమైన ప్రయత్నాలు చేస్తోంది. భారతదేశంలోని రాష్ట్రాలు కేంద్ర పాలితప్రాంతాలు అక్రమరవాణా నిరోధక ప్రయత్నాలకు ప్రాథమిక బాధ్యతను కలిగిఉంటాయి. కేంద్రప్రభుత్వం నుండి విధాన పర్యవేక్షణ ఉంటుంది. అన్నిరకాల అక్రమ రవాణాను నేరంగా పరిగణించేందుకు ప్రభుత్వం శిక్షాస్మృతిని సవరించలేదు. మానవ అక్రమరవాణాను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ చట్టాలు, జాతీయ విధానాలు ప్రభుత్వేతర సంస్థలతోపాటు అనేకమార్గాలున్నాయి. సామాజిక వర్గాల్లో అవగాహన కల్పించడం, స్నేహితులు, కుటుంబసభ్యులకు అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించడం, ఆధునిక బానిసలను కనుగొని, విడిపించడానికి, ప్రాణాలతో బయటపడిన వారికి సంరక్షణను అందించడానికి స్థానికపోలీసులతో కలిసిపని చేయడం మొదలైనవి. ఈసమాచార సాంకేతికయుగంలో కూడా మానవ అక్రమరవాణా ఉనికి మానవాళికి అవమానకరం. ప్రపంచదేశాలు సమగ్ర అవగాహనతో దీనినితొలగించాలి. •

# ఆర్థిక వ్యవస్థలో మందగమనాన్ని అధిగమించలేమా?

శ్రీనివాస్ గౌడ్ ముద్దం

భారత ఆర్థిక వ్యవస్థ 202425 ఆర్థిక సంవత్సరంలో 6.4శాతం వృద్ధి రేటును సాధించనుందని అంచనాగా ఉన్నట్టు ఇటీవల కేంద్ర సంస్థలు వెల్లడించాయి. అయితే ఇది గత నాలుగేళ్ల కనిష్ట స్థాయి కావడం ఆర్థిక విధాన నిర్వాహకుల, పెట్టుబడిదారుల మధ్య ఆందోళన రేకెత్తిస్తోంది. ఏదేమైనా ఈ మందగమనం కారణాలు, దుష్ప్రభావాలు, అలాగే దీన్ని అధిగమించేందుకు అవసరమైన అవకాశాలను పరిశీలించడం అత్యంత కీలకం. ప్రైవేటు రంగ పెట్టుబడులు ఆర్థికవృద్ధికి కీలకమైన పాత్ర పోషిస్తాయి. కానీ అనేక రంగాల్లో పెట్టుబడులు మందగించడం, పన్ను విధానాల్లో స్పష్టత లోపం, వడ్డీ రేట్లపెంపు వంటి అంశాలు ప్రైవేట్ పెట్టుబడులపై ప్రభావం చూపించాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం, వాణిజ్య యుద్ధాలు, రష్యా ఉక్రెయిన్ సంక్షోభం వంటి అంశాలు భారత ఎగుమతులను ప్రభావితం చేశాయి. ముఖ్యంగా చైనావంటి ప్రధాన మార్కెట్లలో వృద్ధి మందగమనం మన దేశ ఎగుమతులపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. గ్రామీణ వినియోగం కొంత మెరుగుపడినా, పట్టణ వినియోగం, సాధారణవినియోగంలో ఆశించిన స్థాయివృద్ధి కనిపించడం లేదు. దీన్ని ద్రవ్యోల్బణ ఉపాధి లోపం వంటి అంశాలు మరింతకుంచించాయి. ప్రభుత్వ వ్యయం 4.1శాతం పెరగడం పాజిటివ్ అనిపించినప్పటికీ, ఇది అంచనాలకు తక్కువ. మౌలిక వసతుల ప్రాజెక్టుల మీద మరింత వ్యయం అవసరమన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. వృద్ధి మందగమనం ఉద్యోగ కల్పనను నెమ్మదింప జేస్తుంది. ముఖ్యంగా నిర్మాణ, పరిశ్రమల రంగాల్లో కొత్త ఉద్యోగ అవకాశాలు తగ్గే అవకాశంఉంది. ఆర్బీఐ వృద్ధి అంచనాలను 7.2శాతం నుండి 6.6శాతానికి తగ్గించడం ఆర్థిక స్థిరత్వంపై ప్రశ్నలను తెరమీదకు తెచ్చింది. వడ్డీ రేట్ల పెంపు, ద్రవ్యోల్బణ నియంత్రణమధ్య సరైన సమతుల్యత అవసరం. ఆరోగ్యకరమైన ఖరీఫ్, రబీ పంటలతో గ్రామీణ ఆదా యం మెరుగుపడే అవకాశం ఉంది. ఇది వినియోగాన్ని పెంచడంలో సహాయపడగలదు. దీనికోసం వ్యవసాయ రంగానికి మరింత సబ్సిడీలు, పంటల సరసమైన ధరలు అందించడం అవసరం. సేవల ఎగుమతులు భారత ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన భాగంగా ఉన్నాయి. ఐటీ, టెలికాం, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో నిరంతరం బలపడే అవకాశాలు ఉన్నాయి. టెక్నాలజీ పై మరిన్ని పెట్టుబడులు పెడితే ఫలితాలు ఉంటాయి. మౌలిక సదుపాయాలు, రవాణా, నిర్మాణరంగాలకు పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను వేగవంతం చేయవచ్చు. భారతదేశం ఇప్పటికే స్టార్టప్‌హబ్‌గా ఎదుగుతోంది. యువతకి ఉపాధి కల్పించడంలో ఇది కీలకం. అలాగే పన్నురాయితీలు వాణిజ్య పెట్టుబడులకు ప్రోత్సాహం అం దించాలి. ప్రైవేటు పెట్టుబడులను పెంచాలి. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీ వాతావరణం కల్పించాలి. మౌలిక వసతుల నిర్మాణం చేపట్టాలి. రోడ్లు, రైళ్లు, నదుల అనుసంధానం వంటి ప్రాజెక్టు లను వేగవంతం చేయడం ద్వారా ఆదాయంసృష్టించవచ్చు. ఉద్యోగ కల్పన కూడా ముఖ్యమైనది. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేదిశగా పరిశ్రమల ఏర్పాటుకుప్రోత్సాహం అందించాలి. ఇకపోతే భారత ఆర్థికవ్యవస్థ 6.4 శాతంవృద్ధి రేటుతో ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో నిలుస్తున్నా, ఈవృద్ధి స్థిరంగా ఉండేందుకు ప్రైవేటు పెట్టుబడులను పెంచడం, వినియోగాన్ని మెరుగుపరచడం, వ్యవసాయ రంగంలో మరింత బలమైన మద్దతు కల్పించడం ద్వారా దీర్ఘకాలిక వృద్ధిని సాధించవచ్చు. •

# విద్యాసంస్థల్లో ఎన్నికలు ఒక చారిత్రక అవసరం

నాదెండ్ల శ్రీనివాస్

విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల రాజకీయాలు చారిత్రక అవసరమని జనవరి12న సిఎం రేవంత్ రెడ్డి ఓ సభలో మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాల్లో సైద్ధాంతిక భావజాలం ఉన్నవారు లేకపోవడం వల్లే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయని, విద్యార్థి రాజకీయాల్లో సిద్ధాంత పరంగా రాణించిన వారుంటే ప్రజాప్రతినిధులుగా అధికారంలో ఉన్నా, లేకపోయినా నమ్మిన సిద్ధాంతంకోసం దశాబ్దాలపాటు జీవితాలను త్యాగం చేస్తారని, ప్రజా సమస్యలపై విద్యార్థి సంఘాలు పోరాటాలు చేయడం వల్లనే చైతన్యం వస్తుందని, దాని ద్వారానే ఆయా సమస్యలు, పరిష్కారమవుతాయంటూ మాట్లాడారు. ఇదొక ఆహ్వానించదగ్గ పరిణామమే. అయితే ఇవి కేవలం మాటలకు మాత్రమే పరిమితం కాకుండా ఆచరణలో అమలయ్యే విధంగా ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని మనం ఆశిద్దాం. సుప్రీంకోర్టు 2005 డిసెంబర్ 2న ఇచ్చిన ఆదేశాల ప్రకారం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ కేంద్ర మాజీ ముఖ్య ఎన్నికల అధికారి జేఎం లింగ్దో అధ్యక్షతన ఒక కమిటీ వేసింది. విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో, విద్యార్థుల యూనియన్ ఎలక్షన్లను సమీక్షి ంచి తగిన సూచనలు చేయాలని కమిటీని నియమించింది. కమిటీ 2006 మే 26న రిపోర్ట్ ను సమర్పించింది. అదే ఏడాది సెప్టెంబర్ 22నసుప్రీంకోర్టు కమిటీ ప్రతిపాదించిన రిపోర్టును అమలు చేయాలని యూని వర్సిటీలకు, కాలేజీలకు సూచించింది. విద్యార్థి ఎన్నికల నిర్వహణకు సంబంధించి కమిటీ చాలా సూచనలు చేసింది. విద్యాసంవత్సరం మొదలైన 6నుంచి 8వారాల మధ్యలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి. ఈ ప్రక్రియ మొత్తం 10రోజుల వ్యవధి మించకుండా పూర్తిచేయాలి. దేశంలో ఉన్న యూనివర్సిటీల్లో విద్యార్థి ఎన్నికలు నిర్వహించడానికి శాంతి, స్వేచ్ఛాయుతమైన వాతావరణం ఏర్పాటు చేయాలి. పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే ఆయా వర్సిటీల్లో నామినేషన్ పద్ధతిలో విద్యార్థి ప్రతినిధులను ఎన్నుకోవాలి. ఐదు సంవత్సరాల తర్వాత నామినేషన్ పద్ధతి నుంచి నిర్మాణాత్మకమైన ఎన్నికల విధానానికి రావాలి. అంటే పార్లమెంటరీ తరహాలో పరోక్షంగా లేదా అధ్యక్ష తరహాలో ప్రత్యక్షంగా లేదా రెండు కలిపిన ఎన్నికల విధానం అనుసరించాలి. విద్యార్థి సంఘాల్లో ప్రతినిధులుగా రెగ్యులర్ విద్యార్థులు మాత్రమే ఉండాలి. విద్యార్థి సంఘాల ప్రతినిధులు రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండాపని చేయాలి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2006లో జేఎంలింగ్డో కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం ఐదేండ్లు నామినేషన్ పద్ధతిలో విద్యార్థి నాయకులను ఎన్నుకుని, ఆ తర్వాత విద్యార్థి యూనియన్ ఎలక్షన్స్ నిర్వ హించాలి. కానీ కోర్టు ఆదేశించి 17ఏండ్లు గడచినా మన తెలంగాణతో సహాచాలా రాష్ట్రాల్లో అది ఆచరణలోకి రాలేదు. కేంద్ర విశ్వవిద్యాలయాలైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ, రాష్ట్రస్థాయిలో కేరళ, పశ్చిమ బెంగాల్,



అస్సాం, రాజస్థాన్, పంజాబ్ తదితర వర్సిటీల్లో కొన్నిచోట్ల మాత్రమే విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మిగిలిన రాష్ట్రాల్లో ఇప్పటివరకు విద్యార్థి సంఘాల ఎన్నికలకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనివల్ల విద్యార్థుల్లో ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యం లేకుండాపోతుంది. విద్యలో కాషాయికరణ, ప్రైవేటీకరణ, ఫీజుల దోపిడీ, ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు, నిరుద్యోగం, కులం, మతం, ప్రాంతాల పేరుతో విద్వేషాలు సృష్టించడం ఇలా విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేసే అనేక వైపరీత్యాలు జరుగుతున్నా విద్యార్థులు కనీసం వారి హక్కుల కోసం గళంఎత్తలేని అచేతన స్థితిలో ఉంటున్నారు. దీనివల్ల ప్రశ్నించే తత్వం తగ్గిపోతోంది. ఒకవైపు చదువుకుంటూనే మరో వైపు సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకొని సంఘ విద్రోహశక్తులపై చదువుతూ పోరాటం, చదువుకై పోరాటం చేసేవాడే విద్యార్థి. అలాంటి విద్యా ర్థుల నిస్వార్థపు ఆలోచనలు, చర్యలు దేశ నిర్మాణానికి, ప్రగతికి దోహదంచేస్తాయి. ఇలా యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాల నేతలుగా ఎదిగిన అనేకమంది నేడు దేశంకోసం, ప్రజలకోసం నిర్విరామంగా అలుపెరుగని పోరాటాలు నిర్వ హిస్తున్నారు. ఇలా నిస్వార్థంగా పనిచేసేందుకు ఒక్క వామ పక్షాలు తప్ప మిగతా రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తగ్గిపోతున్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు జరిగిన కాలంలో విద్యావ్యవస్థను పరిశీలిస్తే నాయకులు, విద్యార్థులంద రూ సామాజిక స్పృహతో చైతన్యంగా ఉండేవారు. అందు వల్లనే ప్రాథమిక పాఠశాల నుండి యూనివర్సిటీల దాకా విద్యార్థి, టీచర్ నిష్పత్తి ప్రకారం నిరంతరం అధ్యాపకుల నియామకాలు జరిగాయి. నాణ్యమైన విద్యాబోధనడిమాండ్ చేయడంతోపాటు కాలేజీ, హాస్టల్ ఫీజులు సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వంతో పోరాటాలు చేసేవారు. అంతేకాకుండా ప్రశ్నించేతత్వం ప్రతి విద్యార్థిలో ఉండడంతో విద్యాసంస్థలు కూడా బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పనిచేసేవి. ఒక్క విద్యాసంస్థలకే పరిమితం కాకుండా సామాజిక ఉద్యమాల్లో కూడా విద్యార్థులు కీలకపాత్ర పోషించారు. ఉదాహరణకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంకోసం రాజకీయ పార్టీల పోరాటం కంటే విద్యార్థులు ముందుండి వీరోచితంగా ఉద్యమించడంవల్లనే రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైంది. ఈ పోరాటాలు సమాజం పట్ల విద్యార్థి నాయకులకు, విద్యార్థులకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తాయి. దేశంలో ప్రస్తుతం విద్య, ఉపాధి రంగాల్లో రాజకీయ ప్రభావం లేని వ్యవస్థ అంటూలేదు. ప్రస్తుతం చాలామంది రాజకీయ నాయకులు వారు పదవుల్లో ఉండగానే మరో పక్క వారి వారసులను రాజకీయ రంగప్రవేశం చేయించి, భవిష్యత్ తరాలపై రాజకీయ నాయకులుగా బలవంతంగా రుద్దుతున్నారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇదే తరహా రాజకీయం నేడు నడుస్తున్నది. ఈ పోకడలను మనం ప్రోత్సాహించినా, కొనసాగించినా ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా మారి, ఫాసిజం వైపు దారితీసే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి ప్రజాస్వామ వాదులు, రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల్లో ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. •

# ప్రజావాక్కు



### కేసుల పురోగతి ఎక్కడ?

తిరుమల స్వామి వారి దర్శనంటికెట్లలో పలు అక్రమాలపై నిత్యం పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినా తదుపరి చర్యలు శూన్యం! అలాగే పింక్ డైమండ్ అదృశ్యం కేసు నుంచి కల్తీ నెయ్యి దర్యాప్తు వరకు ఎటువంటి పురోగతి కానరావడం లేదు. ఇందుకుబాధ్యులు ఎవరు? స్వామివారి దర్శనానికి ప్రక్కరాష్ట్రాల నుంచి వచ్చిన వారు రాజకీయ విమర్శలు చేస్తున్నా పట్టించుకోరు. ఇంకా దర్యాప్తులు, కేసులు నమోదులు ఎవరిని మభ్యపెట్టడానికి? దేవస్థానం పాలకమండలి, అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలి! పదవులుఅలంకారప్రాయానికి, శాలువాలుకట్టడానికికాదు. ప్రతి ఒక్కరిలో జవాబుదారీ తనం ఉండాలి!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ఆరోగ్య కార్డులను విడుదల చేయాలి

గత కొన్నేళ్లుగా సీనియర్‌సిటిజన్లు తమన్యాయమైన కోర్కెలు తీర్చమని ప్రధానమంత్రి గారికి ఎన్ని విన్నపాలు చేసినా ఇవేమీ ఆయన చెవికెక్కకపోవడంతో సామాన్య జీవి తాలు అనేక ఆర్థికసమస్యలతో సతమతమవుతున్న వారు పండుగలు, పబ్బాలు కుటుంబ సభ్యులతో సంతోషాలు, ఆనందాలతో గడపలేకపోతున్నారు. వీరికి కావలసిన ముఖ్యమైన కోర్కెలు ఏమంటే రైళ్లలో రాయితీలు, ఎంప్లాయిస్ పెన్షను స్కీము 1995 వారి పెన్షన్లు, వెయ్యి రూపాయల నుండి రూ.9000 రేపు సమర్పించబోయే వార్షిక బడ్జెట్లో పెంచడం, ఆయుష్మాన్ భారత్ ఐదు లక్షల ఆరోగ్య కార్డులను విడుదల చేయడం.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### కల్లోల పరిస్థితి

ప్రపంచంలో కల్లోల పరిస్థితిని ఎదుర్కొంటుంది. అది వాతావరణ మార్పులపరంగా కావొచ్చు. వరదలాగా ప్రవహించే సాంకేతిక ప్రవాహం వల్ల కావొచ్చు. అయితే ఈ పరిస్థితిలో మనిషికి కావాల్సింది ఉపాధి మాత్రమే అయితే గ్రామ స్వరాజ్యాన్ని రూపకల్పన చేయడంలో ఉపాధి హామీ పని మరింత విస్తారం అయింది. దానిని ఇంకా పూర్తిస్థాయిలో పండ్ల పెంపకానికి, కూరగాయల సాగుకు, నీటి నిల్వకు మరింత ఎక్కువ స్థాయీ ప్రాధాన్యత ఇవ్వాలి ఉపాధి హామీ మరింత విస్తరించాలి.

- భారత అవినాష్, జనగామ

### తీరని అన్యాయం

ధాన్యం సేకరణలో రైతుకు తరతరాలుగా తీరని అన్యాయం జరుగుతోంది. రైతుకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం కల్లాల్లో ధాన్యం పెట్టుకొని విక్రయించడానికి ఎదురుచూస్తున్న రైతు బలహీనతను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తుంటే ప్రభుత్వ పరంగా చర్యలు బలహీనంగా వున్నాయని రైతాంగం ఆవేదన వ్యక్తంచేస్తోంది. మన వ్యవస్థలో దళారులవలన ధాన్యం రైతులకుదక్కాల్సినసొమ్ములో నేరుగా30దక్కకుండా పోతోంది. మిల్లర్లు-దళారుల దోపిడీని నిలువరించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మరిన్ని పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత వుంది. ఇప్పటివరకు సేకరించిన ధాన్యంలో 90 శాతానికి పైగా రైతుల పేరిట దళారులే సేకరించారని మీడియా వార్తలు తెలియజేస్తున్నాయి. ఇప్పటివరకు తాము సేకరించామని చెబుతున్న ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రకారం రైతులకు రూ.5,397 కోట్లు చెల్లించినట్టుగా తెలుస్తోంది.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### సమాచార కమిషనర్లను నియమించాలి

సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఆయుధం లాంటిది. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే సమాచార హక్కు అమలుతీరుకు సంబంధించిన రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, కమీషనర్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల రాష్ట్ర సమాచార కమిషన్‌లో లక్షలాది రెండవ అప్పీలు పెండింగ్‌లో వుండటం వల్ల ప్రజలకు కావలసిన సమాచారం సకాలంలో రాకపోవడంవల్ల సమాచార హక్కు చట్టం అమలు సక్రమంగా లేదు. అనేకప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం బోర్డులు కూడాలేవు. మూలకు పడవేసి వుంచారు. అధికారులకు అవగాహన లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమాచార హక్కుచట్టం అమలుతీరు మెరుగుపరిచేందుకు కృషి చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాలపల్లి జిల్లా

### పెన్షన్ చెల్లింపు చేయాలి

ఏపి సచివాలయంలో సిబ్బందిలో ప్రస్తుతం వాలంటీర్లు లేరు. గతంలో పెన్షన్ చెల్లింపుల్లో ఉన్న సహాయం లేదు. అయినా పింఛను అతివేగంగా ఇవ్వాలని, నిబంధనలతో పనిభారం సహజంగా పెరుగుతుంది. కొన్నిచోట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జాబ్‌కార్డు ఇవ్వడం సరైనదే దానితోపాటు వాస్తవ పనిభారం, సిబ్బంది సంఖ్య ప్రాతిపదికన ఇస్తేప్రజలకు, సిబ్బందికి టార్గెట్ టైంలో అన్ని విధులు చక్కగా నిర్వహించగలరు.

-బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌పై విష ప్రచారం

- ఒక్క అవకాశం అంటూ.. విద్యుత్ వ్యవస్థ విధ్వంసం
- సూర్యఘర్ పథకం త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు
- నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి ఓర్వలేకున్న జగన్
- ఢిల్లీ స్థాయిలో తెలిపిన జగన్ విధ్వంసం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**బల్లికురవ, జనవరి 19, ప్రభాతవార్త**

ఒక్క అవకాశం అంటూ ప్రజలను మోసం చేసి గత ఐదేళ్ల అధికారం చేపట్టిన జగన్.. రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి నెట్టడమే కాకుండా.. ఎస్సీ, ఎస్టీలకు అందించే ఉచిత విద్యుత్ విషయంలోనూ విష ప్రచారం చేస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. దళిత, గిరిజనుల ఉచిత విద్యుత్ పథకానికి తూట్లు అంటూ వైసీపీ నేతలు సాక్షి పత్రికలో ప్రచారం చేయడాన్ని మంత్రి ఖండించారు. గత ఐదేళ్ల విద్యుత్ వ్యవస్థపై కక్ష పెట్టుకున్న జగన్.. దానిని విధ్వంసం చేసినా.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనా అనుభవంతో అనతికాలంలోనే సరిదిద్దారని ఆయన తెలిపారు. రైతులకు వ్యవసాయ అవసరాలకు 9 గంటలు నిరంతరాయ విద్యుత్‌తో పాటు ప్రజలకు నాణ్యమైన కరెంట్‌ను ఎటువంటి అంతరాయాలు లేకుండా కూటమి ప్రభుత్వం అందించడాన్ని చూసి.. సైకో జగన్ తట్టుకోలేకపోతున్నాడన్నారు. ఫీడర్ లెవల్ లోనే రైతులకు అందుతున్న నాణ్యమైతన విద్యుత్‌ను జగన్ అండ్‌కో.. వైసీపీ బ్యాచ్.. తమ అసత్య ప్రచారాలతో అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మంత్రి గొట్టిపాటి ఆరోపించారు. కుప్పం నియోజకవర్గంలో ప్రస్తుతం ప్రయోగాత్మకం గా అమలు చేస్తున్న సూర్యఘర్ పథకాన్ని త్వరలోనే రాష్ట్రం అంతటా అమలు చేస్తామని ప్రకటించారు. అదే విధంగా సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సౌర పలకలను ఉచితంగానే అమర్చుతున్నామని తెలిపారు. ఎటువంటి అదనపు భారాలు లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించే సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలుతో జగన్‌కు వచ్చిన నష్టమేంటో ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి సవాల్ విసిరారు.

**జగన్ విధ్వంసం కేంద్ర పెద్దల దృష్టికి :**

గత ఐదేళ్ల పాలన సాక్షిగా.. జగన్ చేసిన విధ్వంసం కేంద్ర పెద్దల దృష్టికి కూడా వెళ్లిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. దేశంలో జరిగే అభివృద్ధి సంబంధ విప్లవాత్మకమైన మార్పులను అందిపుచ్చుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ముందు ఉంటారని ఆయన వెల్లడించారు. అదే విధంగా ఎటువంటి మంచి పథకంపైన అయినా విషయం చిమ్మి వ్యవస్థలను నాశనం చేసే విషయంలో జగన్ ముందు ఉంటాడని ఎద్దేవ చేశారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జగన్ గర్వంగా చెప్పుకునే పథకం ఒక్కటైనా ఉందా అంటూ వైసీపీ నేతలను మంత్రి ఈ సందర్భంగా ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రాయోజిత పథకాలైన సూర్యఘర్, పీఎం కుసుమ్ అమలుతో విద్యుత్ వినియోగదారులకు లబ్ది చేకూరుతుందని చెప్పారు. సూర్యఘర్ పథకంలో విద్యుత్ గృహ వినియోగదారులకు, పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులకు సంబంధించి వ్యవసాయ వినియోగానికి నాణ్యమైన విద్యుత్ అందదండతో పాటు మిగులు కరెంట్‌ను గ్రిడ్‌ను పంపి వినియోగదారులు ఆర్థికంగా వెసులుబాటు పొందే అవకాశం కూడా ఉందని వెల్లడించారు. పథకాలు పూర్తి స్థాయి అమలు తరువాత వాటి ప్రయోజనాలు మరింతగా ప్రజలకు చేరుతాయని మంత్రి స్పష
ష్టం చేశారు. అవినీతిలో కూరుకుపోయిన గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను కూటమి ప్రభుత్వం అందింపుచ్చుకుని ప్రజలకు లబ్ది చేకూరేలా వాటిని అమలు చేస్తుంటే ఓర్వలేని వైసీపీ మూకలు.. సాక్షి పత్రికను అడ్డం పెట్టుకుని సంక్షేమ పథకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ఇటువంటి విష ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని పిలుపునిచ్చారు.

# గొల్లపూడి మోహన్‌రావుకి శుభాకాంక్షలు

**దర్శి, జనవరి19, ప్రభాతవార్త**

విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి అప్సా డెమోక్రటిక్ ఎన్నికల్లో అప్సా డెమోక్రటిక్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన గొల్లపూడి మోహన్‌రావుకి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రకాశం జిల్లా అధ్యక్షులు జి.హరిబాబు, ప్రకాశం జిల్లా అప్సా ఉపాధ్యక్షులు యు.సత్యనారాయణ, అపెక్స్ కమిటీ సభ్యులు నన్నపనేని రాజారావు, అప్సా డెమోక్రటిక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.ప్రభాకరరావు, ప్రకాశం జిల్లా అప్సా కమిటీ సభ్యులు చొప్పరపు రాంబాబు.

# చిడతలు.. చిడతలు.. చిటికెలు.. చిటికెలోయ్.. భజన బిగిన్

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కాకమునుపే టీడీపీ నేతల స్వరం మారింది. నారా లోకేష్‌ను ఉపముఖ్యమంత్రి చేయాలని నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇది ఒక రంగంగా భజన కార్యక్రమమేనని పార్టీ కార్యకర్తలు ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. పదవుల కోసం నారా లోకేష్ ప్రాపకం కోసం ఈ రకమైన ప్రతిపాదనను చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో టీడీపీ కేడర్ నుంచి కామెంట్స్ వినపడుతున్నాయి. నిజానికి కూటమి ప్రభుత్వం ఇంకా కుదురుకోలేదు. అనేక సవాళ్లు ముందున్నాయి. ఈ సమయంలో ఇలాంటి చర్చకు తెరతీయడం అంటే కేవలం చిడతలు వేసే కార్యక్రమమేనంటూ కొందరు పోస్టులు పెడుతున్నారు. ఈ డిమాండ్‌పై అప్పుడే జనసేన నేతలు స్పందిస్తున్నారు. తమ నేత పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని, కేంద్రమంత్రిగా చంద్రబాబు వెళ్లాలని వారు సూచిస్తున్నారు. నారా లోకేష్ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ పదవికి అనర్హుడు కాదని కాదు కాని ఆయనకు చాలా వయసు ఉంది. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ఉన్నారు. లోకేష్‌కు ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తే ఖచ్చితంగా జనసేన నేతలు నొచ్చుకుంటారు. అదే సమయంలో పవన్ కళ్యాణ్ ఆలోచనలో కూడా మార్పు వచ్చే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం మరోసారి ఏర్పడాలని చంద్రబాబు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా కూటమితోనే వెళ్లాలన్నది చంద్రబాబు ఆలోచన. అయితే దానిని గండికొట్టే విధంగా టీడీపీ నేతలు వ్యవహారిస్తున్నారని కేడర్ భావిస్తుంది. సీనియర్ నేతలే ఇలా వ్యాఖ్యానిస్తుంటే ఇక కొత్తగా వచ్చిన నేతల పరిస్థితి ఏంటన్న చర్చ పార్టీలో మొదలైంది. స్మూత్‌గా వెళ్లే పాలిటిక్స్‌ను సీనియర్ నేతలు చేజేతులా పక్కదారి పట్టించేలా ఉందంటున్నారు.నిజానికి నారా లోకేష్‌కు ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి పదవి లేక పోయినప్పటికి ఆయన అంతా తానై వ్యవహారిస్తున్నారు ఆయన మాట కాదని ఏ శాఖలో కూడా అధికారులు పనులు చేయని పరిస్థితి. అలాంటి సమయంలో మిత్రులతో వైర్యం పెంచుకునేలా ఇలాంటి వ్యాఖ్యలు పార్టీకి రాజకీయంగా ఇబ్బంది కలిగిస్తాయని అంటున్నారు. ఇక వేళ నిజంగా లోకేష్‌ను ఉప ముఖ్యమంత్రిగా చేస్తే పవన్ కళ్యాణ్ నొచ్చుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పవన్ ఎలాంటి నిర్ణయం అయినా చూసుకునే అవకాశం ఉంది. 2029లో గెలిస్తే ఈ ప్రతిపాదన తెచ్చిన అర్థం ఉందని ఇప్పుడు ఈ డిమాండ్ తెచ్చి కొన్ని వర్గాలను కావాలని దూరం చేసుకునేలా వ్యవహారిస్తున్నారని అంటున్నారు. తొలుత కడప జిల్లా నేత శ్రీనివాసులురెడ్డి ఈ ప్రతిపాదనను బహిరంగ సభలోనే చేశారు. ఆయన కూడా తన భార్యకు మంత్రి పదవి కోసమే చేశారని సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబునాయుడుకు ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకోవాలో తెలుసు. ఒకరు చెప్పినంత మాత్రాన, డిమాండ్ చేసినంత మాత్రాన తలొగ్గరు. ఇక తాజాగా డిప్యూటీ సీఎం పదవికి నారా లోకేష్ అర్హుడు అంటూ మాజీ మంత్రి సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా ఇదే రకమైన ప్రకటన చేశారు. ఆయన కూడా మంత్రి పదవి కోసమే ఈ రకమైన కామెంట్ చేస్తున్నారని సోషల్ మీడియాలో వైరల్ అంటున్నారు. ఇప్పుడు పిఠాపురం టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ కూడా లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలన్నది ప్రధాన కోరిక అని, ఇందులో తప్పేముందని అంటున్నారు. టీడీపీలో ఏం జరుగుతుంది. లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలన్న దానిని నేతలు ఎందుకు డిమాండ్ చేస్తున్నారు. రోజు రోజుకు ఈ వాయిస్ ఎందుకు పెరుగుతుంది, వెనుక ఎవరైనా కుట్ర పన్నుతున్నారా,ఇదే చర్చ ఏపీ టీడీపీలో మొదలైంది. డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రతిపాదనను సమర్థిస్తున్నామని యువగళం పాదయాత్రలో నాయకత్వాన్ని నిరూపించు కున్నారని, లోకేష్ నాయకత్వానికి ప్రజలు జై కొట్టిందని, లోకేష్ పేరును పరిశీలించాలని పలువురు టీడీపీ సీనియర్ నాయకులు భజన కార్యక్రమం బిగిన్ చేశారు. ఇది రాజకీయంగా తగదన్న సూచనలు వినిపిస్తున్నాయి.

# 24 మందికి సిఎం సహాయనిధి
# చెక్కులు అందించిన ఎమ్మెల్యే కందుల

**మార్కాపురం రూరల్, జనవరి 19 ప్రభాతవార్త**

సిఎం సహాయ నిధి నుండి 24మంది లబ్దిదారులకు మంజూరైన రూ.10లక్షలకు పైగా చెక్కులను మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి ఆదివారం లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించినా కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రోగులకు చేయూతనందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులను అందించడం సంతోషదాయకమని అన్నారు. చెక్కులు పొందిన వారిలో రాచకొండ రమేష్‌కి రూ.68,300లు, మన్నెం వెంకట హరికి రూ.31377లు, మోడి వీరమ్మకి రూ.67,983లు, బొజ్జ వెంకటేశ్వరరెడ్డికి రూ.35,184లు, సొంగ బాల ఈశ్వరికి రూ.27,348లు, నాగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డికి రూ.42,612లు, దర్శి సుబ్బులుకి రూ.25,655లు, వెంకటనందన్‌కి రూ.25వేలు, పోలుదాసు తిరుపతి నాయుడుకి రూ.46,084లు, షేక్ జాకీర్‌కు రూ.56,847లు, బాసాని కాశి వెంకటరమణకు రూ.69,461లు, గంగుల సత్యంకు రూ.60వేలు, గంగాపురం అమర్‌నాథ్‌కు రూ.25,655లు, బోరిగొర్ల బ్రహ్మేశ్వరరావుకు రూ.51,310లు, జెట్టిబోయిన చిన్న గంగయ్యకు రూ.66,572లు, పెండెం శివరావుకు రూ.45వేలు, గుమ్మ హరిబిందుకు రూ.36,897లు, కాయకాకుల వెంకటేశ్వర్లుకు రూ.1,44,006లు, యనమల లక్ష్మికి రూ.25వేలు, వంకేశ్వరం రమాదేవీకి రూ.37,897లు, గుంటు రమేష్‌కు రూ.80,641లు, మారంరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి రూ.1,95,999లు, నాగమ్మకి రూ.32,100లు, నూనె శరభారెడ్డికి రూ.75వేలు, మొత్తం రూ.10.32లక్షల చెక్కులను అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.






# నేటి నుండి పశు ఆరోగ్య శిబిరాలు



**బల్లికురవ, జనవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని 21 పంచాయతీల పరిధిలో నేటి నుండి పశువైద్యశిబిరాలు ప్రారంభించనున్నట్లు బాపట్ల జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు మహేశ్వర రావు, పావని కుమారిలు తెలియజేశారు. ఈ శిబిరాలలో పశువులకు నట్టల వ్యాధి నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, కృత్రిమ గర్భధారణ, చూడి పరీక్షలు, అన్ని రకాల వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. 20వ తేదీన వేలమవారిపాలెం, కొత్తూరు, 21న కూకట్లపల్లి, గొర్రెపాడు, 22కొప్పెరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, 23వైదన కొమ్మినేనివారిపాలెం, 24వల్లపల్లి, అంబడిపూడి, 25న బల్లికురవ, గుంటుపల్లి, 27న ముక్తేశ్వరం, చెన్నుపల్లి, 28కొప్పెరపాలెం, మల్లాయపాలెం, 29నక్కబొక్కలపాడు, కొనిదేన,30న వేమవరం, కే.రాజుపాలెం, 31న ఉప్పుమాగులూరు గ్రామాల్లో శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# మన్నం కుటుంబ సభ్యులకు కరణం పరామర్శ



**బల్లికురవ, జనవరి 19, ప్రభాతవార్త**
వినుకొండ పట్టణంలో ఆదివారం జరిగిన మన్నం వెంకటరత్నం దశ దినకర్మకు చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరాంకృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, స్థానిక నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# వంశీకృష్ణ కుటుంబ సభ్యులకు కరణం పరామర్శ



**బల్లికురవ, జనవరి 19, ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పమిడిపాడు గ్రామానికి చెందిన ఎర్రజానీ పరిశుద్ధరావు చిన్న కుమారుడు ఎర్రజానీ వంశీకృష్ణఇటీవల మరణించాడు. సమాచారం అందుకున్న చీరాల వైసీపీ ఇన్‌ఛార్జీ కరణం వెంకటేష్‌బాబు ఆదివారం ఆదివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి దైర్యం చెప్పి ఓదార్చారు. ఆయన వెంట స్థానిక నేతలు ఉన్నారు.

# పాతమాగులూరులో అన్నదానం



**సంతమాగులూరు, జనవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని పాతమాగులూరు గ్రామంలో శనివారం సాయంత్రం స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా 1500 మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిర్రా విజయ్‌బాబు, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు చల్లా కోటేశ్వరరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చల్లా శివాంజనేయులు, చల్లా బ్రహ్మారావు, చల్లా నాగేశ్వరరావు(టెంటు) చల్లా ధర్మారావు, పత్తిపాటి వీరయ్య, సజ్జల అంబారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్తమ ప్రదర్శన జనరల్ బోగీలు



**మార్టూరు, జనవరి 19, ప్రభాతవార్త**
సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని అనంతవరం గ్రామంలోని ఎన్టీఆర్ కళాపరిషత్ మూడో వార్షికోత్సవంగా రెండు తెలుగు రాష్ట్రాల పరిషత్ నాటికల పోటీలు ఈనెల 15వ తేదీ నుండి 18వ తేదీ వరకు నాలుగు రోజుల జరిగాయి. ఈ పోటీలలో మొత్తం 24 నాటికలు ప్రదర్శించబడగా నాలుగో రోజు ఆఖరి నాటికగా ప్రదర్శించబడిన గుంటూరు జిల్లా కొలకలూరు వారి జనరల్ భోగిలు నాటిక ఉత్తమ ద్రపర్శనగా ఎంపికైందని నిర్వాహకులు తెలిపారు. రైలు ప్రయాణాలలో జనరల్ భోగిలలో ప్రయాణించే ప్రయాణికులకు భద్రత లేని కారణంగా వారికి కూడా గుర్తింపు కల్పించాలని ఉద్దేశంతో రిజర్వేషన్ ప్రయాణికులతో సమానంగా వారి పేర్లను నమోదు చేసుకుని గుర్తింపు ఇచ్చి ప్రమాదాలు ఇతి వృత్తంతో సాగిన ఈ నాటిక వీక్షకులను, ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా యంగ్ థియేటర్ విజయవాడ వారి 27వ మైలురాయి అలాగే ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా మైత్రి కళానిలయం గుంటూరు వారి బ్రహ్మ స్వరూపం ఎంపిక కాగా ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి విశాఖపట్నం వారి(అ)సత్యం నాటికలు నాటిక ఎంపికైంది. ఈ ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలకు న్యాయనిర్ణేతలుగా సీనియర్ కళాకారులు నూతలపాటి కాళిదాసు, కే.దేవేంద్ర, డాక్టర్ రాయల హరిశ్చంద్రలు వ్యవహారించారు. ఈ నాటికల ఉత్తమ ప్రదర్శన విజేతలకు కి.శే పోపూరి వెంకట సుబ్బయ్య సరస్వతిల జ్ఞాపకార్ధం వారి కుమారుడు పోపూరి శివరామ కోటేశ్వరరావు, కోడలు విజయశ్రీ(విశ్రాంత ఉపాధ్యాయులు) స్పాన్సర్ చేసి అందజేయగా ఉత్తమ జ్యూరీ ప్రదర్శనకు, ఉత్తమ నటిగా ఎంపికైన భోగిలు నాటికలో సావిత్రమ్మ పాత్రధారిణిగా నటించిన సురభి ప్రభావతికి కళా పరిషత్ నిర్వాహకులు.

# పచ్చాకు ట్రాక్టర్ డ్రైవర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

## - ఎస్సై మహేంద్ర



**జరుగుమల్లి, జనవరి 19, ప్రభాతవార్త**
పచ్చాకు ట్రాక్టర్ డ్రైవర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జరుగుమల్లి ఎస్సై మహేంద్రహెచ్చరించారు. ఆదివారం పచ్చాకు ట్రాక్టర్ డ్రైవర్లు, రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పచ్చాకు కూలీలను తీసుకెళ్లి పని అయిన తదుపరి పచ్చాకు ట్రాక్టర్ మీదనే సైడు డోర్లు తీసి కూలీలను సైతం ఎక్కించుకొని డ్రైవర్లు మితిమీరిన వేగంతో రావడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రైతులు కూడా బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనేక గ్రామాలలో పచ్చాకు ట్రాక్టర్ తిరగబడి కూలీలు మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. రైతులు పచ్చాకు కూలీలకు వేరే ట్రాక్టర్ లేదా ఆటోలను ఏర్పాటు చేయాలని, అలా కాకుండా పచ్చాకు ట్రాక్టర్ మీదనే కూలీలను ఎక్కించుకుని వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లు లైసెన్సులు, బండి కాగితాలు లేకుండా ట్రాక్టర్లు నడపరాదన్నారు.

# కోడిపందాల స్థావరాలపై పోలీసుల దాడి



**మద్దిపూడి, జనవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని రావెళ్ళవారిపాలెం గ్రామ శివారులో కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై రమేష్‌బబు తన సిబ్బందితో కలిసి కోడిపందాల స్థావరంపై ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పది మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.6550 నగదుతో పాటు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు.

# నాడు విద్యార్థిగా విద్య నభ్యసించడం అపురూపం

## - నేడు ప్రయోజకుడిగా గురువులతో కలిసి సమ్మేళనం చేసుకోవడం అదృష్టం

## - పెద్దదోర్నాలలో ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం




**పెద్దదోర్నాల, జనవరి 19, ప్రభాతవార్త**
పూర్వ విద్యార్థులసమ్మేళనం ద్వారా స్నేహ బంధాలు మరింత బలపడతాయి. విద్యార్థి దశలో చేసిన అల్లరి తుంటరి చేష్టలు చిన్న నాటి జ్ఞాపకాలు ఆనందోత్సవాల మధ్య పంచుకున్నారు. నాడు విద్యార్థిగా గురువులు చెప్పిన బోధనలతో విద్యనభ్య సించడం అపురూపం. తాము చదువుకున్న కాస్‌మెట్స్ మరియు గురువులతో కలిసి సమ్మేళనాలు నిర్వహించుకోవడం పూర్వజన్మ సుకృతమని, ఈ కలయిక అపురూపం ఆదర్శమని ఆనందభాష్పాలతో ఒకరికొకరు చిన్ననాటి జ్ఞాపకాలు మధురస్మృతులు గుర్తు చేసుకున్నారు. పెద్దదోర్నాల లహరి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981-82 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఫ్యామిలీ గెట్ టుగెదర్ అపురూపంగా జరిగింది. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువుల పవిత్ర ఆశీర్వాదాలే శ్రీరామరక్షని, వారి విద్యాబోధనలతో నేడు ప్రయోజకులుగా మారడం మా బంగారు భవిష్యత్తుకు గురువులు బాటలు వేయడం జీవితాంతం రుణపడి ఉంటామని తమ గురువులకు పాదాభిషేకం చేసి పూర్వ విద్యార్థులు సన్మానం చేశారు. ఎక్కడెక్కడో ఇతర రాష్ట్రాలు దేశాల్లో వివిధ వృత్తులో ఉన్న నాటి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి రావడం శోభాయమానంగా ఉంది. చాలా సంవత్సరాల తర్వాత కలుసుకోవడం సంతృప్తినిచ్చిందని భావోద్వేగంతో ఒకరినిఒకరు పలకరించుకుంటూ సంతోషం పంచుకున్నారు. గ్రూపులుగా ఫోటోలకు ఫోజులిచ్చి తమ ఐక్యతను చాటుకున్నారు. అనంతరం వేదికపై ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వి.నాగమూర్తి అధ్యక్షత వహించారు. అలనాటి తెలుగు పండితుడు, రిటైర్డ్ గురువులు ముత్తారెడ్డి వెంగళరెడ్డి మాట్లాడుతూ ఆనాడు విద్యాబోధన చేసిన తమను ఇప్పటికి గుర్తు పెట్టుకుని పాదాభిషేకంతో సన్మానించడం విద్యార్థుల క్రమశిక్షణకు నిబద్ధతకు నిలువుటద్దమని ఆనంద భాష్పాలతో ఆశీర్వదించారు. విద్యార్థులు చదివి ఎదిగి ప్రయోజకులు కావాలని మనస్ఫూర్తిగా తల్లిదండ్రుల తర్వాత గురువులే కోరుకుంటారని తెలిపారు. రిటైర్డ్ లెక్కల మాస్టర్ కనిగిరి రామిరెడ్డి మాట్లాడుతూ పక్షపాతం లేకుండా గురువులు విద్య భోదిస్తారని తద్వారా మీరు ఏ రంగంలో ప్రయోజకులవుతారో అది చూసి గురువుల జన్మ ధన్యత అవుతుందని అన్నారు. రిటైర్డ్ సైన్స్ మాస్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నాటికి నేటికి విద్య వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయని, నాటి విద్య ద్వారానే విద్యార్థులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొంది తమ ముందు ఉండటం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు గాదే బ్రహ్మనందరెడ్డి, రావిక్రింది సత్యనారాయణ, గ్రంధి సుదర్శనం, షేక్ కాశీం, రావిక్రింది సుబ్రహ్మణ్యం, బచ్చు ప్రభాకరరావు, తిరుమల మల్లిఖార్జునరావు, సత్యం, నీరూరి కాశయ్య, పరుచూరి చంద్రశేఖర్ తదితరులు ఈ విద్యార్థుల సమ్మేళనాన్ని పర్యవేక్షించగా 1981-82 బ్యాచ్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడే సజ్జపురం గ్రామానికి మంత్రి రాక

## - పలు అభివృద్ధి పనులు ప్రారంభం - కంచేటి మురళి

**సంతమాగులూరు, జనవరి 19, ప్రభాతవార్త**
రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం సజ్జపురం గ్రామానికి వచ్చి పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని తెలుగుదేశం పార్టీ అద్దంకి నియోజకవర్గం క్లష్టర్-2 ఇన్‌ఛార్జీ కంచేటి మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సజ్జపురం గ్రామ పరిధిలో ఎస్సీ కాలనీ మెయిన్ రోడ్డు నుండి అనోక్ ఇంటి వరకు 10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు గ్రామంలో తెలిపారు. రామయ్య ఇంటి వద్ద నుండి ఊట్ల స్వాములు ఇంటి వరకు రూ.10లక్షల రూపాయలతో నిర్మించి సిమెంట్ రోడ్డు మంత్రి ప్రారంభిస్తారని మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని తెలిపారు.

# ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాలయంలో

## స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం



**సంతనూతలపాడు, జనవరి 19, ప్రభాతవార్త**
జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఒంగోలులోని ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్‌బాబు పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది క్లిన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యాలయం పరిసరాలను, బాత్రూమ్స్‌ను వీరు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్‌బాబు, ఏఎస్సై వెంకటలక్ష్మి, ఐడబ్ల్యూ కృష్ణమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితుడుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును

## పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, జనవరి 19, ప్రభాతవార్త**
ఒంగోలులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సంతనూతలపాడు మండలం పేర్నమిటన పరిధిలోని కృష్ణనగర్ సమీపంలో 39వ డివిజన్‌కు చెందిన కొల్లా వెంకటేశ్వర్లుకు సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ రూ.1,18,088లు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దినేని చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు పచ్చాకు రవాణాలో రైతులు, కూలీలు

# ప్రమాదాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి

## - ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌బాబు



**సంతనూతలపాడు, జనవరి 19, ప్రభాతవార్త**
ట్రాక్టర్లలో పొగాకు పచ్చాకు తరలింపులో రవాణా నందు రైతులు, కూలీలు ప్రమాదాల పట్ల ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్ బాబు కోరారు. ఒంగోలులోని ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో సీఐ శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో గల సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు పోలీసు స్టేషన్ పరిధిలో గల పొగాకు రైతాంగం, పచ్చాకు కూలీలు ప్రమాదాల పట్ల ముందస్తుగా జాగ్రత్తలు వహించాలని సీఐ శ్రీకాంత్‌బాబు కోరారు. పొగాకు కోత కాలంలో పొగాకు పచ్చాకు ట్రాక్టర్లపై బ్యారెన్లు వద్దకు తరలించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పచ్చాకును ట్రాక్టర్లపై ఎత్తుగా వేసుకుని వాటిపైన కూలీలు, అదేవిధంగా వెనుక డోర్ లను తీసి కూలీలు తరచూ కూర్చుంటున్నారని, ఇది ఎంతో ప్రమాదకరమని ఆయన వెల్లడించారు. ఇటీవల కాలంలో దీని వల్ల ఎన్నో ప్రమాదాలు సంభవించాయని ఆయన తెలిపారు. అంతే కాకుండా కార్మికులు మృత్యువాతకు లోనయ్యారని ఆయన తెలిపారు. పొగాకు



తరలింపు కాలంలో పచ్చాకును ఒక ట్రాక్టర్‌పై కూలీలను మరొక వాహనంపై తరలించాలని దీని వల్ల ప్రమాదాలు నివారింపబడతాయని ఆయన పేర్కొన్నారు. దీనిని ఉల్లంఘించి పచ్చాకు తరలించే ట్రాక్టర్‌పై కూలీలను ఎక్కించుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఒంగోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. మద్దిపాడు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు మండలాల పరిధిలోని పొగాకు రైతాంగం దీనిని గమణించి ప్రమాదాల పట్ల ముందస్తుగా ఈ చర్యలు తీసుకోవాలని సీఐ శ్రీకాంత్‌బాబు కోరారు.

# భారీగా అనర్హులు.. పెన్షన్ కట్

**ఒంగోలు, ప్రభాతవార్త**
సామాజిక పెన్షన్లను పెద్ద మొత్తంలో పెంచి ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం లబ్దిదారులకు అందిస్తుంది. నిజానికి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4వేలను పెన్షన్‌గా అందించే ఏకైక రాష్ట్రంగా ఏపీ నిలిచింది. దీని కోసం కోట్లాది రూపాయలు ఖజానా నుంచి ఖర్చవుతున్నాయి. అయితే అర్హులు ఎంత మంది ఉన్నా, పెన్షన్లు ఎంత మొత్తం ఉన్నా ఇచ్చే విషయంలో తప్పు లేదు కాని అనర్హులు పెన్షనర్‌గా ఉంటే మాత్రం అది ప్రజాధనం వృధా కింద లెక్క. అంతే కాదు చాలా మంది అర్హులకు అన్యాయం జరిగినట్లే గా చూడాలి. ఈ నేపథ్యంలో అనర్హులను, బోగస్ లబ్దిదారులను ఏరివేసేందుకు కూటమి సర్కారు ఈ మధ్య కాలంలో పెద్ద ఎత్తున ప్రత్యేక చొరువ నిర్వహించింది. రాండమ్ చెకప్‌గా సాగిన సర్వేగా ఉంది. అయితే సర్వేలోనే భారీగా అనర్హులుగా ఉన్నట్లు తేలింది. అందులో ఎక్కువగా శాతం కేసులు వికలాంగుల కోటాలోనే అని సర్వే నివేదికలో తేలిందని అధికారులు అంటున్నారు. దాంతో ప్రభుత్వం ఇప్పుడు పూర్తి స్థాయి సర్వేను నిర్వహించాలని డిసైడ్ అయిందని అంటున్నారు. ఇక సర్వే నివేదికను చూస్తే కనుక తక్కువ మోతాదులో వికలాంగత్వం ఉన్నా కూడా ఎక్కువగా ఉన్నట్లు రాయించుకుని పెన్షన్లు పొందుతున్నారని అంటున్నారు. ఇక ప్రభుత్వం వృద్దాప్య పింఛన్లు రూ.4వేలు ఇస్తుంది. అదే సమయంలో వికలాంగులకు రూ.6వేలు నెలకు చెల్లిస్తుంది. దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులకు, మంచం పడిన వారికి నెలకు రూ.15వేలు ఇస్తున్నారు. అంతే కాదు పక్షవాతంతో బాధపడే వారికి రూ.10వేలు పెన్షన్ ఇస్తున్నారు. దాంతో ఈ పెన్షన్లలో భాగా బోగస్ లెక్కలు ఉన్నాయని అంటున్నారు. ఆరోగ్య పెంఛన్ల తనిఖీలో బోగస్‌లు కొక్కోలు. బోగస్ లబ్దిదారులను బృందాలు ప్రశ్నించడంతో పలాన వ్యక్తి నగదు తీసుకుని తమకు సర్టిఫికేట్ ఇచ్చారని చెప్తున్నారు. పశ్చిమ ప్రాంతంలో ఎక్కువగా ఈ బోగస్ వికలాంగుల సర్టిఫికేట్లు మంజూరైనట్లు తెలుస్తోంది. దృవీకరణ పత్రం కోసం నమోదు చేసి ఆయా వైద్యాధికారులతో మాట్లాడి సర్టిఫికేట్లు మంజూరు చేసినట్లు బృందాలు గుర్తించాయి. ఒక్కో దృవీకరణ పత్రం కోసం రూ.20వేలు నుంచి రూ.25వేలు నెట్ సెంటర్ నిర్వాహకుడు వసూళ్ల చేసినట్లు సమాచారం. పెన్షన్ పొందేందుకు అన్ని అవయవాలు బాగున్న వ్యక్తులు కూడా తమకు పక్షవాతం, క్యాన్సర్‌లో అవయవాలు కోల్పోయినట్లు దృవీకరణ పత్రాలు తీసుకున్నట్లు తేలింది. విచారణ బృందాల తనిఖీ సమయంలో కొంత మంది ఆరోగ్య పింఛన్లు పొందుతూ మోటారు సైకిళ్ల మీద ఇళ్లకు రావడం, ట్రాక్టర్లు తోలడం, పనులకు వెళ్ళడం వంటి వాటిని కూడా గుర్తించినట్లు తెలిసింది. వారందరికి దృవీకరణ పత్రాలు ఏ విధంగా ఇచ్చారో వైద్య బృందాలు తేల్చే పనిలో ఉన్నాయి. 494 డయాలసిస్ పింఛన్లలో 415 అక్రమంగా ముందుగా నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. మంచానికి, వీల్ చైర్‌కు పరిమితమైనట్లు పింఛన్లు పొందుతున్న వారిలో 70 శాతం అనర్హులుగా తేలినట్లు సమాచారం. జిల్లాలో ఆరోగ్య పింఛన్లు అక్రమాలు తేలుతున్నాయి. కిడ్నీ బాధితులుగా పింఛన్లు పొందుతూ అనర్హులుగా తేలిన 415మందికి వచ్చే నెల నుంచి పింఛన్ల పంపిణీ నిలిపివేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో పూర్తిగా మంచానికే , వీల్ చైర్‌కు పరిమితమైన వారు రూ.15వేలు పింఛన్ పొందుతున్నారు. ఈ తరహా లబ్దిదారుల్లో కూడా బోగస్ ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నట్లు తెలిసింది. జిల్లాలో ఈ కేటగిరి కింద 1236 మంది లబ్దిదారులు ఉన్నారు. పది రోజులుగా వైద్యులతో కూడిన ఐదు బృందాలు లబ్దిదారుల ఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీరిలో కూడా మంచానికి, వీల్ చైర్‌కు పరిమితం కాకుండా భాగా తిరుగుతున్న వారికి కూడా ఈ కేటగిరి కింద నెలవారి పింఛన్లు అందుతున్నట్లు గుర్తించారు. ఈ పరీక్షలు కూడా త్వరలోనే వైద్య బృందాలు పూర్తి చేయనున్నారు. ఈకేటగిరిలో కూడా 70శాతం బోగస్‌ఉండవచ్చని వెలుగు అధికారులు అనుమానిస్తున్నట్లు సమాచారం. వీటికి కూడావచ్చే నెల నుంచి పింఛన్ కట్ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

# వైభవంగా గోపూజ, మహానివేదన అభిషేకోత్సవం

**సీఎస్‌పురం, జనవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ఆద్వర్యంలో మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవ కార్యక్రమం వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ నారాయణస్వామి వారి మూల విగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవిస మేత విష్ణుమూర్తి వారి ఉత్సవ మూర్తులకు పంచాతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ గాచం విశిష్ట పూజలు నిర్వహించారు. అదే విధంగా గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించి భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి మహా నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు, కొమ్మినేని వెంకటరావు, మన్నేపల్లి శ్రీనివాసులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వర్ధతి సందర్భంగా రజ్జబ్‌భాషా రక్తదానం

**సీఎస్‌పురం, జనవరి 19, ప్రభాతవార్త**
టీడీపీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆదివారం పామూరులోని సత్య నారాయణస్వామి కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టు వారి ఆద్వర్యంలో నిర్వహించిన మెగా లెజెండ్ బ్లడ్ డొనేషన్ క్యాంపెయిన్‌లో తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్ భాషా రక్తదానం చేయడంతో పాటు కోవిలంపాడు గ్రామ పంచాయతీ నుండి పలువురిని రక్తదానం శిబిరంకు తీసుకుపోయి వారిచేత రక్తదానం చేయించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అందుకే తాను రక్తదానం చేయడంతో పాటు పలువురిచేత రక్తదానం చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రజ్జబ్ భాషాతో పాటు పలువురు రక్తదాతలు నిర్వాహకులు డీవీ మనోహర్, పామూరు పట్టణ యువత అధ్యక్షుడు పందిటి హరిష్, షేక్ ఖలీలు, సయ్యద్ అబీర్‌బాలు దృవీకరణ పత్రం, ప్రశంసా పత్రాలను రక్తదాతలకు అందజేశారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

## - ఎస్సై వి.మహేష్

**పెద్దదోర్నాల, జనవరి 19, ప్రభాతవార్త**
ఇళ్ల పరిసరాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను కూడాపరిశుభ్రంగా ఉంచి వ్యాధులు రాకుండా పారిశుధ్యం పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పెద్ద దోర్నాల ఎస్సై వి.మహేష్ కోరారు. పెద్దదోర్నాల పోలీసు స్టేషన్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర- స్వేచ్ఛ దివస్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పోలీసు సిబ్బంది కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఎస్సై మహేష్ పోలీసు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

# పంట ఉత్పత్తులకు మద్దతు ధర పలికేలా చట్టం చేయాలి

## - స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి

## - ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి

**కొనకనమిట్ల, జనవరి 19, ప్రభాతవార్త**
రైతులు పండించిన పంటలకు మద్దతు ధర పలికేలా చట్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్రా వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గుజ్జల యలమందరెడ్డి స్మారక భవన్లో జరిగిన రైతు సంఘం సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి మాట్లాడుతూ బడా వ్యాపారులకు రాయితీలు ఇస్తున్నారే తప్పా, రైతులకు సాయం అందించుటలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని దుయ్యబట్టారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సులను అమలు చేయాలని, హర్యానా సరిహద్దుల్లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకులు జగజీత్ సింగ్ దల్లైలావ ఆరోగ్యం కాపాడాలని, 55 రోజుల నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా మోదీ ప్రభుత్వానికి తలవంచి పని చేస్తుందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ఎంతో నష్టమని, వాటిని అడ్డుకోవాలని సూచించారు. మార్కాపురం నియోజకవర్గ ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పీవీ కొండయ్య మాట్లాడుతూ రైతు సంఘం సభ్యత్వం చేపడతామని గ్రామాల్లోనే త్వరలో కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం అధ్యక్షులు సిగనం వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి కే.కోటేశ్వరరావు, నాయకులు సీహెచ్ పెద్ద సిద్దయ్య, కృష్ణయ్య, కే.కొండలు, శ్రీనివాసులు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేత

**కనిగిరి, జనవరి 19, ప్రభాతవార్త**
కనిగిరి మండలం వాగుపల్లి పంచాయతీలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రానికి ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, మర్తల వెంకటేశ్వరరెడ్డి, కనిగిరి నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు సంగటి మహేంద్రరెడ్డి, చిన్న ఇర్లపాడు సర్పంచ్ ముద్దబాబు, ఏరువారిపల్లి సర్పంచ్ దమ్ము వెంకటయ్య, మిట్ట రమేష్‌రెడ్డి, కనిగిరి మండల వాలంటరీ వింగ్ ప్రెసిడెంట్ మడతల వెంకటేశ్వర్లు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి విన్నర్ ఏరువారిపల్లి టీమ్‌కు మూలే గోవిందారెడ్డి వాగుపల్లి సర్పంచ్ రూ.20,116, రెండో బహుమతి వాగుపల్లి టీమ్‌కు మూలే గోపాల్‌రెడ్డి రూ.15,116, మూడో బహుమతి వాగుపల్లి జూనియర్స్ టీమ్‌కు వెంకటగిరి మాల్యాద్రి రూ.10,116లు అందించారు. కమిటీ నెంబర్స్ వీరంరెడ్డిబాబు, వెంకటేశ్వరరావు, నాగేందర్‌బాబు, భార్గవ్, ఇర్మనియా, ప్రసంగి, ఈశ్వరరావు, రమేష్, సైదులు,హనుమంతు, చిన్న వెంకట సుబ్బయ్య, కృష్ణారెడ్డి, వెంకట నారాయణ, శివారెడ్డి పాల్గొన్నారు.

# గ్రంధాలయాన్ని ఉపయోగించుకోవాలి

**టంగుటూరు, జనవరి 19, ప్రభాతవార్త**
టంగుటూరులోని శాఖా గ్రంధాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం గ్రంధపాలకుడు గుమ్మడి వర్ధన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంధపాలకుడు మాట్లాడుతూ పిల్లలు వచ్చి చక్కగా పాల్గొని ఇష్టపడి చదుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు గ్రంధాలయాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

## ఒంగోలులో యూట్యూబ్ జిల్లా న్యూస్ ఛానల్‌ను

### ప్రారంభించిన రాష్ట్ర డైరక్టర్ మధుసూదన్‌రావు

**సంతనూతలపాడు, జనవరి 19, ప్రభాతవార్త**

ఒంగోలులోని కర్నూలు రోడ్డు నందు గల ఫ్లైఓవర్ సమీపంలో యూట్యూబ్ ఛానల్స్ ఆఫ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యాలయాన్ని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరక్టర్ వల్లూరి మధుసూదన్‌రావు ప్రారంభించారు. వ్యవస్థాపక అధ్యక్షులు గుండారెడ్డి మల్లిఖారుజనరెడ్డి దీనిని పర్యవేక్షించారు. రాష్ట్రంలో యూట్యూబ్ న్యూస్ చానెల్స్‌లో పని చేసే రిపోర్ట్సు కు, యాజమాన్యాలకు రావాల్సిన రాయితీలు, ఇన్సూరెన్స్‌లు, ఇళ్ల స్థలాలు, ఫీజు రాయితీలు కల్పించాలని అధ్యక్షులు గుండారెడ్డి మల్లిఖార్జున్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం వ్యవస్థాపక అధ్యక్షులు గుండారెడ్డి మల్లిఖార్జున్‌రెడ్డి, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరక్టర్ వి.మధుసూదన్‌రావులను ఈ సందర్భంగా పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శివ కృష్ణ, జిల్లా అధ్యక్షులు నవీన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా సహాయక కార్యదర్శి ఇస్తర్ల శ్రీనివాసరావు, సంఘ నాయకులు మధుర తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు తగ్గించే విధంగా పోలీసు చర్యలు చేపట్టాలి

### – డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ

**ముండ్లమూరు, జనవరి 19, ప్రభాతవార్త**

మండలంలోని 22 పంచాయతీ పరిధిలోని 45 గ్రామాల్లో నేరాలు తగ్గించే విధంగా ముండ్లమూరు పోలీసులు చర్యలు చేపట్టాలని దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. ముండ్లమూరు పోలీసు స్టేషన్ వార్షిక తనిఖీలలో భాగంగా ఆదివారం ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో రికార్డులను తనిఖీలు నిర్వహించారు. ముందుగా పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. బ్రిటీష్‌కాలంలో 1901లో నిర్మించిన పాత పోలీసు స్టేషన్‌ని పరిశీలించి సెటిల్ బ్యాట్మింట్ కోర్టుని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం కంటే నేరాలు తగ్గుముఖం పట్టాయని, గతంలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు పెంపు సెట్లు కేబుల్ వైర్లు ట్రాక్టర్ పెట్టెలు ఎక్కువగా చోరీలు జరిగాయని నేరస్తులను పట్టుకొని కోర్టులో హాజరుపరచడం జరిగిందని, అప్పటి నుండి నేరాలు తగ్గుముఖం పట్టాయని, స్టేషన్లో రికార్డులన్ని సక్రమంగా ఉన్నాయని, పోలీసు పనితీరు బాగుందని, సంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాల, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వై.రామారావు, ఎస్సైలు వై.నాగరాజు, ఎం.మురళి, మల్లిఖార్జునరావు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లురెడ్డి, హనుమంతరావు, రైటర్ బి.వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధిలో ఆర్యవైశ్యులు పాత్ర కీలకం

### – డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**ముండ్లమూరు, జనవరి 19, ప్రభాతవార్త**

ముండ్లమూరు మండలం వేంపాడు వద్ద గల ఆంజనేయస్వామి దేవస్థానంలో ముండ్లమూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అమర శ్రీరామ్మూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలన్నా, వ్యాపారాలు అభివృద్ధి చెందాలన్నా ఆర్యవైశ్యుల పాత్ర కీలకం అన్నారు.వ్యాపారాలకు కేరాఫ్‌గా ఆర్యవైశ్యులు ఉన్నారు అంటే అతిశయోక్తి లేదు. ఏ గ్రామంలో చూసిన ఆర్యవైశ్యులు వ్యాపారంచేస్తూ ఆ గ్రామ అభివృద్ధికి, ఆ ప్రాంత అభివృద్ధికి దోహపడుతుంటారు. మారిన కాలంలో ఆర్యవైశ్యులకు ధీటుగా కొందరు వ్యాపంరంలోకి వచ్చినప్పటికి ఆర్యవైశ్యులకు ఉన్న కమిట్మెంట్ ఇతర వర్గాలకు ఉండదని నా అభిప్రాయం అన్నారు. అయితే వ్యాపారం సక్రమంగా జరిగేందుకు ప్రభుత్వాల సహకారం అవసరం మాజీ ముఖ్యమంత్రి వర్యులు దివంగత కొణిజేటి రోశయ్య జయంతి వర్ధంతి కార్యక్రమాల్లో కూడా గత ముఖ్యమంత్రి పాల్గొనే పరిస్థితుల్లో లేరంటే ఆర్యవైశ్యులపై గత ప్రభుత్వం ఎంత కక్ష సాధింపు చేపట్టిందో మీరంతా తెలుసుకోవాలన్నారు. నేడు దర్శి ప్రాంతంలో వ్యాపారస్తులందరూ వచ్చి అమ్మ మీ ప్రభుత్వం వచ్చాక మేము ఎంతో సంతోషంగా ఉన్నాము, మామూళ్ల కోసం కమీషన్ల కోసం వాటాల కోసం దాడులు బెదిరింపులు లేవని మీరు చెప్పినట్లే వ్యాపారాలు స్వేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. కొలతల పేర్లతో కమర్షియల్ ట్యాక్స్, డ్రగ్స్ ఇన్స్పెక్టర్‌ల పేర్లతో పొల్యూషన్ పేరుతో, రెవెన్యూ మున్సిపల్ అధికారుల పేర్లుతో నిత్యం వ్యాపారుల మీద దాడులు చేస్తూ దౌర్జన్యాలు చేస్తూ కమీషన్లు ముక్కు పిండి వసూళ్లు చేసిన పరిస్థితులు గతంలో మేము చూశాం, మీరు కనీసం మమ్మల్ని పిలిచి కూడా మాట్లాడలేదు. అందుకే మిమ్మల్ని ఎంతగానో అభిమాస్తున్నాం, గౌరవిస్తున్నాం, మిమ్మల్ని సత్కరించుకుంటామమ్మ అంటున్నారు. మా దగ్గరకు కొంత మంది వచ్చి చెబుతుంటారు మనకు ఎన్నికల్లో పనిచేయలేదని ఓట్లు వేయలేదని వ్యతిరేకంగా పనిచేశారని, వారిని ఇబ్బంది పెట్టాలని కొందరు వచ్చి చెబుతూ ఉంటారు. మన ప్రభుత్వం కక్ష సాధింపు ప్రభుత్వం కాదని మనది అభివృద్ధి ప్రభుత్వమని సంక్షేమ ప్రభుత్వం అని నేను వారికి చెప్పి పంపిస్తుంటాను అని అన్నారు. యువకులు ఉత్సాహవంతులు అమర శ్రీరామమూర్తికి ముండ్లమూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా నియమితులు అవ్వడం నాకు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట హనుమంతరావు, ఆర్యవైశ్య టీడీపీ నాయకులు బొగ్గవరపు సుబ్బారావు, నియోజకవర్గంలోని వివిదహోదాల్లో ఉన్న ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

### – కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి మిరప తోటని పరిశీలించిన రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మ(రెడ్డి శ్రీనివాసులురెడ్డి

**ముండ్లమూరు, జనవరి 19, ప్రభాతవార్త**

మండలంలోని పూరిమెట్ల గ్రామంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని రాష్ట్రంలో 70శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని వ్యవసాయ రంగానికి కోడం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని భూసార పరీక్షలు దగ్గర ఉండి నీటి వసతులు కల్పించే వరకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు వ్యవసాయ పంటలు నష్టపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వైసీపీ ప్రభుత్వం రైతు దగా ప్రభుత్వం అని అయన అన్నారు. గత ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింక్లర్లు అటకెక్కించిందని మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేస్తుందని అన్నారు. పంటలలో తెగుళ్ల పురుగులు వస్తే వాటి నివారణకు చర్యలు ప్రభుత్వం చేస్తుందని, వ్యవసాయం ఎలా ముందుకు తీసుకెళ్లాలి, వ్యవసాయాన్ని ఎలా కాపాడుకోవాలి అనే ఆలోచనలతో చంద్రబాబునాయుడు ముందుకు వెళ్తున్నారని, రైతు రథాలు డ్రోణ్ సిస్టంలు దాన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని 24 గంటలకి రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి నగదు చెల్లిస్తుందని ఖరీఫ్ సీజన్లో కృష్ణ, గోదావరి తీరాన పండిన వరి ధాన్యాన్ని నష్టపోకుండా మిల్లులకి తరలించడం జరుగుతుందన్నారు. విద్యుత్ కూడా రైతులకు ఎక్కువ సమయం మా ప్రభుత్వం కల్పిస్తుందని, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్‌గా నేను కూడా పరిశీలించామని ,పోలవరం ప్రాజెక్టుకి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 12 వేల కోట్లు కేటాయించిందని, కొత్త దయాఫ్రమ్ వాల్ నిర్మించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోడిగ మస్తాన్ రావు, ఎంపీటీసీ చింతలపల్లి వెంకటేశ్వర్లు, స్కూల్ చైర్మన్ నీడిగంటి వెంకటేశ్వర్లు, వైస్ సర్పంచ్ పయ్యావుల ఏడుకొండలు, నిడిగంటి నారాయణ, చొప్పరపు నాగేశ్వరరావు, చింతలపల్లి వెంకటస్వామి, ఒట్టి గొర్ల ఏడుకొండలు, ఒగురురి నాగేశ్వరరావు, డీలర్ రమణల ఏడుకొండలు, స్కూల్ చైర్మన్ చొప్పరపు రామకృష్ణ, ఒగురూరి నాగయ్య, వంగాల శ్రీనివాసులురెడ్డి, నర్షారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షా గోబ్యాక్

### – కేంద్ర మంత్రి నుండి వైదొలగాలి

**ముండ్లమూరు, జనవరి 19, ప్రభాతవార్త**

19న అమిత్ రాకను వ్యతిరేకిస్తూ ముండ్లమూరులో అంబేద్కర్ బొమ్మ వద్ద నిరసన తెలియజేసిన సీపీఎం కార్యకర్తలు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడారు. హోంమంత్రిగా ఉన్న అమిత్‌షా భారత రాజ్యాంగం పై ప్రమాణం చేసి ఆ రాజ్యాంగాన్ని రచించిన నిర్మాత అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ని ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేయడం అంటే ఈ దేశ ప్రజలందరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే అవుతుందని అన్నారు. అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోడపాటి హనుమంతరావు, పేంటా ఏడుకొండలు, బొమ్మతోటి రాజా, రమేష్, పొట్లూరి సుబ్బారావు, నన్నం రామాంజనేయులు, గోపనబోయిన హనుమంతరావు, తిరుపతిరావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు అందుకున్న కస్తూరిబా ప్రిన్సిపల్ ఎస్.తిరుమలదేవి

**య ర్రగొండపాలెం,జనవరి19,ప్రభాతవార్త**

య ర్రగొండపాలెం కస్తూర్బాపాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ తిరుమలదేవికి సావిత్రిబాయి పూలే నేషనల్ ప్రతిభా అవార్డు ఆదివారం గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సౌథెర్న్‌ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్పీయల్‌టిఓ)సంస్ధ గౌరవఅధ్యక్షులు ఎమ్మెల్సీ కే.లక్ష్మణరావు,రాష్ట్రఅధ్యక్షులు డాక్టర్ పాయర్ద నాగయ్య చేతుల మీదుగా సావిత్రిబాయి పూలే నేషన్ ప్రతిభా అవార్డును అందుకున్నారు.య ర్రగొండపాలెం లోని కస్తూర్భిపాఠశాల సిబ్బంది అమెను అభినందించారు.

## అధ్యక్షులు అమర శ్రీరామమూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

**ముండ్లమూరు, జనవరి 19, ప్రభాతవార్త**

ముండ్లమూరు మండలంఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులు అమర శ్రీరామమూర్తి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు. ముందుగా వేంపాడు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి గుడిలో పూజలు నిర్వహించి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో కొన్ని వేల కోట్లతో నేను మంత్రిగా ఉన్నప్పుడు అభివృద్ధి చేశానని, దర్శి నియోజకవర్గ ప్రజలు ఎవరు మర్చిపోరని ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని, అభివృద్ధి అంటే శిద్దా అని నూతన కమిటీ వర్గ సభ్యులందరికి అభినందించి, అన్ని సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందు ఉండాలని సభను ఉద్దేశించి మాట్లాడారు.అనంతరం శాలువాతో శిద్దా రాఘవరావుని ఘనంగా సన్మానించిన ఆర్యవైశ్య కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు కోటా హనుమంతరావు, ఆర్యవైశ్య నాయకులు బొగ్గవరపు సుబ్బారావు, సూరే చిన్న సుబ్బారావు, యువజన విభాగంనాయకులు చందోలు మణికంఠ, ముండ్లమూరు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

## గోబ్యాక్ అమిత్ షా

### – కేంద్ర హోంశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలి

**దర్శి, జనవరి 19, ప్రభాతవార్త**

సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిఏకిస్తూ సీపీఎం, సీపీఐ పార్టీలు దర్శి ఎంపీడీఓ కార్యాలయంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ నియోజకవర్గ నాయకులు మాదపాకుల రమేష్‌బాబు, తాండవ రంగారావు మాట్లాడుతూ హోంమంత్రిగా ఉన్న అమిత్‌షా భారత రాజ్యాంగం పై ప్రమాణం చేసి ఆ రాజ్యాంగాన్ని రచించిన నిర్మాత అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ని ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేయడం అంటే ఈ దేశ ప్రజలందరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే అవుతుందని అన్నారు. అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు రాచపూడి కరుణానిధి, కేవీ పిచ్చయ్య, కల్లూరి ఆంజనేయులు, ఈమని నాగేశ్వరరావు, ఉప్పు నారాయణ, ఇత్తడి సామ్యేల్ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం

**ముండ్లమూరు, జనవరి 19, ప్రభాతవార్త**

ముండ్లమూరు మండలం ఉల్లగల్లు గ్రామంలో హరిజన వాడలో పునుగుపాటి విజయరావు మరణించిన విషయం గ్రామ పెద్దల ద్వారా విషయం తెలిపారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు అని కడు మిక్కిలి పేద వాడు అని వారికి మట్టి ఖర్చులకు మానవత సంస్థ ద్వారా ఆర్థిక సమాయం చేయాలని కోరగా సంస్థ స్పందించి రూ.5వేలు సహాయం చేయడం జరిగింది. అలాగే సంస్థలో డైరక్టర్ రెడ్డిమాసు రాఘవులు కూడా తాను సొంతంగా మరో రూ.5వేలు సహాయం చేయడం జరిగింది. ఈ సహాయం సంస్థ చైర్మన్ దేవత వరప్రసాద్, రాఘవులు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, అధ్యక్షులు దనిరెడ్డి వెంకటరెడ్డి, సంస్థ ట్రెజరర్ గొర్రెపాటి వేణు, సంస్థ డైరక్టర్‌లు జైహింద్ రెడ్డి, సుశీల, బిక్షాలరెడ్డి, పొదిలి మానవత సంస్థ శాంతి కమిటీ సభ్యులుఎద్దు నాగేష్, గ్రామసర్పంచ్ జనమాలనాగేంద్రం,పిచ్చయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కరెంటు స్తంభాన్ని ఢీ కొని వరి పొలంలో కూరుకుపోయిన కారు

**దర్శి, జనవరి 19, ప్రభాతవార్త**

మండలంలోని తూర్పువీరాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన దర్నాసి చిన్న బాబు(27) తన స్నేహితులైన మాలపాటి అనిల్(22), యరమాల ధర్మారావు(21) కలిసి యరమాల ధర్మారావుకి చెందిన కారులో తూర్పు వీరాయపాలెం గ్రామ పొలిమేర కి వెళ్లి అక్కడ తమతో పాటు తీసుకెళ్లిన మద్యం తాగి, అది సరిపోక మరలా బొట్లపాలెం వెళ్లి అక్కడ మద్యం కొని తాగి, తిరుగు ప్రయాణంలో తమ ఊరికి బయలుదేరి వెళ్తూ యరమాల ధర్మరావు కారు నడుపుతూ ఉండగా మృతుడు మాలపాటి అనిల్ డ్రైవర్ పక్కన ముందు సీట్లో కూర్చుని ఉండగా ధర్నాసి చిన్నబాబు కార్ వెనుక సీట్లో కూర్చొని వెళ్తూ మార్గమధ్యలో తూర్పు వీరాయపాలెం గ్రామ శివారులోని రోడ్డు మలుపు వద్దకు వచ్చే సరికి కాదు నడుపుతున్న యరమాల ధర్మారావు కారును అదుపు చేయలేక రోడ్డుకి కుడి వైపున ఉన్న వరి పొలంలోనికి కార్‌ని పోనివ్వగా అక్కడే ఉన్న సిమెంట్ కరెంట్ స్తంభాన్ని కారు ఢీకొట్టి కారు తిరగబడింది. ఈ ప్రమాదంలో ముందు సీట్లో కూర్చున్న మాలపాటి అనిల్‌కి దెబ్బలు తగిలిపొలంలో ఉన్న బురదలో కూరుకుపోయి సృహ కోల్పోయాడు. దర్నాసి చిన్నబాబుకి తలపై చిన్న గాయాలు కాగా, డ్రైవర్ యరమాల ధర్మారావుకి ఎటువంటి గాయాలు కాలేదు. అంతటా చుట్టూ పక్కల వారు వచ్చి వారిని దర్శిలోని ప్రభుత్వ హాస్పిటల్‌కి తీసుకొని రాగా, డ్యూటీ డాక్టర్ గాయపడిన మాలపాటి అనిల్‌ని పరీక్షించి చనిపోయాడు. ఈ ప్రమాదంపై దర్శి పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

## గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

**తాళ్లూరు, జనవరి 19, ప్రభాతవార్త**

మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమరప్పాడులో ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మీ అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వరశర్మ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ పక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో జి.వాసుబాబు, చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌ఏ కాటూరి ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు

**య ర్రగొండపాలెం,జనవరి19,ప్రభాతవార్త**

యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం నాడు విజయవంతంగా ముగిశాయి.టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి కప్పులను అందజేశారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా దర్శి ఎమ్మెల్యే జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టి అధ్యక్షులు బుచేపల్లి శివప్రసాద్‌రెడ్డి,య ర్రగొండపాలెం ఎమ్మెల్యే,రాష్ట్రఅధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పార్లమెంట్ పరిశీలకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గారి తనయుడు హర్షిత్ రెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు.ప్రథమ బహుమతి చాపలమడుగు సర్పంచ్ సత్యనారాయణరెడ్డి 50వేలు రెంవ బహుమతి మర్రివేముల ఉపసర్పంచ్ ఎల్లారెడ్డి రోషిరెడ్డి 30వేలు,మూడవ బహుమతి,య ర్రగొండపాలెం మండల కన్వినర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి,జబిబుల్లా,20వేలు నగదును అందజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం

**మద్దిపాడు, జనవరి 19, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి మూడో శనివారం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని స్థానిక పోలీసు స్టేషన్ నందు సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై బి.శివరామయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం స్వచ్ఛంద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రంగా ఉంచుకుంటే మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని ఆరోగ్యమే మహాభాగ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీసు స్టేషన్, పరిసరాలను, కార్యాలయంలోనే వివిధ విభాగాల రూములను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రోత్ సెంటర్‌లో పని చేసే వ్యక్తి కనపడలేదని ఫిర్యాదు

**మద్దిపాడు, జనవరి 19, ప్రభాతవార్త**

గ్రోత్ సెంటర్‌లోని ఓ గ్రానైట్ కంపెనీలో పని చేస్తున్న వ్యక్తి గత ఎనిమిది నెలల నుండి కనపడట్లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి చెందిన ఆత్మఊరు శ్రీనాథ్ గత 5 సంవత్సరాల నుంచి ఒంగోలులో నివసిస్తున్నాడు. జీవన ఉపాధి నిమిత్తం మండల పరిధిలోనే గ్రోత్ సెంటర్‌లో ఎంఎస్ గ్రానైట్ కంపెనీ నందు పని చేస్తున్నాడు. గత 8 నెలలకిందట తన తల్లి అయిన ఆత్మకూరు అంజమ్మకు కంపెనీకి వెళ్తున్నానని ఇంటి దగ్గర చెప్పి వెళ్లాడని అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంటికి రాలేదని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎస్సై శివరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

## ఘనంగా యోగివేమన జయంతి వేడుకలు

### – జిల్లా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ

**మార్కాపురం రూరల్, జనవరి 19 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని దోర్నాల బస్టాండు సమీపంలోగల రెడ్డి సంక్షేమ సేవా కార్యాలయం నందు రెడ్డి సంక్షేమ సేవాసంఘం నియోజకవర్గం కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అనంతరం యోగి వేమన జయంతిని పురస్కరించుకొని గోలమారి కాశిరెడ్డి, గుంటక భాస్కర్ రెడ్డి, బత్తుల వెంకటరెడ్డి, కందుల లక్ష్మీరెడ్డి ఆర్థిక సహకారంతో స్థానిక జిల్లా వైద్యశాఖ నందు రోగులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక జిల్లా వైద్యశాల నందు వైద్యశాల సిబ్బంది సహకారంతో వార్డులలోగల రోగులకు రొట్టెలు, పండ్లను అందించారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సేవాసంఘం సభ్యులు మాట్లాడుతూ నిరాడంబరుడైన యోగివేమన జయంతి గుర్తు చేసుకుంటూ పేదలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగాఉందని అన్నారు.రెడ్డి సంక్షేమ సేవాసంఘం పేదలకోసం ఎప్పుడు ముందుంటుందని, మంచి కార్యక్రమం కోసం పాటుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సేవాసంఘం సభ్యులు డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, కంది ప్రమీల రెడ్డి, తిరుమలరెడ్డి రామిరెడ్డి, కుందూరు రమణారెడ్డి, వెన్న వెంకటరెడ్డి, ఆర్‌వి సుబ్బారెడ్డి, బట్టగిరి శివారెడ్డి, గోరంట్ల చిన్న వెంకట్‌రెడ్డి, దండా వెంకటరెడ్డి, డివిఆర్, కుందూరు సుబ్బారెడ్డి, గొట్టం శ్రీనివాస్ రెడ్డి, రావి లక్ష్మీరెడ్డి, జవాజ్ వెంకట రంగారెడ్డి, సానికమ్మ వెంకటేశ్వరరెడ్డి, తిరుమల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోగిరెడ్డి నారాయణ రెడ్డి, బట్టగిరి లక్ష్మీరెడ్డి, ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, వైద్యశాల సిబ్బంది, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ముగిసిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ క్రికెట్ టోర్నమెంట్

**యర్రగొండపాలెం రూరల్, జనవరి 19 ,ప్రభాతవార్త**

జిల్లా స్థాయిలో యర్రగొండపాలెం పట్టణంలోని రాళ్ళవాగు ప్రైవేటు బ్రిడ్జి పంచాయితీ పార్కు పొలంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని టిసిఆర్ పేరుతో జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో ఆదివారం చివరి రోజైన ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌కు ముఖ్య అతిధులుగా వైసిపి జిల్లా అధ్యక్షులు బూచెపల్లి శివప్రసాద్ రెడ్డి, వైసిపి పార్లమెంట్ ఇన్చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు అక్షిత్ రెడ్డిలు హాజరయ్యారు. ఫైనల్‌లో ఆడి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. అంతకు ముందు ఫైనల్‌కు చేరిన జట్టును టాస్ వేసి ఆటకు ఆహ్వానించారు.

### క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపిన నాయకులు :

ఈ మధ్యలో బూచెపల్లి శివప్రసాద్ రెడ్డి, చెవిరెడ్డి అక్షిత్ రెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ముగ్గురు కాసేపు బ్యాటింగ్ ఒకరు, కీపింగ్ ఒకరు, బౌలింగ్ మరొకరు చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా బూచెపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ కన్నవారికి, పుట్టిన ఊరికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. వెనుకపడిన ఈ ప్రాంతంలో ఎమ్మెల్యే ఇలాంటి క్రీడలకు ప్రోత్సాహం కలిగించడం మంచిదని ఇలాంటి అవకాశాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. టిసిఆర్ క్రికెట్ పోటీల ముగింపు ఫైనల్‌కు చేరిన త్రిపురాంతకం జట్టు, మరియు గంజివారి పల్లె జట్టు మ్యాచ్‌ను వారందరూ తిలకించారు. ఫైనల్‌లో గెలిచి విన్నర్‌గా నిలిచిన త్రిపురాంతకం జట్టుకు రూ.50వేల నగదును టోర్నమెంటు కప్పును చెవిరెడ్డి అక్షిత్ రెడ్డిల చేతుల మీదుగా అందించారు. అదేవిధంగా రన్నర్‌గా నిలిచిన గంజివారిపల్లె జట్టుకు రూ.30వేల నగదు టోర్నమెంటు కప్పును బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా అదించారు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సీరిస్ బహుమతులతోపాటు టోర్నమెంటులో 70జట్లకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రత్యేక బహుమతులను ప్రకటించారు. విజయోత్సవ వేడుక జరుగుతున్నంతసేపు ఆటస్థలం టపాసుల మోతలతో దద్దరిల్లింది.

## కురిచేడులో పలు కార్యక్రమాలకు హాజరైన గొట్టిపాటి లక్ష్మీ

**కురిచేడు, జనవరి 19, ప్రభాతవార్త**

కురిచేడు మండలంలో ఆదివారం నాడు జరిగిన పలు కార్యక్రమాలకు దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ హాజరయ్యారు. ఇందులో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిడతల నెమిలయ్య తల్లి గురవమ్మ దశదిన కర్మ పడమరవీరాయపాలెంలో జరగ్గా అక్కడకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకముందు కురిచేడులో జరిగిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కృష్ణారెడ్డి కూతురు ఓణీల ఫంక్షణ్‌లో పాల్గొన్నారు. వారి వెంట ఆమె భర్త టీడీపీ నాయకుడు అయిన కడియాల లలిత్ సాగర్, కురిచేడు తెలుగుదేశం మాజీ మండల అధ్యక్షులు కాట్రాజు నాగాజు, దొనకొండ మండల పార్టీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, ముండ్లమూరు మండల పార్టీ అధ్యక్షుడు కూరపాటి శ్రీను, ముండ్లమూరు మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, కురిచేడు నాయకులు గడ్డం బాలయ్య, తాళ్ల వెంకటేశ్వర్లు, కడియాల రమేష్, డిష్ వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి, మొగల్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మభగవాన్ గుడిలో అన్నదానం

**మద్దిపాడు, జనవరి 19, ప్రభాతవార్త**

మద్దిపాడు మండల కేంద్రం జగనన్న కాలనీ సమీపంలో భగవాన్ దేవాలయంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పరంజ్యోతి కల్కి సేవా సమితి సభ్యులు సౌజన్య దాసాజీ మాట్లాడుతూ ప్రతి నెల అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటామని కానీ సంక్రాంతి పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం అనివార్య కారణాల వల్ల కార్యక్రమాన్ని జరపలేకపోయామని ఆదివారం నాడు నిర్వహిస్తున్నామని పౌర్ణమి రోజునచేసేటువంటి పుణ్య కార్యక్రమాలకు భగవంతుడు అనుగ్రహం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో 300 మందికి అన్నదాన నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, శేషగిరిరావు, కళ్యాణ్, తేజస్వి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## 9 బాటిల్స్ మద్యం స్వాధీనం

**సింగరాయకొండ,జనవరి 19,ప్రభాతవార్త**

జరుగుమల్లి మండలం కలికివాయి బిట్రగుంట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పెరికల సుబ్బారావును ఆదివారం అదుపులోనికి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శివకుమారి తెలిపారు. అతని వద్ద ఉన్న తొమ్మిది బాటిల్స్ మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఒంగోలులోని స్థానిక రెవెన్యూ భవన్‌లో ఎన్నుకున్నారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులుగా పిన్నిక మధుసూదన్‌రావు, కార్యదర్శిగా ఆర్ వాసుదేవరావు, ట్రెజరర్‌గా ఊతకోలు శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షులుగా వి కిరణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా ఏవి రవిశంకర్, జి రజనికుమారి, ఎన్‌విబి రాజేష్, కె కాశయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామశర్మ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ఎస్ రామ్ నారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా కె కిషోర్‌కుమార్, కె అశోక్, బివి సుబ్బారావు, శాంతి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లుగా జె శ్రీనాథ్, ఎస్‌కె షాజహాన్, డి వెంకటేశ్వరరావు, యం గోపి, ప్రశాంత్‌నాయుడు, మాధవరావు, చైతన్యప్రకాష్‌లు ఎన్నికైయ్యారు. ఈ ఎన్నికల కార్యక్రమాన్ని సిహెచ్ సురేష్‌బాబు, ఎస్‌కె మహబూబ్‌బాషా, పెంచల్‌రెడ్డిలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో కలెక్టరేట్ యూనిట్, ఒంగోలు, కనిగిరి, మార్కాపురం యూనిట్లు కార్యవర్గసభ్యులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులు ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

## రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

**తాళ్లూరు, జనవరి 19, ప్రభాతవార్త**

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మండల సర్వేయర్ యాన్నబత్తిన శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని రామభద్రాపురంలో గ్రామ సభ నిర్వహించి రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సోమవారం నుంచి గ్రామంలో రీ సర్వే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ సర్వేకు సహకరించాలన్నారు. రీ సర్వే జరిగే ప్రాంతాలకు రైతులు వెళ్లి తమ భూములకు తమ వద్ద ఉన్న హక్కు పత్రాలను వారికి చూపించాలన్నారు. సర్వే ద్వారా ప్రభుత్వ భూముల వివరాలను కూడా సేకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ తహశీల్దార్ జే.ఇమ్మనేయులు రాజు, వీఆర్వో పి.చంద్రశేఖర్‌రావు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, విలేజ్ సర్వేయర్ బి.మల్లిఖార్జున, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రతిభామూర్తులు - మధురస్మృతులు సభ

అద్దంకి , జనవరి 19 , ప్రభాతవార్త



అద్దంకిలోని చిన్ని శాంతయ్య సేవాసదన్‌లో ఆదివారం ఏపీఎస్ ఆర్టీసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఎన్టీరామారావు 29వ వర్ధంతిని పురస్కరించుకొని వారి పేరున స్మారక కళావేదిక ఏర్పాటు చేసి, ప్రతిభామూర్తులు - మధురస్మృతులు సభను నిర్వహించారు. కోనేటి ఎంటర్ ప్రైజెస్ అధినేత కోనేటి అనిల్ ఆర్థిక సహకారం అందించారు. ఆహూరి హరిప్రసాద్ (రోటరీ క్లబ్ జాయింట్ సెక్రటరీ )జ్యోతి ప్రజ్వలన చేసి, సభను ప్రారంభించారు. జనచైతన్య వేదిక కన్వీనర్ అన్నమనేని వెంకటరావు సభకు అధ్యక్షత వహించారు. ఎన్.టి.రామారావు గురించి స్మారకోపన్యాసం చేశారు. సినీ విశ్లేషకులు వారణాసి రఘురామశర్మ సినీ నటులు కైకాల సత్యనారాయణ, సినీ జీవిత విశేషాలను సభకు వివరించారు. రుద్రయ్య దేవపాలన, దివాకర్ దత్తు, చిన్ని మురళీ కృష్ణ, ఎస్‌కె మహ్మద్ రఫీ, ఎన్టీఆర్, సత్యనారాయణ, రేవాటి వీరుడు, దత్తు ఒఒన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సందిరెడ్డి శ్రీనివాసరావు, ఆర్వి రాఘవరావు, చెన్నుపాటి, ఉప్పు చంద్రమౌళి, లేవి ప్రసాద్, కొల్లా భువనేశ్వరి, పుట్టంరాజు, చప్పిడి వీరయ్య,(రోటరీ క్లబ్ అధ్యక్షులు), పిసిహెచ్ కోటయ్య, చిన్నా,వివి బ్రహ్మం, టి.నాగేశ్వరరావు,తదితర అద్దంకి డిపో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘన నివాళి

అద్దంకి , జనవరి 19 , ప్రభాతవార్త



టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనుమరాలు సుభాషిణి వారి భర్త విజయశంకర్ దంపతులు అద్దంకి విచ్చేసిన సందర్భంగా అద్దంకి పట్టణంలోని బంగ్లారోడ్డులో టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం మిత్ర మండలి సభ్యులు గాడేపల్లి దివాకర్ దత్తు, పాలర్తి జ్యోతిష్మతి, షేక్ మహమ్మద్ రఫీ, చందలూరు నారాయణరావు, రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, పొట్టి సత్యనారాయణ, మస్తాన్ మస్టార్, అద్దంకి లేవి ప్రసాద్, పోలిరెడ్డి, బాచిన పూర్ణచంద్రరరావు, లక్కరాజు శ్రీనివాసరావు, కృష్ణారావు, కాకార్ల వెంకటేశ్వర్లు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, ప్రముఖ రంగస్థల నటులు నరసింహారావు, అచారిలు పాల్గొన్ని ప్రకాశం పంతులు త్యాగ నిరతిని గుర్తు చేసుకున్నారు.

## సంక్రాంతికి వస్తున్నాం టిక్కెట్ ధర రూ.250

**- అభిమానం ముసుగులో సొమ్ము చేసుకుంటున్న డిస్ట్రిబ్యూటర్**

**- ఒకే తరగతి టికెట్లు అధిక ధరలకు విక్రయిస్తున్న నిర్వాహకులు**

కనిగిరి,జనవరి 19, ప్రభాతవార్త



సంక్రాంతి పండుగ సమయంలో పెద్ద సినిమాల విడుదలతో డిస్ట్రిబ్యూటర్లు, థియేటర్ నిర్వాహకులు టికెట్ ధరలపై అధిక రేట్లను విధిస్తూ ప్రేక్షకులపై ఆర్థిక భారం మోపుతున్నారు. సంక్రాంతికి వస్తున్నాం అనే సినిమాకు టికెట్లు రూ.250కి విక్రయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అభిమానం ముసుగులో లాభాల దోపిడి :**

బాల్కని, కూర్చి వంఇ రెండు విభాగాల టికెట్లు ఉండాల్సినప్పుడు, నిర్వాహకులు అన్ని టికెట్లను బాల్కనీ పేరుతో విక్రయిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. హీరోల పాపులారిటీని ఉపయోగించుకుని టికెట్లను అధిక ధరలకు విక్రయించుకుని అభిమానుల జేబుకు చిల్లులు పెడుతున్నారు.

**ప్రేక్షకుల ఆవేదన :**

ఈ రకం లాభాల దోపిడిపై అభిమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ సమయాల్లో కుటుంబ సమేతంగా సినిమాలను వీక్షించాలంటే భారీ ఖర్చు అవుతుందని, ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలకు ఇది భారంగా మారుతుందని వారు అంటున్నారు. టికెట్ ధరల నియంత్రణకు సంబంధించి అధికారులు స్పందించాలని ప్రేక్షకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వెలుగులోకి గుర్తుతెలియని మృతదేహం వివరాలు

త్రిపురాంతకం, జనవరి 19, ప్రభాతవార్త



ఇటీవల కాలంలో త్రిపురాంతకం మండల కేంద్రంలో గుర్తు తెలియని మృతదేహం కలకలం రేపింది. అయితే పోలీసులు ఆ మృతదేహం వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో త్రిపురాంతకం మండల కేంద్రానికి చెందిన మెండ్రగుత్తి మహంకాళి (35) కనిపించడం లేదని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించగా మహంకాళి సంబంధించిన ఆనవాలను పోలీసులు సేకరించారు. మృతదేహం ఒంగోలులో ఉండటంతో కుటుంబ సభ్యులను అక్కడకు తీసుకువెళ్ళి పరిశీలించగా మహంకాళిగా కుటుంబ సభ్యులు నిర్ధారించగా మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు.

## రఘురాములు సేవలు చిరస్మరణీయం

కనిగిరి, జనవరి 19, ప్రభాతవార్త

కనిగిరి పీడీసీసీ బ్యాంకు మేనేజర్‌గా పని చేసి రైతుల మన్ననలు పొందిన గొర్రె రఘురాముల సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్ అన్నారు. ఆదివారం కనిగిరి మండలం దిరిశవంచ గ్రామంలో పీడీసీసీ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ గొర్రె రఘురాములు సంస్మరణలో పాల్గొని ప్రసంగించారు. రఘురాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల బీజేపీ అధ్యక్షులుగా కథం చిన్న వెంకటేశ్వర్లు

**- అభినందనలు తెలిపిన నాయకులు**

కొనకనమిట్ల, జనవరి 19, ప్రభాతవార్త




కొనకనమిట్ల మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా కథం చిన్న వెంకటేశ్వర్లు(కేవీఆర్) ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. ప్రస్తుత మండల అధ్యక్షులు కిలారి శ్రీనివాసరావు పదవి కాలం ముగియడంతో ఉపాధ్యక్షులుగా ఉన్న కేవీఆర్‌ను నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. బీజేపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పీవీ కృష్ణారావు, నాయకురాలు శాసనాల సరోజి సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కేవీఆర్ మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన నియోజకవర్గ అధిష్టానానికి మండల నాయకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రంగ సుబ్బారావు, బీసీ కన్వీనర్ కే.వెంకటేశ్వర్లు, మాజీ మండల అధ్యక్షులు కిలారి శ్రీనివాసరావు, నాయకులు ప్రసన్నాంజనేయులు, ఇమామ్ కాశీం, అశోక్ పార్శమాల్, కే.సుబ్బారెడ్డి, అమరనాథరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమిత్‌షా గో బ్యాక్

**- వామపక్షాల పార్టీల డిమాండ్**

మార్కాపురం, జనవరి 19, ప్రభాతవార్త




సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో అమిత్ షా గో బ్యాక్ నినాదంతో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజ్యాంగ కర్త బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని కోర్టు సెంటర్ నందు గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పార్లమెంటు సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ అమిత్‌షా గో బ్యాక్ అంటూ నినాదాల హోరుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.సోమయ్య, సీపీఐ ఏరియా కార్యదర్శి అందే నాసరయ్యలు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అవమానించడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. రాజ్యాంగం పట్ల గౌరవం లేని కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌సా వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తానని చెప్పి రాజ్యాంగ వ్యతిరేకంగా మతోన్మాద భావజాలాన్ని తలకెక్కించుకొని, హింసను రెచ్చగొట్టే విధంగా మతాల మధ్య చిచ్చు పెడుతూ ప్రజల మధ్య వైశ్యామ్యాలను రెచ్చగొట్టడాన్ని వారు వ్యతిరేకించారు. భారత రాజ్యాంగం విరుద్ధంగా వ్యవహరిస్తున్న అమిత్‌షా పట్ల ప్రధాని మోడీ నోరు మెదపకుండా మౌనం వహించటాన్ని వారు విమర్శించారు. రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అమిత్‌షా రాజ్యాంగబద్ధంగా లభించిన కేంద్ర హోంశాఖ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సీపీఎం ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వెంకటరెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు డి.శ్రీనివాసులు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కే కాశీం, కాశయ్య, సీపీఎం నాయకులు ఎస్‌కే నన్నేసా, మల్లిఖార్జన, విక్టర్, ఎస్‌కే నబి కరిముల్లా, వై.రవికుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం లయన్స్‌క్లబ్ అధ్యక్షునిగా రామకృష్ణ

మార్కాపురం, జనవరి 19, ప్రభాతవార్త



లయన్స్‌క్లబ్ మార్కాపురం పట్టణ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. లయన్స్‌క్లబ్ అధ్యక్షునిగా రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ తళ్ళం వెంకట రామకృష్ణారావు, కార్యదర్శిగా బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మునగాల చంద్రశేఖం రెడ్డి, కోశాధికారిగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ బీవీ రంగయ్య, ఉపాధ్యక్షులుగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు, భూపని కాశయ్య, పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్, రవ్వా హరినాథ్‌బాబు, సహాయ కోశాధికారిగా ప్రముఖ వైద్యులు ఎం.మాధవరావు,సర్వీస్ చైర్‌పర్సన్‌గా వి.వెంకటరామిరెడ్డి,ఎల్‌సీఐ ఎఫ్ కోఆర్డినేటర్‌గా బి.కోటేశ్వరరావు, మెంబర్ షిప్ చైర్‌పర్సన్‌గా కే.చెంచిరెడ్డి, క్లబ్‌మార్కెటింగ్ చైర్ పర్సన్‌గా షేక్ మహబూబ్ భాషా, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా ఎం.శివప్రసాద్, పలువురు డైరక్టర్లుగా ఎన్నికయ్యారు.

## పొగాకు పచ్చాకు రవాణాలో రైతులు, కూలీలు ప్రమాదాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**- ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌బాబు**

నాగులుప్పలపాడు, జనవరి 19, ప్రభాతవార్త

ట్రాక్టర్లలో పొగాకు పచ్చాకు తరలింపులో రవాణా నందు రైతులు, కూలీలు ప్రమాదాల పట్ల ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్ బాబు కోరారు. ఆదివారం ఈ సందర్భంగా సీఐ శ్రీకాంత్‌బాబు విలేకర్లతో మాట్లాడారు. ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో గల సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు పోలీసు స్టేషన్ పరిధిలో గల పొగాకు రైతాంగం, పచ్చాకు కూలీలు ప్రమాదాల పట్ల ముందస్తుగా జాగ్రత్తలు వహించాలని అన్నారు. పొగాకు కోత కాలంలో పొగాకు పచ్చాకు ట్రాక్టర్లపై బ్యారెన్ల వద్దకు తరలించడం జరుగుతుందని, పచ్చాకును ట్రాక్టర్లపై ఎత్తుగా వేసుకుని వాటిపైన కూలీలు, అదేవిధంగా వెనుక డోర్‌లను తీసి కూలీలు తరచూ కూర్చుంటున్నారని, ఇది ఎంతో ప్రమాదకరమని ఆయన వెల్లడించారు. ఇటీవల కాలంలో దీని వల్ల ఎన్నో ప్రమాదాలు సంభవించాయని ఆయన తెలిపారు. అంతే కాకుండా కార్మికులు మృత్యువాతకు లోనయ్యారని ఆయన తెలిపారు. పొగాకు తరలింపు కాలంలో పచ్చాకును ఒక ట్రాక్టర్‌పై కూలీలను మరొక వాహనంపై తరలించాలని దీని వల్ల ప్రమాదాలు నివారింపబడతాయని ఆయన పేర్కొన్నారు. దీనిని ఉల్లంఘించి పచ్చాకు తరలించే ట్రాక్టర్‌పై కూలీలను ఎక్కించుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఒంగోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌బాబు హెచ్చరించారు. మద్దిపాడు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు మండలాల పరిధిలోని పొగాకు రైతాంగం దీనిని గమనించి ప్రమాదాల పట్ల ముందస్తుగా ఈ చర్యలు తీసుకోవాలని సీఐ శ్రీకాంత్‌బాబు కోరారు.


## మాజీ సర్పంచ్ స్వర్ణ ఏసురత్నం మృతికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బీఎన్

నాగులుప్పలపాడు, జనవరి 19, ప్రభాతవార్త

నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామం అంబేద్కర్ కాలనీలో అనారోగ్యంతో మరణించిన మాజీ సర్పంచ్ స్వర్ణ ఏసురత్నం భౌతికకాయానికి సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట క్లస్టర్ ఇన్‌ఛార్జీ గుమ్మడి సాయిబాబా, పార్టీ అధ్యక్షులు సునీల్, యూనిట్ ఇన్‌ఛార్జీ నెప్పల శివకృష్ణ, స్వర్ణ కిషోర్, పాలడుగు మురళి తదితరులు నివాళులర్పించారు.

## పాలేటి గంగమ్మకి ప్రత్యేక పూజలు

పీసీపల్లి(కనిగిరి), జనవరి 19, ప్రభాతవార్త



మండలంలోని పెద్ద అలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళాపురం గ్రామం సమీపంలో పాలేటి ఒడ్డున వెలసిన ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భగీరథ పాలేటి గంగా భవాని అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. భక్తులు వేకువజామునే అమ్మవారికి పాల పొంగళ్ళు పెట్టుకుని నైవేద్యం సమర్పించారు. నూతన వాహనాలు కొనుగోలు చేసినవారు అమ్మవారి సన్నిధిలో వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

## రాష్ట్ర ప్రజల సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వం ధ్యేయం

**- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ముత్తుముల**



గిద్దలూరు రూరల్, జనవరి 19 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ప్రజల సంతోషమే తన సంతోషంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని, ప్రజల గురించి, రాష్ట్రం గురించి ఇంత గొప్పగా ఆలోచించే నాయకుడు మనకు దొరకడం నిజంగా ఏపి ప్రజల అదృష్టమని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. గిద్దలూరు పట్టణంలోని స్థానిక టిడిపి కార్యాలయంలో 35మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.63,30,330ల చెక్కులను ఆదివారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ఎవరూ దిగులుపడాల్సిన పనిలేదని, గత ప్రభుత్వంలో మాదిరి ఎవరూ ప్రాణాలు కాపాడుకోవడం కోసం ఆస్తులు అమ్ముకోవడం, అప్పులు చేయడం వంటివి కూటమి ప్రభుత్వంలో చేయాల్సిన పనిలేదన్నారు. ప్రజల వ్యక్తిగత సమస్యలతోపాటు పాలనాపరమైన సమస్యల పరిష్కారానికి ఎన్డీయే ప్రభుత్వం త్వరలోనే కొత్త పరిష్కార వేదిక ఏర్పాటు చేయనుందన్నారు. అందరి చేతిలో ఉండే మొబైల్‌లోని వాట్సాప్ ఫ్యూచర్ ద్వారా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేలా వివిధ శాఖలను అనుసంధానిస్తూ, ప్రభుత్వం త్వరలోనే నూతన విధానాన్ని అమల్లోకి తీసుకురానుందన్నారు. సాంకేతికతను పాలనాపరమైన అశాలకు జోడించడం ద్వారా ఇటు ప్రజలకు మేలు జరగడంతోపాటు, అటు రాష్ట్రాభివృద్ధి కూడా పరుగులు పెడుతుందన్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.

**ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు :**

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్ధవీడు మండలం నుండి ముగ్గురు లబ్ధిదారులు, బేస్తవారిపేట మండలం నుండి 5మంది లబ్ధిదారులు, కంభం మండలం నుండి నలుగురు లబ్ధిదారులు, గిద్దలూరు మండలం నుండి 13మంది లబ్ధిదారులు, కొమరోలు మండలం నుండి 5మంది లబ్ధిదారులు, బేస్తవారిపేట మండలం నుండి 5మంది లబ్ధిదారులకు మొత్తం 35మంది లబ్ధిదారులకు రూ.63,30,330లు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, టిడిపి మండల నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అచల గాండ్ల అన్నసత్రం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటు

కొనకనమిట్ల, జనవరి 19, ప్రభాతవార్త

మండలంలోని గార్లెదిన్నె పంచాయతీ వెలుగొండ క్షేత్రమంలోని అచల గాండ్ల అన్న సత్రం నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. ఈ కమిటీ ఎన్నికలకు ముఖ్య అతిధులుగా తంగేళ్ల నాగభూషణం, చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, వరికుంట్ల వెంకటేశ్వర్లు, భీమవరం పిచ్చయ్యలు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా ఆళ్లచెరువు శ్రీరాములు, గౌరవఅధ్యక్షులుగా బట్టు ఆమారావు, బట్టు మహానంది, బల్లవరపు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా యేరువ కృష్ణారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దపాటి కృష్ణయ్య, కోశాధికారిగా ఆళ్లచెరువు మోహన్‌రావు, మహిళా కార్యదర్శిగా మాద సుభద్రలను ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు కుల బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

## అమిత్‌షా గో బ్యాక్ అంటూ నిరసన

చీమకుర్తి, జనవరి 19, ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం చీమకుర్తి బస్టాండ్ సెంటర్ లో సిపిఎం నిరసన ప్రదర్శన చేపట్టింది. అమిత్ షా గో బ్యాక్, అమిత్ షా క్షమాపణలు చెప్పాలి నినాదాలతో నిరసన కార్యక్రమం చేశారు. సిపిఎం జిల్లా నాయకులు పమిడి వెంకటరావు, పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ అమిత్ షా అంబేద్కర్ ని అవమాన పరుస్తూ చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని ఉల్లంగించడమే అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఆధారంగా ఎన్నికై రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో పార్టీ మండల నాయకులు కె. చిన్నపరెడ్డి, టి. రామారావు,సి.హెచ్. కొండయ్య,ఎన్.శ్రీను,పి. ఓబుల్ రెడ్డి, శంకర్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మా పద్మావతికి సావిత్రిబాయి పూలే నేషనల్ అవార్డు





మార్కాపురం రూరల్, జనవరి 19 ప్రభాతవార్త

మండల కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని స్థానిక కమలా జూనియర్ కళాశాలలో ఆంగ్లం అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న గుమ్మా పద్మావతికి సావిత్రిబాయి పూలే నేషనల్ అవార్డు వచ్చినట్లు ప్రిన్సిపాల్ దేసు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రైవేటు కాలేజీ అసోసియేషన్ ఎస్ఎల్‌టిఓ సంఘం గౌరవాధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు, సంఘం అధ్యక్షులు డాక్టర్ అయర్ల నాగయ్య చేతుల మీదుగా అవార్డును ఆమెకు అందజేయడం జరిగిందని తెలిపారు. అవార్డు పొందిన గుమ్మా పద్మావతికి కమలా విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ పెనుగొండ పవన్ కుమార్, డైరెక్టర్ సింధూ పవన్, ప్రిన్సిపాల్స్ దేసు సుధాకర్, ఎంపి పుల్లయ్య, రాజేంద్ర కుమార్, మురళి కృష్ణ, ఏఓ రామడుగు సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ బద్వేలి వెంకట శేషులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.

## విద్యార్థులకు 24,25లలో ప్రతిభా పాటవ పోటీలు

చీమకుర్తి, జనవరి 19, ప్రభాతవార్త

చీమకుర్తి లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు వివిధ రకాల ప్రతిభా పాటవ పోటీలను నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు చెరుకూరి రఘు కిరణ్ తెలిపారు. రోటరీ క్లబ్ బాలోత్సవం లో భాగంగా ఈనెల 24న చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, దేశభక్తి గీతాల పై పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 25న విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు కేవలం చదువుతోపాటు మానసి క ఉల్లాసాన్ని, చక్కని వినోదాన్ని అందించడంలో భాగంగా ఈ పోటీలను చీమకుర్తిలోని డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియంలో జరుపుతున్నామని విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారు కోరారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు సెల్ నెంబర్ 90523 44314, 98494 20023 వాట్సఅప్ నకు తమ పేర్లు పంపించి నమోదు చేసుకోవాలని కోరారు. చెరుకూరి రఘు కిరణ్ ఈ సందర్భంగా ప్రతిభ పాటవ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షులు కడవా రామకృష్ణ, కార్యదర్శి కందుకూరి వెంకట సుధాకర్ రావు, ప్రతినిధులు అంబటి వీరారెడ్డి, గొల్లపూడి వెంకట్రావు, పోకూరి రామకృష్ణారెడ్డి, మన్నంనాగరాజు తదితరులు పాల్గొని మాట్లాడారు.

## మిర్చి కోత కూలీలకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు

**- మిర్చి కూలీలకు ప్రమాదాలపై అవగాహన కల్పించిన సీఐ**

మార్కాపురం, జనవరి 19, ప్రభాతవార్త

పరిమితికి మించి ఆటోలలో కూలీలను ఎక్కించుకుని ప్రయాణించడం ప్రమాదకర మని ఇటువంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు ఆటో యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం ఆటో డ్రైవర్లు, యాజమాన్యాలకు జరుగుతున్న ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ పోలీసు స్టేషన్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ మిర్చి కోతలకు వెళ్లే రైతు మిర్చి కూలీలు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఆటోలో ప్రయాణించరాదని హెచ్చరించారు. ఇటీవల కాలంలో మార్కాపురం డివిజన్ ప్రాంతంలో మిర్చి కోతలు ప్రారంభమయ్యాయి. కూలీలు అందరూ ఆటోలలో పరిమితికి మించి ఎక్కి గమ్యస్థానానికి చేరడం చూస్తున్నామని, ఈ విషయంపై దృష్టి సారించిన పోలీసు శాఖ మిర్చి రైతుల శ్రేయస్సార్థం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డివిజన్లోని అన్ని ప్రాంతాలలో పోలీసులు అప్రమత్తమై కిక్కిరిసి వెళ్లే మిర్చి రైతుల ఆటోలను నిలిపి జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ మార్పుకు శ్రీకారం చుట్టడం జరిగిందని వివరించారు. కార్మికులకు అవసరమైన బస్సులను ఏర్పాటు చేసేందుకు వారి సమస్యలను పరిష్కరించేందుకు బ్రేక్ ఇన్‌స్పెక్టర్, డిపో మేజర్లతో సమావేశమై కార్మికల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మిర్చి కోతకు వెళ్లే పూత కార్మికులు కోసం ఉదయం 8గంటలకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసథియేటర్, కాలేజీ రోడ్డు, రాఘవేంద్ర ఫర్నిచర్, పూల సుబ్బయ్య కాలనీ, నికరం పల్లి రోడ్డు, నాగులవరం రోడ్డు వద్ద బస్సు పాయింట్లు ఏర్పాటు చేసి మిర్చి కోత కార్మికులకు బస్సు ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మిర్చి కోతల సమయం ముగిసిన తర్వాత తిరిగి గమ్యస్థానానికి చేర్చేందుకు కూడా బస్సులు ఏర్పాటు చేసేందుకు డిపో మేనేజర్ అంగీకరించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మార్కాపురంలో కార్మికుల మేస్త్రీలు సదివనియోగం చేసుకోవాలని ఎవరికి ఎన్ని బస్సులు కావాలో వివరాలు తెలియజేస్తే బస్సులు ఏర్పాటు చేసేందుకు డిపో మేనేజర్ సిద్ధంగా ఉన్నారని వివరించారు.



20-1Pg5.qxd:20-1Pg5.qxd 01/01/01 8:15 AM Page 1



# భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక మహాకుంభమేళా

## మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ





**న్యూఢిల్లీ, జనవరి 19:** ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల వర్గాలప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందన్నారు. ప్రపంచ దేశాలప్రజలు ప్రయాగరాజ్‌కు వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారని తెలిపారు. కుంభమేళాకు పెద్దసంఖ్యలో వస్తున్న యువతను అభినందించారు. దేశంలోని యువత తమ ఆచార సాంప్రదా యాలను తెలుసుకున్నపుడే మన మూలాలు బలపడతాయన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచదేశాలనుంచి వస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు. మహాకుంభ్‌మేళా అన్ని ప్రాంతాలు, అన్నివర్గాలప్రజలను ఒకేవేదికపైకి తీసుకువచ్చిందని తెలిపారు. మనసులో మాట పేరుతో ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే మన్‌కీబాత్ కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడారు. అయితే ఈనెలలో చివరి ఆదివారం అయిన జనవరి 26న గణతంత్రదినోత్సవం కావడంతో మూడో ఆదివారం మన్‌కీబాత్ 118వ ఎపిసోడ్‌ను ప్రసారం చేసారు. ఈ గణతంత్ర దినోత్సవం చాలా ప్రత్యేకమైనదని, ఈ సంవత్సరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలుపూర్తవుతుందని మన పవిత్రమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగపరిషత్‌లోని గొప్ప వ్యక్తులందరికీ తలవంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి పటిష్టంచేస్తోందని ప్రధాని కొనియాడారు. ప్రజాశక్తిని బలోపేతంచేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తూ నిష్పక్షపాతంగా పోలింగ్‌ప్రక్రియ నిర్వహిస్తుందన్నారు. యువత స్టార్టప్ సంస్థల వైపు ఎక్కువ ఆకర్షితులవుతున్నారని ప్రధాని మోడీ అన్నారు. దీనితో స్టార్టప్ ఇండియా రూపు దిద్దుకుంటున్నదని సమాజంలో పరిస్థితులు మారిపోతున్నాయని అన్నారు. దేశం డిజిటల్ యుగంలోకి ప్రవేశిస్తోందని దేశాభి వృద్ధిలో మహిళలు కీలకపాత్రపోషిస్తున్నారని వెల్లడించారు. నేటి ఆధునిక భారత్‌యువత తమ అభివృద్ధిగురించి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా కృషిచేస్తుందని వెల్లడించారు. దీపక్ నబం అనే వ్యక్తి తాను స్థాపించిన స్టార్టప్ సంస్థ ద్వారా నిరాశ్రయులకు సాయంచేస్తున్నాడని ప్రశంసించారు. ఈనెల 25వ తేదీ జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ప్రస్తావించారు. ఎన్నికల సంఘం ఎన్నికలప్రక్రి యను ఎప్పటికప్పుడు ఆధునీకరించి పటిష్టం చేస్తున్నదన్నారు. ప్రజాశక్తిని బలోపేతం చేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తూ నిష్పక్షపాతంగా పోలింగ్‌ప్రక్రియ నిర్వహిస్తుందని కొనియాడారు. అయోధ్య రామ మందిరం వార్షికోత్సవంపై మాట్లాడిన మోడీ ఇది ఎంతో పవిత్రమైన రోజు అని పేర్కొన్నారు.



# అమలులోకి 'గాజా' శాంతి ఒప్పందం..

## చివరి వరకు ఇజ్రాయెల్ దాడులు!

**జెరూసలేం, జనవరి 19:** గాజాలో ఎట్టకేలకు కాల్పులు విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం 8.30 గంటలకే ఇది అమలులోకి రావాల్సి ఉండగా దాదాపు మూడు గంటలు ఆలస్యమైంది. హమాస్ నుంచి ఇజ్రాయెలీ బందీల జాబితా విడుదలలో జాప్యం కావడంతో తొలుత శాంతి ఒప్పందం అమలుపై సందిగ్ధత నెలకొంది. చివరకు ముగ్గురు బందీల వివరాలను హమాస్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. దీంతో కాల్పుల విరమణ ఒప్పందం అమలుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. ఈ ముగ్గురు బందీలు నేడు విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 15 నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలుకుతూ ఇజ్రాయెల్-హమాస్‌లు ఇటీవల ఓ అంగీకారానికి వచ్చిన విషయం తెలిసిందే. అయితే.. హమాస్ చెర నుంచి విడుదల కావాల్సిన బందీల జాబితా అందేవరకు ఒప్పందం అమలుకు ముందుకొచ్చే ప్రసక్తే లేదని నెతన్యాహు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ సేనలు గాజాపై దాడులు చేసినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ దాడుల్లో ఎనిమిది మంది మృతి చెందగా 25 మంది గాయపడినట్లు వెల్లడించింది. సాంకేతిక కారణాలతో బందీల వివరాలు అందజేయడంలో ఆలస్యమైందని హమాస్ చెప్పింది. ఎట్టకేలకు వివరాలు వెల్లడించడంతో కాల్పుల విరమణ అమలుకు మార్గం సుగమమైంది.



## సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా జ్ఞానేంద్ర ప్రతాప్‌సింగ్

**గువాహతి, జనవరి 19:** అస్సాం పోలీస్ చీఫ్ జ్ఞానేంద్రప్రతాప్‌సింగ్‌ను కేంద్ర రిజర్వుపోలీస్ దళం సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా కేంద్రం నియమించింది. కేంద్ర వ్యక్తిత్వ మానవవనరులశాఖ ఈమేరకు నోటిఫికేషన్ జారీచేసింది. 1991 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన సింగ్ అస్సాం మేఘాలయ కేడర్‌కు చెందినవారు. కేబినెట్ నియామకాల కమిటీ సింగ్ సిఆర్‌పిఎఫ్‌డిజి నియామకాన్ని ఆమోదించింది. ఆయన 2027 నవంబరు 30వరకూ ఈ పోస్టులో కొనసాగుతారు. సీనియర్ ఐపిఎస్ అధికారి విటుల్ కుమార్ ఇప్పటివరకూ ఇన్ ఛార్జిగా కొనసాగుతున్నారు. అప్పటిసిఆర్‌పిఎఫ్ డిజి అనిశ్ దయాల్‌సింగ్ డిసెంబరు 31వ తేదీ పదవీ విరమణ చేయడంతో అప్పటినుంచి వితుల్‌కుమార్ ఇన్‌ఛార్జిగానే కొనసాగుతున్నారు.

# రైతునేతలతో చర్చలకు ప్రభుత్వప్రతినిధుల ఆహ్వానం

### ఫిబ్రవరి 14న చండీఘర్‌లో చర్చలు

### వైద్యచికిత్సలకు అంగీకరించిన రైతునేత దల్లేవాల్

### నిరవధిక దీక్షలు ఉపసంహరించుకున్న 121 మంది రైతులు



**న్యూఢిల్లీ, జనవరి 19:** పంజాబ్ హర్యానా సరిహద్దుల్లోని ఖనౌరివద్ద రైతు నాయకుడు జగ్‌జీత్ సింగ్ దల్లేవాల్ వైద్యచికిత్సకు అంగీకరించిన నేపథ్యంలో వైద్యులు ఆయనకు ముందుగా నిస్సత్తువను తొలగించేందుకు సెలైన్ ఎక్కిస్తున్నారు. అయితే దల్లేవాల్‌కు మద్దతుగా ఆదివారంనుంచి 121 మంది రైతులు ఖనౌరి నిరసన కేంద్రం వద్దనే దల్లేవాల్‌కు సంఘీభావంగా ఆమరణదీక్షను చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే దల్లేవాల్ వైద్య చికిత్స తీసుకునేందుకు అంగీకరించడంతో వారు తమ నిరవధిక దీక్షను ఆదివారంనుంచే ఉపసంహరించుకున్నారు. 70 ఏళ్ల దల్లేవాల్ గడచిన రెండు నెలలుగా ఆమరణదీక్షలో ఉన్న సంగతి తెలిసిందే. అప్పటినుంచి నేటివరకూ ఆయన చికిత్సలకు అంగీకరించలేదు. ముందుగా ప్రభుత్వం ఇచ్చిన డిమాండ్లను నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఆతర్వాతనే తాను వైద్యసాయం పొందుతానని తెగేసి చెప్పడంతో అటు కేంద్రం, ఇటు పంజాబ్ రాష్ట్రాలమధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. వచ్చేనెల 14వ తేదీ రైతుల డిమాండ్లపై చర్చించేందుకు కేంద్రం ఆహ్వానించడంతో దల్లేవాల్ తన దీక్షను కొంతమేర సడలించుకున్నారు. రోజురోజుకూ దల్లేవాల్ ఆరోగ్యం క్షీణిస్తుండటం, ప్రభుత్వం కూడా రైతుల డిమాండ్లను పట్టించుకోకపోవడంతో 121 మంది రైతులు ఆమరణ దీక్షకు పూనుకున్నారు. ఇపుడు దల్లేవాల్ చికిత్సకు అంగీకరించడంతో 121 మంది రైతులు పండ్లరసం సేవించి తమ దీక్షను విరమించారు. డిఐజి మన్‌దీప్‌సింగ్ సిద్ధు, పాటియాలా సీనియర్ సూపరింటెండెంట్ నానక్‌సింగ్‌ల సమక్షంలో వారు దీక్షలు విరమించారు. కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి ప్రతినిధిబృందం వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ ప్రియారంజన్ ఆధ్వర్యంలోరైతు నాయకుడు దల్లేవాల్ ఇతర రైతు ప్రతినిదులను కలిసి చర్చలుజరిపారు. సంయుక్త కిసాన్‌మోర్చా కిసాన్‌మజ్దూర్‌మోర్చానేతలతో ముందురోజు వారిని సంప్రదించి ప్రభుత్వంతో చర్చలకు ఆహ్వానించారు. చండీఘర్‌లో వచ్చేనెల 14వ తేదీ చర్చలు పునఃప్రారంభం అవుతాయని రైతు నేతలు ఈసందర్భంగా ప్రకటించారు. ప్రభుత్వం నుంచి ఈ ప్రకటన రావడంతో దల్లేవాల్ వైద్య చికిత్సలకు అంగీకరించారు. ఇంట్రావీనస్‌డ్రిప్‌తో ఆయనకు వైద్యులు చికిత్సలు ప్రారంభించారు. అయితే రైతు పంటలకు కనీసమద్దతుధర చట్టబద్ధం చేసేంతవరకూ దల్లేవాల్ తన దీక్షను విరమించరని రైతునేతలు స్పష్టం చేసారు.

# తప్పుచేస్తే కొడుకునైనా శిక్షించాల్సిందే..!

### నా కుమారుడు సంజయ్ శిక్షార్హుడే

### ఆర్జీకర్ ఆసుపత్రి కేసులో నిందితుడి తల్లి మీడియాకు వెల్లడి



**కోల్‌కత్తా, జనవరి 19:** ఆర్టీకర్ ఆసుపత్రి పిజి వైద్యవిద్యార్థినిపై హత్యాచారంకేసులో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌ను కోల్‌కత్తా కోర్టు దోషిగా నిర్ధారించిన క్రమంలో ఆమె తల్లి స్పందించింది. తన కొడుకు తప్పుచేస్తే కచ్చితంగా తగిన శిక్ష విధించాలని పేర్కొన్నారు. తన కుమారుడు చేసిన తప్పును ఓ మహిళగా ఎప్పటికీ క్షమించనని ఆగ్రహం వ్యక్తం చేసారు. తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని వైద్యురాలు పడిన బాధను నరకాన్ని అర్థం చేసుకోగలనని ఆవేదన వ్యక్తం చేసారు. నాకొడుకు చనిపోతే నేను ఏడుస్తానేమో కానీ ఓ యువతి పట్ల ప్రవర్తించిన తీరుకు సంజయ్‌కు జీవించే హక్కులేదని, ఆతడికి మరణశిక్ష విధించినా మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. వైద్యురాలు నాకు కూతురితో సమానం. కుమార్తెకు ఇటువంటి పరిస్థితి వస్తే ఏతల్లీ ఊరుకోదని ఆమె అన్నారు. ఈకేసుపై సుప్రీంకోర్టుకు వెళతారా అన్న ప్రశ్నపై సంజయ్‌సోదరి మాట్లాడుతూ ఆ ఉద్దేశ్యం తమకు లేదని తెలిపారు. అతడు ఇలాంటి దారుణానికి ఒడిగడతాడని తమెప్పుడూ అనుకోలేదన్నారు. అయితే నేరం జరిగిన ప్రాంతంలో సంజయ్‌తోపాటు మరికొంతమంది ఉన్నట్లు వివరాలు వస్తున్నాయని ఈ విషయమై సిబిఐ పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి తగిన శిక్ష విధించాలని కోరారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈకేసులో ముద్దాయికి ఎంతకాలం శిక్ష విదించబోయేది సోమవారం ప్రకటిస్తామని కోల్‌కత్తాలోని సీల్దా అదనపు జిల్లా సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ ప్రకటించారు. 31 యేళ్ల వైద్యురాలి మృతదేహాన్ని గత ఏడాది ఆగస్టు 10న ఆసుపత్రి సమావేశ గదిలో గుర్తించిన సంగతి తెలిసిందే. ఘటన జరిగిన 162 రోజుల తర్వాత ఈకేసులో తీర్పువచ్చింది.

# ప్రభుత్వ ఉద్యోగులకు స్థలాలిస్తే ఇళ్లు కట్టిస్తాం

## ప్రధాని మోడీకి కేజ్రీవాల్ మరోలేఖ



**న్యూఢిల్లీ, జనవరి 19:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు మరింత సమీపిస్తున్న కొద్దీ ఆప్ జాతీయ కన్వీనర్ మాజీ సీఎం అరవింద్‌కేజ్రీవాల్ ప్రధాని మోడీకి లేఖాస్త్రాలను మరిన్ని సంధిస్తున్నారు. ఇప్పటికే రెండుమూడు లేఖలు సంధించిన కేజ్రీవాల్ తాజాగా మరో లేఖను రాసారు. ఢిల్లీలోప్రభుత్వ ఉద్యోగులందరికీ నివాసాలు ఏర్పాటుచేయాలన్న డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. ఇందుకోసం ఒక స్కీమ్ తీసుకొచ్చి ఆ స్కీంద్వారా వారికి ఇఎంఐల రూపంలో నగదు చెల్లించే అవకాశం ఇవ్వాలన్నారు. ఆదివారం ఆయన మీడియాతోమాట్లాడుతూ ఢిల్లీప్రభుత్వానికి భూములు ఇవ్వండి. ప్రభుత్వ ఉద్యోగులు ఇళ్లనిర్మించుకోడానికి ఈభూమిని పంపిణీ చేద్దాం. రాజ్యాంగంప్రకారం దేశ జాతీయ రాజధాని ఢిల్లీలో భూపంపిణీ చేసే అధికారం అక్కడి రాష్ట్రప్రబుత్వానికి లేదు. ఈ అంశం కేంద్రపరిధిలో ఉంది. అందుకే ప్రధానిమోడీకి లేఖ రాసానని అన్నారు. ఢిల్లీలోని పారిశుధ్య కార్మికులు గురించి కూడా లేఖలో మోడీకి వివరించామని కేజ్రీవాల్ తెలిపారు. ఎన్డీఎంసి, ఎంసిడిల్లోపనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నివాసం ఏర్పాటు ఎంతో అవసరమని వారికి రాయితీలు కల్పించి తక్కువ రేట్లకు భూమిని ఇస్తే వారు గృహాలు ఏర్పాటుచేసుకుంటారని అన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వీరిది కీలకపాత్రఅని వారు నగరానికి బ్యాక్‌బోన్ వంటి వారన్నారు. భూమికోసం వీరుతీసుకున్న రుణాన్ని నెలవారీ పద్ధతుల్లో తిరిగి చెల్లించే విధంగా స్కీం తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు. వారు ప్రస్తుతం ప్రభుత్వం మం జూరు చేసిన వాటిల్లో నివసిస్తున్నారని అవి తాత్కాలికమేనని రిటైర్మెంట్ అయిన తర్వాత వారు ఆ గృహాలను వదిలేయాల్సిన పరిస్థితి ఉందని, శానిటేషన్ కార్మికులు వేరే ఇళ్లు కొనుక్కోవాలన్నా ఢిల్లీ వంటి మహానగరంలో అద్దెకు ఉండాలన్నా అదిభరించలేనంతగా ఉంది. అలా కాకుండా వారికి భూమిని ప్రభుత్వమే ఇచ్చి ప్రోత్సాహం ఇస్తే వారికి ఎ ంతోమేలుచేసిన వారిగా మిగిలిపోతామని లేఖలో అన్నారు. ఇటీవలే ఢిల్లీలో నివసిస్తున్న జాట్స్ కులస్తులను ఓబిసిలో చేర్చాలనే డిమాండ్‌తోప్రధానిమోడీకి లేఖరాసారు. ఒబిసిలో చేర్చడంవల్ల రాజస్థాన్ నుంచి వచ్చే జాట్స్ ఢిల్లీయూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందడంతోపాటు ఎయిమ్స్‌లోకూడా ఉద్యోగాలు పొందవచ్చన్నారు. అన్ని కేంద్ర ప్రభుత్వసంస్థల్లో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఢిల్లీలో వచ్చేనెల ఐదో తేదీ జరిగే ఎన్నికలకు సంబంధించి బిజెపి, కాంగ్రెస్, ఆప్ పార్టీలు పోటాపోటీప్రచారాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే.

ఈ క్రమంలోనే ముందురోజు తమ అధినేత కాన్వాయ్‌పై రాళ్లదాడిజరిగిందంటూ ఆప్ కేడర్ పెద్దఎత్తున నిరసనలకు దిగింది. రెండు పర్యాయాలు గెలిచిన ఆప్ ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్‌సాధించేదిశగా వెళుతోంది. ఇదిలా ఉంటే బిజెపి, కాంగ్రెస్‌లు ఢిల్లీలో తమ పూర్వ వైభవాన్ని మళ్లీ తిరిగి తీసుకురావాలన్న పట్టుదలతో ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నాయి.



## నైజీరియాలో పేలిన పెట్రోల్ ట్యాంకర్

# 77 మంది ప్రాణాలు బుగ్గిపాలు

**అబుజా, జనవరి 19:** పశ్చిమ ఆఫ్రికా దేశం నైజీరియాలో ఓ పెట్రోల్ ట్యాంకర్ పేలడంతో 77 మంది మరణించారు. సెంట్రల్ నైజీరియాలోని నైజర్‌లో ఉన్న సులేజా ప్రాంతంలో కొంతమంది ఓ ట్యాంకర్ నుంచి మరో ట్యాంకర్‌లోకి జనరేటర్ ఉపయోగించి పెట్రోల్ పంపు చేస్తుండగా పేలుడు సంభవించింది. దీంతో పెట్రోల్‌ను పంప్ చేస్తున్న వారితోపాటు చుట్టుపక్కల పదుల మీటర్ల దూరంలో ఉన్న వారు కూడా మరణించినట్లు నైజీరియా ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ తెలిపింది. ఈ ప్రమాదంలో మరో 25 మంది గాయపడ్డారని పేర్కొంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. మృతుల్లో చాలామంది గుర్తించలేనంతగా కాలిపోయారని తెలిపింది. సరకు రవాణాకు సరైన రైల్వే వ్యవస్థ లేకపోవడంతో నైజీరియాలో ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. రెండువారాల క్రితం డెల్టా స్టేట్‌లో ఫ్యూయల్ ట్యాంకర్ కోసం జరిగిన అల్లర్లలో ఐదుగురు మరణించారు. అదేవిధంగా గత యేడాది అక్టోబరులో పైప్‌లైన్ల నుంచి లీకవుతున్న పెట్రోల్‌ను పట్టుకోవడానికి జనాలు ఎగబడటంతో జరిగిన పేలుళ్లలో సుమారు 153మంది మృతిచెందారు. నైజీరియాలో ఆర్థిక పరిస్థితులు అంతకంతకూ దిగజారడంతో గత 18 నెలల్లో చమురు ధరలు 400 శాతం పెరిగాయి.



## రాహుల్‌పై గువాహతిలో కేసు నమోదు

**పాట్నా, జనవరి 19:** రాజ్యాంగపరిరక్షణకు కాంగ్రెస్‌పార్టీ దేశంతోనూ పోరాడుతోందని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీచేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆయనపై అస్సాంలోని గువాహతి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్‌నమోదుచేసారు. మోన్‌జిత్ చాటియా అనే వ్యక్తి ఈ ఫిర్యాదు చేసారు. రాహుల్ వాక్‌స్వాతంత్ర్య పరిమితులను దాటారని అవిజాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పుకలిగిస్తాయని చాటియా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు అశాంతితోపాటు వేర్పాటువాద భావాలుకలిగిన వారిని రెచ్చగొట్టే ప్రమాదం ఉందన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత రాహుల్‌కు ఉందని కానీ ఆయన అందుకు బలుదుగా అబద్దాలు వ్యాప్తిచేసి దేశ ఐక్యతను సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేస్తున్నారని చాటియా ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కొత్త కార్యాలయాన్ని ఇటీవలేప్రారంభించారు. ఈ కార్యక్రమంలోనే రాహుల్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి భారత్ దేశంపైనా కూడా రాజ్యాంగపరిరక్షణకు పోరాడుతున్నామని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను పలువురు కేంద్ర మంత్రులు తప్పుపట్టారు. కాంగ్రెస్ అసలు రూపం ఈవ్యాఖ్యలతో బయటకు వచ్చిందని బిజెపి జాతీయ అధ్యక్షుడు మంత్రి జగ్‌ప్రకాష్ నడ్డా అన్నారు.

# జార్ఖండ్‌లోని నాలుగు జిల్లాలకు అందుబాటులోకి రైలుసేవలు



**రాంచీ, జనవరి 19:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 యేళ్లు దాటాక తొలిసారిగా జార్ఖండ్‌లోని నాలుగు జిల్లాలకు రైలు సౌకర్యం అందుబాటులోకి రానున్నది. ఖుంటి, సిమ్డేగా, గుమ్లా, చత్రా జిల్లాలను రైలుమార్గంతో అనుసంధానించనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. రాంచీ డివిజన్ పరిధిలోకి వచ్చే ఈ రైల్వే ప్రాజెక్టు కోసం ప్రాథమిక సర్వే నివేదికను పూర్తి చేసినట్లు తెలిపింది. వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)ను రైల్వే బోర్డుకు పంపినట్లు పేర్కొంది. కాగా, ప్రస్తుతం ఉన్న రాంచీ-లోహర్దగా రైలు మార్గంతో గుమ్లా, ఖుంటి ,సిమ్డేగా జిల్లాలను అనుసంధానిస్తారు. అలాగే రాంచీ-హజారీబాగ్ రైలు మార్గంలో చత్రా జిల్లాను కలుపుతారు. జార్ఖండ్ రైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టు సర్వేను పూర్తి చేసింది. లోహర్దగా నుంచి గుమ్లా వరకు 55 కి.మీ., గుమ్లా నుంచి సిమ్డేగా వరకు 43 కిలోమీటర్లు, హతియా నుంచి ఖుంటి వరకు 20 కిలోమీటర్లు, హజారీబాగ్ నుంచి చత్రా వరకు 42 కిలోమీటర్ల మేర రైలు మార్గాన్ని నిర్మిస్తారు. మరోవైపు ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌లోని ఏడు జిల్లాల్లో కొత్త రైల్వే లైన్లు, ఇతర ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌ను గత యేడాది ఆగస్టులో కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. రూ. 6,500 కోట్ల వ్యయంతో చేపట్టే మూడు రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

# సైఫ్ ఆలీఖాన్‌పై దాడి నిందితుడు అరెస్టు



## మహ్మద్ షరీఫుల్ ఇస్లామ్ షెహజాద్‌గా పోలీసులు గుర్తింపు

**ముంబయి,జనవరి 19:** బాలివుడ్ నటుడు సైఫ్ ఆలీఖాన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడిని శనివారం అర్థరాత్రి దాటాక పోలీసులు థాణెలో అరెస్టు చేసారు. ఆదివారం ఉదయం డిసిపి దీక్షిత్ మీడియా సమావేశంలో పూర్తి వివరాలను వెల్లడించారు. ఈనెల 16వ తేదీ తెల్లవారు జామున 2 గంటలకు సైఫ్ ఆలీఖాన్‌పై దాడి జరిగింది. ఎఫ్ఐఆర్ నమోదుచేసాం. 30 ఏళ్ల మహ్మద్ షరీఫుల్ ఇస్లామ్ షెహజాద్ అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తించాం. ఆతడిని అరెస్టుచేసాం. దొంగతనంచేయాలనే ఉద్దేశ్యంతోనే ఆతడు సైఫ్ నివాసంలోకి వెళ్లాడని డిసిపి తెలిపారు. ఆతడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిస్తే ఐదురోజుల పోలీస్ కస్టడీకి ఇచ్చారు. ఆతడు బంగ్లాదేశీ యుడని గుర్తించినట్లు తెలిపారు. నిందితుడు అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించాడు. భారత్ వచ్చాక విజయ్‌దాస్‌గా పేరు మార్చుకుని ఆరునెలల క్రితం ముంబయి వచ్చాడని, భారతీయుడని చెప్పడానికి ఆతడివద్ద సరైన ఆధారాలు లేవన్నారు. బాంద్రాలోని సైఫ్‌నివాసంలో 16వ తేదీ తెల్లవారుజామున 2.30 గంటలకు ఈ సంఘటన జరిగింది. సైఫ్ ఆతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా దుండగుడు సైఫ్ చిన్న కుమారుడు జేహ్ గదిలోకి వెళ్లాడని, దుండగుడినిచూసిన జేహ్ కేర్‌టేకర్ కేకలువేయగా సైఫ్ అక్కడికి చేరుకున్న సమయంలోనే పెనుగులాట జరిగిందని, ఈక్రమంలో సైఫ్ గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. ఆరుచోట్ల కత్తిపోట్లుఉన్నాయని, హుటాహుటిన లీలావతి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన క్షేమంగా ఉన్నారని వైద్యులు ప్రకటించారు. ఐసియునుంచి ప్రత్యేక గదికి మార్చారని, ప్రస్తుతం సైఫ్ ఆలీఖాన్ లీలావతి ఆసుపత్రిలోనే ఉన్నట్లు తెలిపారు. దాడిఘటనపై కేసునమోదుచేసుకున్న ముంబయి పోలీసులు సుమారు 30బృందాలుగా ఏర్పడి 70 గంటలపాటు అనేక వ్యయప్రయాసలకోర్చి ఎట్టకేలకు నిందితుడిని థాణెలో అరెస్టు చేసారు. ఈకేసులో పోలీసులు అనేక గంటల సీసీటివిఫుటేజిని కూడా పరిశీలించారు. అంధేరిలోని డిఎన్‌నగర్‌లో నిందితుడు తచ్చాడుతున్నట్లు పోలీసులు సిసిటివిలో గుర్తించారు. నిందితుడు బైక్‌నుంచి దిగుతుండటం కనిపించింది. టూవీలర్‌నెంబరు ఆధారంగా ముందు గాలించారు. స్థానిక ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్స్ ప్రకారం వొర్లిలోని కోలివాడలో ఒక అద్దె ఇంటిని కూడా తనిఖీ చేసారు. నిందితుడు మరో ముగ్గురుతో కలిసి నివసిస్తున్నట్లు తేలింది. పోలీస్ టీమ్ ఆతడు నివసించేగదికి వెళ్లి అకనకడి ప్రజలను ప్రశ్నించారు. దీనితో ఆతడిపేరు, సమాచారం కొంత రాబట్టారు. అలాగే పోలీ సులు ఆతడి ఫోన్‌నంబరు కూడా తీసుకుని ఆతని ఫోన్ లొకేషన్‌ను ట్రాక్ చేసారు. ఇదిలా ఉండగా ముంబయి కోర్టు నగర పోలీసులకు నిం దితుడిని ఐదురోజుల పోలీస్ కస్టడీకి అనుమ తించింది. అరెస్టుచేసిన వెంటనే ఆతడిని కోర్టులో హాజరుపరిచారు. 14రోజులు కస్టడీకావాలని కోరిన పోలీసులకు న్యాయమూర్తి ఐదురోజులకు అనుమతించారు. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మాట్లా డుతూ బాంద్రా ప్రాంతంలో అనేకమంది సెలబ్రి టీలు ఉన్నారని, నిందితుడు సైఫ్ ఇంట్లోకి వచ్చా డని ప్లాన్‌ప్రకారమే కొనసాగినట్లు తెలిపారు. నిందితుడి తరపున దినేష్‌ప్రజాపతి న్యాయవాది వచ్చారు. తమ క్లయింటునుంచి రికవరీ చేసిందేమీలేదని, ఎలాంటి డాక్యుమెంట్లుకూడా నివేదించలేదని, ఆతడు బంగ్లాదేశీ అని చెప్పడానికి సరైనా ఆధారాలు చూపించలేకపోయారని ప్రజా



# డిఎంకెలో చేరిన నటుడు సత్యరాజ్ కుమార్తె

**చెన్నై, జనవరి 19:** బహుభాషా నటుడు సత్యరాజ్‌కుమారెనత దివ్యసత్యరాజ్ డిఎంకెలో చేరారు. తమిళనాడు ముఖ్యమంత్రి డిఎంకె చీఫ్ ఎంకె స్టాలిన్ సమక్షంలో ఆదివారం ఆమె డిఎంకెపార్టీలోచేరారు. పోషకాహార నిపుణురాలయిన దివ్యసత్యరాజ్ డిఎంకెలో చేరిన అంశాన్ని ఆపార్టీ ఎక్స్‌వేదికగా ప్రకటించింది. డిఎంకె ఎంపి టిఆర్‌బాలు పార్టీ నేతలు కెఎన్‌నెహ్రూ, పికె శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. 2019లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆమె స్టాలిన్‌ను కలిసిన సమయంలో డిఎంకెలో చేరుతున్నట్లు పెద్ద ఎత్తున ఊహాగానాలు వచ్చాయి అయితే కేవలం మర్యాదపూర్వకంగా మాత్రమే కలిసానని ఇరుకుటుంబాల మధ్య సన్నిహిత సంబం ధాలున్నట్లు అప్పట్లో ఆమె వివరణ ఇచ్చారు. తాజాగా డిఎంకెలో చేరిన సందర్భంగా దివ్య మాట్లాడుతూ ప్రజలకు సేవచేయాలనేది తన కల అన్నారు. చిన్ననాటినుంచే డిఎంకె విధానాలను ఇష్టపడినట్లు చెప్పారు. ఆపార్టీలో చేరడానికి అనేక కారణాలున్నాయన్న ఆమె తానొక పోషకాహార నిపుణురాలినని, డిఎంకే ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న పార్టీ అని అన్నారు. అందుకే రాష్ట్రంలో అల్పాహార కార్యక్రమాన్ని సైతం ప్రారంభించిందని తెలిపారు. మహిళలను అన్ని మతాలను గౌరవించే పార్టీ డిఎంకె అని అన్నారు.

## అధికార నంది కుంభాభిషేకం: విగ్రహ ప్రతిష్ఠలు

**శ్రీకాళహస్తి,జనవరి 19 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాల యంలో కుంబాభిషేకాలు,విగ్రహ ప్రతిష్టల కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు అంగరంగవైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయం కంచుగడప వద్ద రెండేళ్ళ క్రితం అధికార నంది విగ్రహం ఒరిగిందన్నారు. అయితే దానిని గతంలో తాత్కాలికంగా మరమ్మత్తులు చేపట్టామన్నారు.కానీ శాశ్వత మరమ్మత్తులు చేసి నంది విగ్రహాన్ని ప్రతిష్టించామన్నారు. ఈ విగ్రహానికి ఆదివారం అర్చకుల సూచనలతో కుంబాభిషేకం జరుపుటకు నిర్ణయించారు.ఈ మేరకు ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా హోమాలు,కలశాలు ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.పూజలు నిర్వహించిన తరువాత పూర్ణాహుతి జరిపారు. కార్యక్రమాలను 16కాళ్ళ మండపం లో కార్యక్ర మాలను ఏర్పాటు చేసారు.ఆలయ ఇఓ టి. బాపిరెడ్డి సంకల్పంతో అధికార నంది కలశాభిషేక పూజలు జరిపారు. పూజలతో పునీతమైన కలశ జలాలతో కొత్తగా ప్రతిష్టించిన అధికార నంది విగ్రహానికి అభిషేకించారు.ఈ కార్యక్రమాల్లో ఇఓతో పాటు డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ సిఎస్ఓ నాగభూషణం యాదవ్, టెంపుల్ఇన్స్పెక్టర్ హరియాదవ్, ఆలయ ప్రధానార్చకులు సంబంధంగురుకుల్, కరుణాకర్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి అర్చకులు ఎస్ఎంకె శ్రీనివాస గురుకుల్ ఆలయాధికారులు పాల్గొన్నారు. కాగా రూ.1.25కోట్లతో నిర్మించిన వాహనాల మండపంలో గణపతి, చండీకేశ్వర స్వామి ప్రతిష్టల కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం కుంబాభిషేకం జరుపుటకు నిర్ణయించినట్లు సమాచారం.



అధికార నంది విగ్రహానికి అభిషేకం జరుపుతున్న దృశ్యం,

## ఏనుగుల దాడిలో నారావారిపల్లి ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి మృతి
### రాకేష్ కుటుంబానికి అండగా ఉంటా: ఎంఎల్ఏ నాని

**చంద్రగిరి, జనవరి 19 ప్రభాతవార్త:** ఏనుగుల దాడిలో కందులవారిపల్లి (నారావారిపల్లి) ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి (33) శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత పంచాయతీ, కందులవారిపల్లి, వచ్చిన పెద్ద ఏనుగు గ్రామస్థులను తరుముకున్నది. గ్రామస్థుల తలో దిక్కు పరుగులు పెట్టగా, కొంత మంది చెట్లెక్కి ప్రాణాలను రక్షించుకున్నారు. ఏనుగుల గుంపు వెళ్ళిపోయినట్లు భావించి ఏమరుపాటుతో వున్న రాకేష్‌పైకి వచ్చిన ఏనుగు తన తొండంతో కొట్టి, కాలితో



మామిడిమాను గడ్డకు చెందిన ఉప సర్పంచ్, ఐటిడిపి మండల అధ్యక్షుడు మారుపూరి తరీష్ బాబు (రాకేష్ చౌదరి) నారావారి కుటుంబానికి, తెలుగుదేశం పార్టీకి అత్యంత విధేయుడుగా వున్న రాకేష్ మృతి తెలుగుదేశం పార్టీకి, పంచాయతీ ప్రజలకు తీరనిలోటును మిగిల్చింది. సంక్రాంతి సంబరాలకు సొంతూరు చేరుకున్న నారావారి కుటుంబానికి అవసరమైన మేరకు సేవలందించారు. గత వారం రోజులుగా సుఖ సంతోషాల నడుమ సంక్రాంతి సంబ రాలను జరుపుకుని నారావారిని సాగనంపారు. శనివారం రాత్రి వరకు అందరితో మాట్లాడిన రాకేష్ నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి తమ గ్రామ సమీప పొలల్లోకి ఏనుగుల గుంపు వచ్చినట్లు సమాచారం అందున్నాడు. గ్రామస్థులతో కలసి టార్చిలైట్స్ తీసుకుని ఏనుగుల గుంపును తరిమేందుకు బయలుదేరి వెళ్ళారు. ఏనుగుల గుంపు వేళ్ళిపోతున్న క్రమం లో ఓ గున్న ఏనుగు తన గుంపులో నుండి తప్పిపోయింది. అయితే ఆ గున్న ఏనుగు కోసం తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాకేష్ మృరణ వార్త తెలుసుకున్న ఎంఎల్ఏ పులివర్తి నాని దిగ్భ్రాంతికి లోనై అర్ధరాత్రి హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. ఎంఎల్ఏ పులివర్తి నాని కందులవారిపల్లి ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి మృతి సమాచారం అర్ధరాత్రి వేళ వేగంగా వ్యాపించడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున గ్రామానికి చేరుకున్నారు. ఘటనా స్థలి నుండి ఎంఎల్ఏ మృతదేహాన్ని గ్రామానికి తీసుకురావడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు బోరున విలపించారు. ఈ క్రమంలో రాకేష్ కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎంఎల్ఏ అండగా వుంటానని ధైర్యం చెప్పారు. అక్కడి నుండి రాకేష్ మృతదేహాన్ని చంద్రగిరి ప్రభుత్వ ఏరియాఆసుపత్రికి తరలించారు. ఎంఎల్ఏ వెంట టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, నాయకులు గౌస్‌భాషా, ఏజి పల్లిబాల, శానంబట్ల తులసిరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రికి చేరుకున్నారు.

## లారీని ఢీకొట్టిన కారు..ఇద్దరు చిన్నారులు మృతి
### మరో నలుగురికి తీవ్రగాయాలు



**చంద్రగిరి, జనవరి 19 ప్రభాతవార్త:** కారు లారీని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు (ఒక బాబు, పాప) అక్కడికక్కడే మృతి చెందారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ, జక్కలవారిపల్లి వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో పాతరోడ్డుపై తమిళనాడు, కోయంబత్తూరు నుండి తిరుమలకు వస్తున్న కారు చిత్తూరు వైపు వెళుతున్న లారీని నేరుగా ఢీకొట్టడంతో కారు లారీ క్రిందకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు జీవన్ (10), విశ్వ (06), తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో కార్తికేయన్ (50), సతీష్ (35), కలైవేణి (45), ఐశ్వర్య (30) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సిఐ సుబ్బరామిరెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్ ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

## పెద్దన్న రాజీ పడని పోరాట యోధుడు
### ఎఫ్‌టియు (న్యూ)రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా

**అనంతపురం, జనవరి 19,ప్రభాతవార్త బ్యూరో:** సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు కమిటీ పెద్దన్న హలో పెరుగుని పోరాట యోధుడని (న్యూ) రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పండా అన్నారు. రైల్వే స్టేషన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పెద్దన్న వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ పండా మాట్లాడుతూ కామ్రేడ్ పెద్దన్న చిన్న వయసు నుంచే కమ్యూనిస్టు ఉద్యమాలవైపు ఆకర్షితులో అయ్యారన్నారు. తరిమెల నాగిరెడ్డి తో పాటు విప్లవ ఉద్యమ లో పని చేసారన్నారు. ఎన్జీవో అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆయన ప్రభుత్వ ఉద్యోగానికి సైతం రాజీనామా చేసి పీడత వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఏపీ లైటింగ్స్, ఆయిల్ ఫెడ్, పంపు మెకానిక్స్ యూనియన్ తదితర సంఘాలకు నాయకత్వం వహించారని పేర్కొన్నారు. త్ర్యు (న్యూ )రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఆటో కార్మికులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రోడ్డు ప్రమాదాలలో గాయ పడిన క్షతగాత్రులు సకాలంలో రక్తం అం దక ప్రాణాలను పోగొట్టు కుంటున్నా రన్నారు. రక్తదానంతో వారి ప్రాణా లను కాపాడిన వారవుతార న్నారు. ఈ కార్యక్ర మంలో మానవత రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమర్నాథ్ రెడ్డి, సభ్యుడు సలీం, సం ఘం నాయకులు రాజా, హాజీ వలి, చక్రపాణి, రమ్య, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# ఎపి అభివృద్ధికి ప్రత్యేక సాయం

### ప్రభుత్వ అధికారయంత్రాంగంతో సమస్యలుంటే సిఎంకు చెప్పండి
### కేంద్రం చేస్తున్న సాయం గురించి ప్రజలకు వివరించండి
### బిజెపి కార్యకర్తలతో భేటీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**విజయవాడ,జనవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీని అభివృద్ధి చేయడంలో కేంద్రం కీలక వ్యవహరిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా స్పష్టం చేసారు. ఆరునెలల వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు రూ.50వేలకోట్లు దాకా నిధులు ఇచ్చామన్నారు.వీటిలో కీలకంగా అమరావతి నిర్మాణానికి, పోలవరం పనులకు,విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నుంచి నిధులు అందిస్తున్నామన్నారు.ప్రతి బిజెపి కార్యకర్త రాష్ట్రంలో ఉన్నది ఎన్డీఏ ప్రభుత్వమని గుర్తించుకోవాలన్నారు. కేంద్రంలోను, రాష్ట్రంలోను జరిగే అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు.రాష్ట్రానికి కేంద్రానికి అందించే సాయం గురించి ప్రజలకు బలీయంగా వివరించాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగంలో ఇబ్బందులు గమనిస్తే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్ళాలన్నారు.ఎటువంటి అంశమైన అంతర్గతంగా పరిష్కారం జరగాలన్నారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేల సమావేశం విజయవాడలోని ఓ హోటల్ లో ఆదివారం జరిగింది. దాదాపు గంటన్నర పాటు ఈ సమావేశం కొనసాగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు , ఎంపీలు 20 మంది నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి అందజేసే సాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపైన చర్చ జరిగింది.ఎమ్మెల్యేలు.ఎంపీలు అభిప్రాయాలను అమిత్‌షా అడిగి తెలుసుకున్నారు.ఏపీలో కూటమి ప్రభుత్వ నిర్ణయాలు.పార్టీ పరిస్థితి పైన ఆయన ఆరా తీసారు. పార్టీ బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారని ప్రశ్నించారు. పార్టీ సమావేశాల గురించి ఆరా తీసారు. పార్టీ లో సమన్వయం ఉండాలని సున్నితంగా హెచ్చరించారు. ప్రభుత్వంలో కొనసాగుతున్నా.. పార్టీ పరంగా కార్యక్రమాలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రం నుంచి ఏపీకి పెద్ద ఎత్తున సాయం అందుతోందని.. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పష్టం చేసారు. పార్టీలో బూత్ స్థాయి నుంచి బలోపేతం పైన మార్గనిర్దేశం చేసారు. ఈ సందర్భంగా బీజేపీ కేడర్‌కు కీలక అంశాలపై అమిత్ షా దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వం రాజధాని అమరావతిని పట్టించుకోలేదు, హడ్కో ద్వారా అమరావతికి రూ.27,000ల కోట్ల సాయం అందిస్తున్నాం. ఏపీకి జీవనాడి అయిన పోలవరంపై చంద్రబాబుతో నేను ప్రత్యేకంగా చర్చించాను. 2028 లోపు ఆంధ్రప్రదేశ్ మొత్తం పోలవరం ద్వారా నీళ్ల పారిస్తాం. ఏపీ అభివృద్ధి కోసం చంద్రబాబుకు మోడీ అండదండలు ఉన్నాయి. విశాఖలో రూ.2 లక్షల కోట్ల విలువైన గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు రానున్నాయి. విశాఖ రైల్వేజోన్‌ను కూడా పట్టాలెక్కించాం అని అమిత్ షా వ్యాఖ్యానించారు. విశాఖ ఉక్కు కర్మాగారం తెలుగుజాతి మనోభావాలతో ముడిపడిన అంశం కాబట్టే ప్యాకేజీ ఇచ్చి ఆదుకున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. విశాఖ ఉక్కుకు మంచి భవిష్యత్ ఉందన్న ఆయన అందరూ సమిష్టిగా కృషి చేసి లాభాల్లోకి తీసుకురావాలని చంద్రబాబుకు సూచించామన్నారు.ఈ విషయంలో ఎన్డీఏలో భాగస్వామ్య పక్షంగా బిజెపికుడా లీడ్ తీసుకోవాలన్నారు.ఈ విషయంలో కేంద్రం అందించిన సహకారాన్ని గురించి విస్తృతంగా ప్రజల్లోకి ప్రచారం చేయాలన్నారు.. ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలనే అంశం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందంటూ పురందేశ్వరి అమిత్ షా వద్ద ప్రస్తావించారు. భారతరత్నకు ఎన్టీఆర్ అన్ని విధాల అర్హుడని అమిత్‌షా అన్నారు.



**వికసిత్ భారత్ లో విపత్తుల నిర్వహణ కీలకం**

2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే దృఢమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్న సమయంలో వికసిత్ భారత్ లో విపత్తు నిర్వహణ అనేది చాలా కీలకం. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను అంచనా వేయడం, దానికి తగినట్లుగా సన్నద్ధం కావడం అనేది నిరంతర ప్రక్రియ. మారుతున్న ప్రపంచ వాతావరణ పరిస్థితులతోపాటు, స్థానికంగా మారుతున్న వాతావరణ అంశాలను బేరీజు వేసుకొని ముందుకు సాగాలి. రాబోయే విపత్తులను ముందుగానే అంచనావేసుకొని, దాన్ని ఎదుర్కొనేందుకు ప్రాణ, ఆస్తి నష్టాల నివారణకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది. క్లైమెట్ స్మార్ట్ నేషన్ ను సాధించే దిశగా ప్రధాని మోడీ చేస్తున్న సూచనలను అందిపుచ్చుకోవాలి. ఆంధ్రప్రదేశ్ సైతం ప్రగతి దిశగా ముందుకు దూసుకెళ్తోందన్నారు. విజయవాడలో జరిగిన విశ్వహిందూ పరిషత్‌సభ గురించి ఆరా తీసినషా. ఏపీలో తాజాపరిణామాలపైన చర్చించారు. ఏపీలో బీజేపీ ఎదిగేందుకు ఇప్పుడు అనుకూల సమయం ఉందని కేంద్రం అందిస్తున్న మద్దతు పైన ప్రజల్లో సానుకూలత ఉందని అమిత్‌షా అభిప్రాయపడ్డారు. పార్టీలో కమిటీల నియామకం గురించి షా ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఆరోగ్యశాఖమంత్రిగా బాధ్యతలను నిర్వహిస్తున్న సత్యకుమార్ యాదవ్‌ను ఆయన అభినందించారు.ప్రతి విషయంలో సమన్వయంతోనే ముందుకు అడుగులు వేయాలన్నారు.

## పారాగ్లైడింగ్‌లో పట్టుతప్పి లోయలోపడి ఇద్దరు మృతి

**పనాజి, జనవరి 19:** పారాగ్లైడింగ్‌చేస్తూప్రమాదవశాత్తూ వంద అడుగుల ఎత్తునుంచి లోయలో పడిపోవడంతో పర్యాటకురాలు ఇన్‌స్ట్రక్టర్ మృతిచెందారు. ఈ ఘటన ఉత్తరగోవాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం మహారాష్ట్రలోని పూణెకు చెందిన 27 ఏళ్ల మహిళా పర్యాటకురాలు శనివారంసాయంత్రం గోవాలోని కేరి గ్రామానికి వచ్చింది. సుమల్ నేపాలి(26) అనే ఇన్‌స్ట్రక్టర్ సాయంతో పారా గ్లైడింగ్‌కు వెళ్లింది. 100 అడుగుల ఎత్తు లో వీరు పట్టుతప్పి లోయంలో పడిపోయారు. ఇద్దరూ అక్కడికక్కడే మరణిం చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అడ్వెంచర్‌స్పోర్ట్స్‌కంపెనీచట్ట విరుద్ధంగా పారా గ్లైడింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. కంపెనీ యజమాని శేఖర్ రైజాదాపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు. అలాగే రెండురోజులక్రితం హిమాచల్‌ప్రదేశ్‌లోనికాంగ్రా, కులు జిల్లాల్లో24 గంటల వ్యవధిలో రెండు వేరువేరు పారా గ్లైడింగ్‌ప్రమాదాల్లో ఇద్దరు పర్యాటకులు మృతిచెందారు. గార్సా ల్యాండింగ్ సైట్ సమీపంలో ఒక పారాగ్లైడర్‌ప్రమాదవశాత్తూ మరో పారాగ్లైడర్‌ను ఢీకొనడంతో తమిళనాడుకు చెందిన వ్యక్తిప్రాణాలు కోల్పోయాడు. ధర్మశాల సమీపంలోని ఇంద్రునాగ్ సైట్‌లో పారాగ్లైడింగ్‌చేసేందుకు టేకాఫ్ అవుతుండగా పట్టుతప్పి పడిపోవడంతో గుజరాత్‌కు చెందిన వ్యక్తి మృతిచెందాడు.



## గంగానదిలో పడవ బోల్తా
## ముగ్గురు మృతి,నలుగురు గల్లంతు

**కతిహార్(బీహార్)జనవరి 19:** రాష్ట్రంలోని కతిహార్ జిల్లాలోని గంగానదిలో ఒక పడవ మునిగిపోవడంతో ముగ్గురుచనిపోగా మరో నలుగురు గల్లంతయ్యారు. మొత్తం 17 మందితో ఈ పడవ గంగనాదిలో వెళుతోంది. ఆందాబాద్‌ప్రాంతంలోని గోలాఘాట్‌వద్ద ఈ పడవ హటాత్తుగా మునిగిపోయింది. ఈప్రమాదంనుంచి పది మందిని ఇప్పటివరకూ రక్షించామని కొందరు ఈతకొట్టుకుంటూ ఒడ్డుకు చేరారన్నారు. ఇప్పటికీ సహాయక చర్యలు కొనసాగుతునాన్నాయి. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు విచారణకు ఆదేశించినట్లు జిల్లా మేజిస్ట్రేట్ మనేష్‌కుమార్‌మీనా చెప్పారు. మృతుల్లో ఇద్దరు 60 ఏళ్లపవన్‌కుమార్, 70 ఏళ్లసుధీర్ మండల్ అని తేలింది. మిగిలినవారిని కూడా గుర్తించాల్సి ఉందని జిల్లామేజిస్ట్రేట్ చెప్పారు.



## శుభలేఖలు ఇచ్చేందుకువెళ్లి కారులో మంటలకు ఆహుతి!

**న్యూఢిల్లీ, జనవరి 19:** కొద్దిరోజుల్లోనే పెళ్లిపీటలు ఎక్కాల్సిన వరుడు విద్యుత్ షార్ట్‌సర్క్యూట కారణంగా కారులో లేచిన మంటల్లోనే సజీవదహనం అయిపోయాడు. దేశరాజధాని న్యూఢిల్లీలో జరిగిన ఈఘోరంపై అందరూ కన్నీటిపర్యంతం అయ్యారు. వచ్చేనెల 14వ తేదీ జరిగే ఆతడి వివాహంకోసం అందరికి శుభలేఖలు ఇచ్చేందుకు తానేస్వయంగా వరుడు బయలుదేరాడు. గ్రేటర్‌నోయిడాలోని నవాడాకు చెందిన అనిల్ తన బంధుమిత్రులందరికీ తానేస్వయంగా ఇవ్వాలన్న లక్ష్యంతో బయలుదేరాడు. ఈక్రమంలో ఘాజీపూర్‌బాబా బోకేహాల్ సమీపంలో ఆతడుప్రయాణిస్తున్న కారు అగ్నికి ఆహుతి అయింది. ఈప్రమాదంలో కారు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆ క్రమంలో దాదాపుగా అగ్నికి ఆహుతి అయిన ఆతడిని మృతదేహాన్ని పోస్టుమార్టంకోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆహ్వానపత్రాలు తీసుకెళ్లిన అనిల్‌కు కుటుంబసభ్యులు ఆతడి సెల్‌కు అనేకసార్లు ఫోన్‌చేసారు కానీ స్పందన లేకపోవడంతో కంగారుపడ్డారు. రాత్రి 11.30 గంటల సమయంలో పోలీసులు అనిల్‌కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి జరిగిన సంఘటన వివరించారు. దీనితో వారంతా కన్నీరుమున్నీరవుతూ ఆసుపత్రికి చేరు కున్నారు. అనిల్‌బామరిది యోగేష్ మాట్లాడుతూ తన సోదరితో అనిల్‌కు పెళ్లి నిశ్చయం అయిందని, ఫిబ్రవరి 14న వారి వివాహాన్ని పెద్దలు నిశ్చయించారని తెలిపారు. కారులో అగ్ని ప్రమాదం ఎలా జరిగిందనేది తను ఇప్పటికీ అంతుబట్టని విషయంగా ఉందన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిసానతమని, కేసునమోదుచేసి దర్యాప్తును ప్రారంభించినట్లు తెలిపారు.



## తెలంగాణలో ఉచిత గృహ విద్యుత్‌కు రూ.125.84 కోట్లు విడుదల

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణలో గృహజ్యోతి పథకం కింద అమలు చేస్తున్న ఉచిత కరెంట్ నిమిత్తం విద్యుత్ పంపిణీ సంస్థలకు సబ్సిడీ సొమ్మును రాష్ట్ర సర్కార్ విడుదల చేసింది. ఈనెలకు గాను రూ.125.84 కోట్లను విద్యుత్ సంస్థలకు విడుదల చేస్తూ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 200 యూనిట్ల దాకా వినియోగించే పేద వర్గాలకు ఈ పథకం ద్వారా ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్న విషయం విదితమే. గత మార్చి ఒకటి నుంచి అమలు చేస్తున్న గృహ జ్యోతి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 148.5 కోట్ల రూపాయలను చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో గృహ జ్యోతి పథకం అమలు చేస్తున్నప్పటి నుండి ఇప్పటి వరకు విద్యుత్ పంపిణీ సంస్థలకు 1,485 కోట్ల రూపాయలను చెల్లించింది. కాగా నెలకు 200 యూనిట్ల లోపు కరెంటు వినియోగిస్తున్న 50 లక్షల కుటుం బాలకు గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లులను విద్యుత్ పంపిణీ సంస్థలు జారీ చేస్తు న్నాయి. ఒక్క హైదరాబాద్ నగరంలోనే 10.52 లక్షల కుటుంబాలు గృహ జ్యోతి పథకం కింద ప్రయోజనం పొందుతున్నాయి.



ఆదివారం వేమన చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

## వేమన విజ్ఞానం వెలుగులోకి రావాలి
### వేమన జయంతి సభలో మాజీ వైస్ ఛాన్సలర్ హుసేన్ రెడ్డి వెల్లడి

**అనంతపురం, జనవరి 19, ప్రభాతవార్త బ్యూరో:** వేమన పద్యాలలోని నైతిక మానవతా విలువలతో పాటు ఆనాటి విజ్ఞాన అంశాలు కూడా వెలుగులోకి రావాలని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్, రసాయన శాస్త్ర ఆచార్యులు హుసేన్ రెడ్డి పేర్కొన్నారు. వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక యస్.యస్.బి.యన్ కళాశాల ప్రాంగణంలో వేమన జయంతి సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన హుసేన్ రెడ్డి పాల్గొని వేమన మార్గం భావితరాలకు స్ఫూర్తి దాయకమని, సమాజ పురోగతికి శాస్త్రీయ ఆలోచనలకు వేమన తాత్వకత ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాల సమర్పించారు. వేమన ఫౌండేషన్ కార్యక్రమాల నివేదికను కార్యదర్శి డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి వివరించారు. వేమన భావాజాలం సమాజంలోనికి తీసుకెళ్లడానికి ఈ సంవత్సరం ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం విశ్రాంత ఆచార్యులు బయారెడ్డి, రవీంద్రారెడ్డి, సామాజిక నాయకులు కె.వి రమణ, విశ్రాంత ఉద్యోగులు మనోహర్ రెడ్డి, లక్ష్మినారాయణ రెడ్డి, కవి టివి రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు లోకన్న, కృష్ణారెడ్డి, నాగశేషారెడ్డి, పరంధామరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.


## ఆప్టా క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జనవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ నియ మించాలని సీఎం చంద్రబాబును ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు గణపతిరావు, ప్రకాశ్‌రావు కోరారు. ఉం డవల్లి లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆప్టా డైరీ క్యాలెండర్‌ను చంద్రబాబు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను వారు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఆప్టా రాష్ట్ర సహా అధ్యక్షుడుఎంజీ మహది, కర్నూలు జిల్లా నాయ కులు ఆర్ సేవా లాల్‌నాయక్, మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

## దేశంలో 90కోట్లు దాటేసిన ఇంటర్నెట్ వినియోగదారులు

**న్యూఢిల్లీ, జనవరి 19:** దేశంలో ఇంటర్నెట్ వినియోగించే చందాదారుల సంఖ్య 90 కోట్లను దాటేసింది. డిజిటల్ కంటెంట్‌కోసం ప్రాంతీయ భాషల వినియోగంపెరగడమే ఇందుకు కారణమని ఐఎంఎఐ కాంటార్‌నివేదిక స్పష్టం చేసింది. ది ఇంటర్నెట్ ఇన్ ఇండియా రిపోర్ట్ 2024 పేరిట ఈ నివేదిక విడుదలచేసింది. 2023తోపోలిస్తే 2024లో ఇంటర్నెట్ చందాదారులసంఖ్య 8శాతంపెరిగి 88.6 కోట్లుగా ఉంది. గ్రామీణభారత్‌లో 48.8 కోట్లమంది ఇంటర్నెట్ వినియోగదారులున్నారు. మొత్తం ఇంటర్నెట్ జనాభాలో గ్రామీణ వాటా 55శాతంగా ఉంది. భారత్‌లో ఇంటర్నెట్ వినియోగధోరణు ల్లో ప్రాంతీయభాషలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. భారత భాషల్లోని కంటెంట్‌ను 98శాతం మంది ఇంటర్నెట్ వినియోగదారులు వాడుతున్నారు. తమిళం, తెలుగు, మలయాళం ఇందులో ముందున్నాయి ఈభాషల్లో కంటెంట్ అధికంగా లభించడమే ఇందుకు కారణమని తేలింది.పట్టణ ఇంటర్నెట్ వినియోగదారుల్లో 57శాతంమంది ప్రాంతీయ భాషల కంటెంట్ వినియోగానికి ఆసక్తిచూపి స్తున్నారు. అన్నిభాషల్లోను స్థానిక కంటెంట్‌కు డిమాండ్ పెరుగుతోంది. భారత్‌లో డిజిటల్ లింగభేదం స్థిరంగా తగ్గుతున్నట్లు సర్వే వెల్లడించింది. ఇంటర్నెట్ కస్టమర్లలో ప్రస్తుతం 47శాతంమంది మహిళలున్నారు. గ్రామీణప్రాంతాల్లో ఇంటర్నెట్‌వాడే మహిళల వాటా 58శాతంగా ఉంది. కొన్నేళ్లలో డిజిటల్ పరంగా పురోగతి సాధించడాన్ని ఇది చూపిస్తోంది. గ్రామీణప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో వృద్ధినెమ్మదించింది.

గ్రామీణప్రాంతాల్లో ఇంటర్నెట్ వినియోగం తక్కువగా ఉండటం కూడా అధిక వృద్ధికి కారణం అవుతోంది. పట్టణప్రాంతాల్లో స్మార్ట్ టివిలు స్మార్ట్ స్పీకర్‌ల వినియోగం 54శాతంపెరిగింది. పట్టణ గ్రామీణప్రాంతాల్లో ఇంటర్నెట్‌ను మొబైళ్లలో ఎక్కువగా వాడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒటిటి విడియో, మ్యూజిక్‌స్ట్రీమింగ్ ఆన్‌లైన్ కమ్యూనికేషన్ సోష ల్‌మీడియా వంటి వాటిని ఎక్కువ వినియోగిస్తుంటే పట్టణప్రాంతాల్లో నెట్‌కామర్స్, డిజిటల్ చెల్లింపులు ఆన్‌లైన్ విద్యకోసం వాడుతున్నారు.



## హైదరాబాద్ సిటీ పోలీసువిభాగంలో శాంతిభద్రతల కోసం
## 573 ఎఆర్ కానిస్టేబుళ్ల అటాచ్

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** నగర పోలీసు విభాగంలో శాంతి భద్రతల పరిరక్షణకు సాయుధ బలగంలో వున్న 573 మంది కానిస్టేబుళ్లను శాంతి భద్రతల విభాగానికి అటాచ్ చేశారు. ఇందులో 223 మంది మహిళలు కాగా 350 మంది పురుషులు వున్నారు. వీరిని నగరంలోని 71 శాంతి భద్రతల పోలీసు స్టేషన్లకు 284 మంది, ట్రాఫిక్ విభాగానికి 225 మంది, ఎస్‌బికి 25, టాస్క్‌ఫోర్స్‌కు 25 మంది, నార్కోటిక్ వింగ్‌కు ఎనిమిది మంది, సైబర్ క్రైం విభాగానికి ఆరుగురిని కేటాయించారు. ఈ మేరకు సిటీ కొత్వాల్ ఆనంద్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. శాంతి భద్రతల విభాగానికి అటాచ్ అయిన సాయుధ బలగం కానిస్టేబుళ్లతో కమిషనర్ ఆనంద్ బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొత్త సిబ్బంది ఎలా విధులు నిర్వహించాలనే దానిపై ఆయన సూచనలు చేశారు.

# జోరందుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు**

**బిజెపి అభ్యర్థులను ప్రకటించగా.. ఇంకా ప్రకటించని కాంగ్రెస్, బిఆర్ఎస్**

**మార్చిలో రెండు ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు**

**మరో 5 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలకు కూడా..**

**నెలాఖరులో లేదా ఫిబ్రవరి మొదటి వారం షెడ్యూల్ జారీ**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏప్రిల్‌లో 8 ఎమ్మెల్సీ స్థానాలకు గడువు ముగియనుండటంతో.. ఆయా స్థానాలకు మార్చిలోనే ఎన్నికలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ ఈ నెల చివరి వారంలో గానీ లేదా ఫిబ్రవరి మొదటి వారంలోగానీ ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ స్థానాల్లో రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలు, ఒక గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఉండగా.. మరో 5 ఎమ్మెల్సీలను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రచారం జోరందుకుంది. ప్రధాన ఉపాధ్యాయ సంఘాలుగా కొనసాగుతున్న యూటీఎఫ్, పీఆర్‌టీయూ రెండు స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించాయి. ఇప్పటికే ఆయా సంఘాలు ప్రకటించిన అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించారు. టీఎస్ యూటీఎఫ్ తరపున నల్గొండ - వరంగల్ -ఖమ్మం నియోజకవర్గానికి ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డిని తిరిగి అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పీఆర్‌టీయూ టీఎస్ తరపున ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతున్న పింగిలి శ్రీపాల్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగా ఆదిలాబాద్-నిజామాబాద్- కరీంనగర్- మెదక్ అభ్యరిగా వంగ మహేందర్‌రెడ్డిని ఎంపిక చేయగా.. ఇద్దరు అభ్యర్థులు తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజక వర్గానికి సంబంధించి ఎస్‌టీయూ టీఎస్‌తోపాటు జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్(జాక్టో) తరపున మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పోటీలో కొనసాగుతున్నారు. ఇదే స్థాన నుంచి బీజేపీ తన అభ్యర్థిగా మాజీ పీఆర్‌టీయూ నేత పి సరోత్తమ్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగా.. ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్-కరీంనగర్ నుంచి ప్రైవేటు విద్యా సంస్థల యజమాని కొమురయ్యను అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ఇప్పటికే అభ్యర్థులుగా ఎంపికైన వారు తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ తరపున ఇప్పటి వరకు రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు.

కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాల నుంచి పోటీ చేయకుండా వామపక్ష పార్టీలకు తమ మద్దతును ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్-కరీంనగర్ గ్రాడ్యుయేట్ స్థానానికి త్వరలోనే అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ స్థానం ప్రస్తుతం కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం.. టీ జీవన్ రెడ్డి గత ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. అయితే ఈ మధ్య కాలంలో ఆయనకు పార్టీకి మధ్య సమస్యలు కొనసాగుతున్నాయి..

ఈ నేపథ్యంలో తిరిగి ఆయనకే టికెట్‌ను ఇస్తారా? లేకపోతే వేరేవారికి ఇస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే బీజేపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి తమ అభ్యర్థిని ప్రకటించింది. ఇక మొన్నటి వరకు రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో కొనసాగిన భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. కానీ ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్-కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత తనయ ప్రస్తుత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశంతోనే ఈ మధ్య కాలంలో కవిత ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనడమే కాకుండా.. పార్టీ తరపున ఆందోళనా కార్యక్రమాలను, ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ధర్నాలను సైతం నిర్వహిస్తున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన ఉపాధ్యాయ సంఘాలే కాకుండా తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు, ఇతర చిన్న చిన్న సంఘాల తరపున కూడా అభ్యర్థులు పోటీ చేస్తామని ప్రకటించారు. కొందరైతే ఇప్పటికే అభ్యర్థులను కూడా ప్రకటించారు. ఈ మూడు స్థానాలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల చివరివారంలోగానీ లేదా ఫిబ్రవరి మొదటి వారంలోగానీ వెలువడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



## తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి

**అవినీతిరహిత పాలన కావాలంటే బిజెపి అధికారంలోకి రావాల్సిందే: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**పార్టీలో చేరిన వివిధ పార్టీ నాయకులు**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణలో అవినీతి రహిత పాలన అందాలంటే రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న, అవినీతి, నష్టాలకు, అక్రమాలకు, దోపిడికి బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణమని చెప్పారు. దేశంలో గత పదేళ్లు అధికారంలో ఉన్న బిజెపి కేంద్ర మంత్రులపై, ప్రభుత్వంపై ఒక్క రూపాయి అవినీతి చేసినట్లు కనీసం ఆరో పణలు కూడా రాలేదని అన్నారు. ఆదివారం మధ్యాహ్నం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో వివిధ పార్టీలకు చెందిన కీలక నేతలు, కార్యకర్తలు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. అందుకే రాష్ట్ర ప్రజానీకం బిజెపిని ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నారని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ఎనిమిది పార్లమెంట్ స్థానాలు ఇచ్చారని గుర్తు చేశారు.

## నేటితో ముగియనున్న టెట్ పరీక్షలు

**ఫిబ్రవరిలో ఫలితాలు విడుదల**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత కోసం నిర్వ హించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)2024-25కి సంబంధించిన పరీక్షలు నేటి(సోమవారం)తో ముగియనున్నాయి. పేపర్-1 పరీక్షలు శని వారంతో ముగియగా.. నేటి(సోమవారం)తో పేపర్-2 పరీక్షలు కూడా ముగి యనున్నాయి. ఈ నెల 2 నుంచి ఆన్‌లైన్ విధానంలో టెట్- 2024-25 పరీక్షలు ముగియనున్నాయి. పరీక్షల ఫలితాలను ఫిబ్రవరిలో విడుదల చేయడానికి పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. టెట్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 2,75,753 మంది దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1కి 94,327 దరఖాస్తులు రాగా.. పేపర్-2కి 1,81,426 దరఖాస్తులు వచ్చాయి. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు.. రెండో సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటలకు కొనసాగిస్తున్నారు. టెట్-2 పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లో 92 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను ఈ నెల 2 నుంచి 20 వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. మొత్తం 10 రోజులపాటు 20 సెషన్లలో పరీక్షలను పూర్తిచేశారు. టెట్-2 ఫలితాలు వెలువడిన అనంతరం ఏప్రిల్, మే నెలల్లో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ(డీఎస్సీ)-2025 నోటిఫికేషన్‌ను జారీ చేసే అవకాశం ఉంది. సుమారు 6 వేల పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని ఇప్పటికే పలువురు మంత్రులు ప్రకటించిన విషయం తెలిసిందే.

## నెహ్రూ హయాంలో మృత్యుహేల..

## మోడీ సారథ్యంలో మహాద్భుతంగా మహాకుంభమేళా

**ఎక్స్(ట్విట్టర్)లో రాష్ట్ర బిజెపి**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** నెహ్రూ హయాంలో మృత్యుహేల.. మోడీ సారథ్యంలో మహాద్భుతంగా మహా కుంభమేళ అని బిజెపి తెలంగాణ ఆరోపించింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా ఘనంగా జరుగుతున్నదన్నారు. మహాకుంభమేళాకు అన్ని రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వం అన్నీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా మహా కుంభమేళా ఏర్పాట్ల విషయమై కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తూ.. బిజెపి తెలంగాణ ఆసక్తికర ట్వీట్ చేసింది. ఇందులో 144 యేళ్ల కొకసారి జరిగే మహా కుంభ మేళాకు పెద్దఎత్తున భక్తులు పోటెత్తుతారు అనేది సత్యమని, అందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో కాంగ్రెస్ నిత్యం విఫలమవుతూ వస్తోందన్నారు. 1954లో జరిగిన మహాకుంభమేళాలో ఫిబ్రవరి 3న మౌని అమావాస్య రోజున అసంఖ్యాకంగా భక్తులు, సాధువులు, అఘోరాలు తరలివచ్చారు. అదే రోజు ప్రధాని నెహ్రూ వస్తున్నారని బారికేడ్లు ఏర్పాటు చేయడంతో జరిగిన తొక్కిసలాటలో అధికారికంగా 800 వందల మంది చనిపోయినా అనధికారిక లెక్కల ప్రకారం 2 వేల మంది చనిపోయి ఉండవచ్చన్న సమాచారం ఉందని తెలిపింది. 2013 మహాకుంభమేళాలో కూడా అలహాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో 36 మంది చనిపోయారని తెలిపింది. ఇప్పుడు జరుగుతున్న కుంభమేళాలో మోడీ ప్రభుత్వం సకల సౌకర్యాలు ఏర్పాటు చేసిందని వివరించింది. ఇక దీనిపై మహా కుంభమేళాను నెహ్రూ మృత్యుకేళిగా మార్చారని, 2 వేల మంది సాధువులు, భక్తు లను పొట్టన బెట్టుకున్నారని ఆరోపించారు. అలాగే అదే నిర్లక్ష్యంతో 2013లోనూ భక్తుల చావుకు హస్తం పార్టీ కారణమైనదని, కానీ మోదీ సారథ్యంలో మహాద్భుతంగా మహాకుంభమేళా జరుగుతుందని రాష్ట్ర బిజెపి ట్విట్టర్‌లో పేర్కొంది.

## ఆదిలాబాద్‌లో అప్పుల బాధకు మరో రైతు ఆత్మహత్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 19:** పంట సాగుబడి కోసం చేసిన పెట్టుబడులు చేతి కందక అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నదాతలు ఆత్మహత్యల బాటపడుతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఐసిఐసిఐ బ్యాంకులో పురుగులమందు తాగి జాదవ్ దేవరావు (60) శనివారం తనువు చాలించిన ఉదంతం మరవక ముందే, ఆదివారం మరో గిరిజన రైతు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం కలకలం రేపింది. వీరిద్దరూ గిరిజన రైతులే కావడం, బ్యాంకుల అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగి మృత్యువాత పడిన ఘటనలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం లింగోజి తాండకు చెందిన రాథోడ్ గోకుల్ (40) కౌలు రైతు గత 20 ఏళ్లుగా పది ఎకరాల భూమిని సాగుచేస్తూ పంట పెట్టుబడి కోసం గతంలో రూ.6 లక్షలు యాక్సిస్ బ్యాంకు నుండి రుణం తీసుకున్నాడు. పంట దిగుబడి రాక సంక్షోభంలో ఉన్న రైతు గోకుల్ కు రుణం చెల్లించాలని బ్యాంకు సిబ్బంది వేధించడం వల్లే ఈనెల 12న క్రిమిసంహారణ మందు (గడ్డి నివారణ మందు) తాగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విషమ పరిస్థితిలో ఉన్న రైతు గోకుల్‌ను అదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గిరిజన రైతు ఆత్మహత్యఘటన వారి కుటుంబంలో తీరని విషాదం నింపింది.

**దేవరావుకు కన్నీటి వీడ్కోలు..**

శనివారం ఐసిఐసిఐ బ్యాంకు లోనే పురుగుల మందు తాగి చనిపోయిన రైతు జాదవ్ దేవరావు (60) అంత్యక్రియలు ఆయన సొంత గ్రామం రేణిగుడలో జరిగాయి. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న, రైతు సంఘాల నేతలు, లంబాడ హక్కుల పోరాట సమితి నేతలు హాజరై నివాళులర్పించారు. ప్రభుత్వ సహాయం అందకపోవడం, బ్యాంకుల అప్పులు తీర్చలేక, సిబ్బంది వేధింపులకు గురై రైతులు ఆత్మహత్య బాటపడుతున్నారని రైతు సంఘాల నేతలు ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

**రైతన్నలూ.. ఆత్మహత్యలొద్దు: మాజీమంత్రి హరీశ్‌రావు**

ఆదిలాబాద్ జిల్లాలో 24 గంటలు గడవకముందే రుణభారంతో మరో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని, రైతులెవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని మాజీ మంత్రి, సిద్ధిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. రుణమాఫీ పూర్తి చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బ్యాంకుల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల చావులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఉసురు ఎందుకు తీస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వమే బాధ్యత వహించాలి..రైతుల ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని తెలిపారు. వరుసగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అని.. అలాంటి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఇప్పటి వరకు 402 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఇంత జరుగుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.





సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నాయకుల చాడ వెంకటరెడ్డి

## పేదల హక్కుల కోసం మళ్లీ పోరాటాలకు సిద్ధం

**సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, చాడ వెంకట్‌రెడ్డి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** భారత కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీ అని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లాకేంద్రంలోని శివానుభవ మండపంలో ఆది వారం నిర్వహించిన సిపిఐ శతజయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కూడు, గూడు, భూమి కోసం అనేక పోరాటాలు చేసి పేదల పక్షాన నిలిచిన పార్టీ సీపీఐ అన్నారు. దేశంలో ఆర్‌ఎస్ఎస్ భావజాలం కలిగిన బిజెపి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందన్నారు. కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కాలరాస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల్లో ఉంటూ పేదల హక్కుల కోసం మరోసారి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సభలో పార్టీ కోసం యేళ్ల తరబడి పనిచేసిన సీనియర్ నాయకులను శాలువాలతో ఘనంగా సత్కా రించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహిం చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు రామిరెడ్డి, మల్లేష్, దయానందరెడ్డి, అశోక్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి విదేశ పర్యటనలతో ప్రయోజనం శూన్యం

**బిఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 19:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలతో రాష్ట్రానికి రూపాయి లాభం లేదని కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద ఆరోపించారు. రేవంత్ రెడ్డి బృందం విదేశీ పర్యటనలతో పెట్టుబడులు రాబోతున్నా యని అసత్యపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో మాట్లాడారు. గతంలో ఆమెరికా, దావోస్ పర్యటనలతో పెట్టుబడులు తెచ్చామని ప్రజలను నమ్మించి మోసం చేశారని విమర్శించారు.

పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న విధంగా రేవంత్ రెడ్డి వ్యవహారం ఉందని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నైజమని ఆరోపించారు. అదానీ కంపెనీ నుంచి రూ. 12వేల కోట్ల పెట్టుబడులు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.862 కోట్లు మాత్రమే తీసుకొచ్చిందని వివరించారు. ఫార్మా సిటీ, ఎయిర్ పోర్ట్ మెట్రో, ఫార్ములా ఈ రేస్ రద్దు చేసిన సీఎం నిర్ణయం వల్ల రాష్ట్రానికి తీరని నష్టం వస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో లేకపోవడంతో రాష్ట్రం నుంచి కంపెనీలు ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నాయని వెల్లడించారు.

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అని మోసం చేశారని, దేవుళ్లపై ప్రమాణం చేసి రుణమాఫీ అని రైతులను మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు వల్ల వచ్చాయని చెప్పుకుంటున్న రూ. 40,232 కోట్ల పెట్టుబడుల్లో అసలు నిజాలు ఏమిటి ? అదాని సంస్థలకు చెందిన రూ. 12,400 కోట్ల పెట్టుబడి అనుమానాస్పదంగానే ఉందని స్పష్టం చేశారు. గోడి కంపెనీ రూ. 160 కోట్ల విలువ చేసే ఒక చిన్న షెల్ కంపెనీ తెలంగాణలో రూ. 8,000 కోట్లు పెట్టుబడి ఎలా పెడుతుందనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు.

జేఎస్‌డబ్ల్యూ సంస్థ ప్రకటించిన రూ. 9,000 కోట్ల పెట్టుబడి, వెబ్ వర్క్స్ సంస్థ ప్రకటించిన రూ. 5,200 కోట్ల పెట్టుబడి, గోద్రెజ్ సంస్థ ప్రకటించిన రూ. 1,270 కోట్ల పెట్టుబడిలో రూ. 300 కోట్లు గత బీఆర్ఎస్ హయాంలో జరిగినవేనని తెలిపారు. అప్పటి పరిశ్రమల శాఖా మంత్రి కేటీఆర్ చొరవతో టాటా గ్రూప్, గోద్రెజ్ సంస్థ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయని గుర్తు చేశారు.





## శ్రీశైలం బ్యాక్‌వాటర్ దోపిడీకి గురవుతున్నా పట్టింపులేని తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు

**సామాజికశాస్త్రవేత్త అశోక్‌కుమార్**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ దోపిడికి పాల్పడుతున్న ప్రైవేటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి సంస్థపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఉదాసీనత వదిలి చర్యలు తీసుకోవాలని సామాజికశాస్త్రవేత్త అశోక్ కుమార్, కె.ప్రభాకర్‌రెడ్డి, కొండాల్‌రెడ్డి సైదారావు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం కుడికాలువ నుంచి పోతిరెడ్డిపాడు మీదుగా పిన్నాపురం రిజర్వాయర్‌కు చేరిన నీటిని దాని సమీపంలోని సౌరవిద్యుత్ ఉత్పత్తి సంస్థ జలచౌర్యానికి పాల్పడుతోందని తెలిపారు. ఉదయం వేళ సౌరవిద్యుత్‌ను తయారించి రాత్రి వేళలో అక్రమంగా నీటిని ఉపయోగించు కొంటుందని ఆరోపించారు. పిన్నాపురం రిజర్వాయర్ 2015లో ఎపి ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు నుంచి నీరు తరలించడం వల్ల హైదరాబాద్‌తోపాటు ఇతర తెలుగు రాష్ట్రాలకు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని వారు తెలిపారు.

## మాదిగల వెనుకబాటుకు మాలలు కారణం కాదు

**ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు**





రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రొ.హరగోపాల్, ఐలయ్య, వినోద్‌కుమార్ తదితరులు

**హైదరాబాద్ (బేగంపేట), జనవరి 19, ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుపై భిన్న మైన అవగాహనతో ఏర్పడిన వివాదం సమాజానికి శ్రేయ స్కరం కాదని పేర్కొంటూ రిజర్వేషన్ల వర్గీకరణపై కోర్టు తీర్పులో సూచించిన అంశాల్లో అపోహలు, వాస్తవాలపై 'సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసెర్చ్ ఫౌండేషన్' ఆధ్వ ర్యంలో ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కులాలు సజాతీయులు కారని, క్రిమిలేయర్, ఎంపరికల్ డేటా, ప్రాతినిధ్య భాగస్వామ్యం, న్యాయపరమైన సమీక్ష పరిధి తదితర అంశాలపై జరిగిన చర్చలో పాల్గొన్నవారు తమతమ అభిప్రాయాలు తెలిపారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ మాదిగల వెనుకబాటుకు మాలలు కారణం కాదన్నారు. బిజెపికి 400 పార్లమెంటు సీట్లు వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లు ఉండేవి కాదన్నారు. కంచే ఐలయ్య మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు రాష్ట్రపతి ఉత్వర్వులకు విరుద్ధం అన్నారు. రాష్ట్రపతి నోటిపై చేసిన కులాలను సజాతీయులు కావు అనడాన్ని అంగీకరిస్తే రాష్ట్రపతి ఉత్తర్వులను తిరస్కరించినట్లే అని పేర్కొన్నారు. గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ అంటరానితనం ఇంకా అమలులో ఉన్నప్పుడు వర్గీకరణ ద్వారా అంటరానితనం పోతుందా అని ప్రశ్నించారు. 371డి ప్రకారం రాష్ట్రాలు, జిల్లా, జోనల్ పోస్టుల వర్గీకరణ చేయాలన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం వర్గీకరణ చేస్తే క్రిమిలేయర్ వర్తిస్తుందని హెచ్చరించారు. హైకోర్టు సీనియర్ కౌన్సిల్ ఉపేందర్‌రావు మాట్లాడుతూ ఏకసభ్య కమీషన్‌కు చట్టబద్ధత లేదని, న్యాయసమీక్షలో నిలువదని తెలిపారు. ప్రొ.కోదండరామ్, పిఎల్. విశ్వేశ్వర్‌రావు రాష్ట్ర ప్రభుత్వ చర్యలను సమర్థించారు. న్యాయవాది శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయగా రమేష్ బాబు తీర్పులోని లొసుగులను తెలి పారు. సమావేశం అనంతరం మరో సారి చర్చ జరపనున్నట్లు పేర్కొన్నారు. సమా వేశంలో విద్యా, సామాజికవేత్తలు సర్వయ్య, మందాల భాస్కర్, బైరి వెంకటేశ్, మామిడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లలు దాటిన తెలుగు సంస్కృతీ సంప్రదాయం

**మెల్‌బోర్న్‌లోని తెలుగు సంఘం సంబరాల్లో పిసిసి చీఫ్**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** సంక్రాంతి సంబరాలతో తెలుగు సంస్కృతి సంప్రదాయం ఎల్లలు దాటిందని మనం ఎక్కడ ఉన్నా మూలాలను మరిచిపోవద్దని వాటిని కాపాడుకుంటూ ముందుకు పోవాలని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం మెల్‌బోర్న్ తెలుగు అసోసియేషన్ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఆస్ట్రేలియాకు వచ్చినా మనవారి లోగిళ్ళ ముందు రంగురంగుల రంగవళ్ళులతో అలంకరించడంతో తెలుగుపల్లెలలో విహరిస్తున్నట్లు ఉందని ఆయన అన్నారు. ఇక్కడ కూడా పండగను ఆనందంగా జరుపుకుంటున్నారు అని అన్నారు. తెలంగాణలో మన ప్రభుత్వం ఉందిద ఇక్కడ ఉన్న తెలుగు పారిశ్రామిక వేత్తలు మీ ప్రాంతాలలో పెట్టుబడులు పెట్టాలని అక్కడ అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. మీ అందరి జీవితాలలో సంక్రాంతి వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షవ్యక్తంచేశారు. టిపిసిసి చీఫ్‌తో శివసేనారెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ నిధులను వెంటనే విడుదల చేయాలి

**తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ డిమాండ్**

**హైదరాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ప్రభుత్వం నుండి క్లెయిమ్‌లు రాకపోవడంతో అన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఈ నెల 10 నుంచి ఆరోగ్యశ్రీ రోగులకు చికిత్సను నిలిపివేశామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాకేష్ నాయకులు డాక్టర్ విజయచందర్ రెడ్డి, డాక్టర్ నాగార్జున రెడ్డి తెలిపారు. ఆదివారం అసోసియేషన్ నేతలు మీడియాతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ నిధులు రాకపోవడంతో ఈ నెల 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని ప్రభుత్వానికి చెప్పిన నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సీఈవో అసోసియేషన్ నేతలతో ఈ నెల 9న చర్చలు జరిపారు. అయితే చర్చల్లో ఏ ఒక్క హామీ లభించకపోవడంతో ఈ నెల 10 నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసినట్టు తెలిపారు. కేవలం అత్యవసర సేవలను మాత్రమే కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలను నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో నిలిపి వేయడానికి కారణాలు తెలుపుతూ.. ఆసుపత్రులు కన్సల్టేషన్ మొత్తాలను, జీతాలను చెల్లించలేనందున కన్సల్టెంట్‌లు పని చేయడానికి ఇష్టపడటం లేదన్నారు. గత ఆరు నెలలుగా ఆసుపత్రులు డబ్బులు చెల్లించలేక పోయినందున సరఫరాదారులు తమ సరఫరాలను నిలిపివేశారని తెలిపారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ నేతలు తమ ప్రధానమైన నాలుగు డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేశామని.. కానీ ప్రభుత్వం వాటిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను రిలీజ్ చేయాలని అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. రూ. 1200కోట్లకు పైగా పెండింగ్ నిధులున్నాయని అసోసియేషన్ నేతలు చెబుతున్నారు.

## హన్మకొండలో లలిత జ్యుయెలరీ మార్ట్ ప్రారంభం

**హనుమకొండ బ్యూరో. ప్రభాతవార్త, జనవరి 19:** ప్రముఖ నగల రుద్రవరం సంస్థ లలిత జ్యువెలరీ హన్మకొండ నగరంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభం అయింది .షో రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ ఎంపీ కడియం కావ్య మేయర్ గుండ సుధారాణి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయన రాజేందర్ రెడ్డి, లలిత జ్యువెలరీ చైర్మన్ కిరణ్ కుమార్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మేయర్ గుండ సుధారాణి ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడారు. ప్రముఖ నగల షోరూం హనుమకొండ నగరంలో ప్రారంభం రావడం సంతోషదాయకం శుభసూచకం అన్నారు ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించాయని అన్నారు. మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో నగల ధరలు ఉండడం మంచి పరిణామం అన్నారు. సందర్భంగా షోరూంలోని నగలను వజ్రాభరణాలను పరిశీలించి చైర్మన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. లలిత జ్యువెలరీ చైర్మన్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ 40 సంవత్సరాల పైగా సేవలందిస్తూ దక్షిణ భారతదేశంలో అగ్రగామియా గుర్తింపు తెచ్చుకున్న లలిత జ్యువెలరీ ఇప్పుడు హనుమకొండలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో విశేష ఆదరణను పొంది పంది ఇప్పుడు హనుమకొండ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు సర్వం సిద్ధమైందన్నారు. అన్ని ప్రాంతాల వారికి తక్కువ తరుగు తక్కువ ధరలో నగలు ఇవ్వాలని ఉద్దేశంతో వినియోగదారుల ఆశీస్సులతో ఈ షోరూం ప్రారంభించినట్లు తెలిపారు. అన్ని నగల దుకాణాలలో ధరలు చెక్ చేసుకుని మా షోరూంలో ధరలను సరిచూసుకోండి డబ్బులు ఊరికే రావని ఎక్కడ తక్కువ ఉంటే అక్కడ కొనుగోలు చేయాలని వినియోగదారులకు సూచించారు. మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని మా షో రూమ్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు ఈ ప్రారంభోత్సవం సందర్భంగా బంగారు నగరపై తరుగులో రెండు శాతం తగ్గింపు అదేవిధంగా క్యారెట్ కు 6000 తగ్గింపు ఉన్నట్లు తెలిపారు లలిత జ్యువెలరీ షోరూంలో మార్కెట్ కంటే తక్కువ తరుగులో బంగారు నగలను అందజేస్తామన్నారు ఇలాంటి అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని డబ్బును ఆదా చేయాలని చైర్మన్ కిరణ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, శ్రీమాన్, జ్యువెలరు ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అండర్19 వరల్డ్ కప్‌లో..
# భారత్ బోణీ
### వెస్టిండీస్‌పై 9 వికెట్ల తేడాతో గెలుపు
### మరో మ్యాచ్‌లో మలేసియాపై 135 రన్స్‌తో శ్రీలంక విన్



**ఢిల్లీ:** అండర్19 మహిళల టీ20 వరల్డ్ కప్-2025లో భారత్ బోణీ కొట్టింది. కౌలాలంపూర్ వేదికగా వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్‌ను భారత బౌలర్లు 13.2 ఓవర్లలో 44 పరుగులకే కుప్పకూల్చారు. పరుణిక సిసోడియా మూడు, ఆయుశి శుక్లా, జోషిత్ వీజేతలో రెండు వికెట్లు పడగొట్టారు. దీంతో ముగ్గురు విండీస్ బ్యాటర్లు రనౌటయ్యారు. విండీస్ ఇన్నింగ్స్‌లో అసాబి ఖలందర్ 12 పరుగులు, కేనిక కస్సార్ 15 పరుగులు చొప్పున రెండంకెల స్కోర్లు మాత్రమే చేశారు. ఏకంగా ఐదుగురు విండీస్ బ్యాటర్లు డకౌటయ్యారు. ఇక 45 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 4.2 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గొంగడి త్రిష 4 పరుగులు చేసి ఔట్ అయింది. ఇక కమలిని 16 పరుగులు, సనికా ఛల్కే 18 పరుగులతో భారత్‌ను విజయతీరాలకు చేర్చారు. విండీస్ బౌలర్ క్లాక్స్‌టన్‌కు త్రిష వికెట్ దక్కింది. కాగా, ప్రస్తుత వరల్డ్ కప్‌లో భారత్, శ్రీలంక, మలేసియా, వెస్టిండీస్‌తో కలిసి గ్రూప్ ఏలో పోటీపడుతుంది. ఈ గ్రూప్‌ఏలో భాగంగా ఆదివారం జరిగిన మరో మ్యాచ్‌లో మలేషియాపై శ్రీలంక 139 పరుగుల భారీతేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. 163 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన మలేషియా 23 పరుగులకే ఆలౌటైంది.

# విజయ్ హజారే ఛాంపియన్ కర్ణాటక
### ఫైనల్లో 36 పరుగుల తేడాతో విదర్భ ఓటమి



**ఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ-2025 టైటిల్‌ను కర్ణాటక జట్టు చేజిక్కించుకుంది. విదర్భతో వడోదర వేదికగా జరిగిన ఫైనల్‌లో కర్ణాటక 36 పరుగుల తేడాతో నెగ్గి ఐదోసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో కర్ణాటక నిర్దేశించిన 349పరుగులు ఛేదనలో విదర్భ 48.2 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌటైంది. ధ్రువ్‌షోరే 111 బంతుల్లో 110 పరుగులు,8ఫోర్లు, 2సిక్సలు కొట్టి శతకంతో చెలరేగినా విదర్భకు ఓటమి తప్పలేదు. కర్ణాటక బౌలర్లలో వాసుకి కౌశిక్, ప్రసిధ్ కృష్ణ, అభిలాష్ శెట్టి తలో 3 వికెట్లు పడగొట్టగా హార్దిక్ రాజ్ ఒక వికెట్ దక్కించుకున్నాడు. భారీ ఛేదనలో విదర్భ స్కోర్ బోర్డు ముందుకు కదులుతున్న ప్పటికీ వికెట్లు క్రమంగా పడ్డాయి. యశ్ రాథోడ్ 22 పరుగులు, కరుణ్ నాయర్ 27 పరుగులు, జితేశ్ శర్మ 34పరుగులు చేసి భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. చివర్లో హర్షదుబే 63పరుగులుచేసి హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. చివర్లో పోరాడిన హర్ష్ దూబే మ్యాచ్‌పై ఆశలు రెకెత్తించినా, మరో ఎండ్‌లో వికెట్లు పడ్డాయి. ఇక అభిలాశ్ శెట్టి బౌలింగ్‌లో హర్ష్ దూబే క్యాచ్ ఔట్ అవ్వడంతో మ్యాచ్ ముగిసింది. ఇక విదర్భ కెప్టెన్ కరుణ్ నాయర్ ఒంటిచేత్తో జట్టును ఫైనల్ వరకూ తీసుకువచ్చాడు. భారీ ఛేదనలో కరుణ్ 27 పరుగులతో ఆకట్టుకోలేకపోయాడు. అయితే ఈ ఎడిషన్‌లో మాత్రంఅత్యధిక రన్‌స్కోరర్‌గా నిలిచాడు.8 మ్యాచ్‌ల్లో కరుణ్ 779 పరుగులతో టోర్నీని ముగించాడు. అంతకుముందు కర్ణాటక నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 348 పరుగుల తో భారీస్కోర్ సాధించింది.సమరన్ రవిచంద్రన్ 101 పరుగులు; 92 బంతుల్లో 7ఫోర్లు, 3 సిక్సర్లుతో శతక్కొట్టాడు. క్రిష్ణన్ శ్రీజిత్ 78 పరుగులు, అభినవ్ మనోహర్79 పరుగులతో చెలరేగారు. విదర్భ బౌలర్లలో భూత్లే, దర్శన్ చెరో 2 వికెట్లు పడగొట్టగా యశ్ ఠాకూర్, యశ్ కాదం తలో వికెట్ తీశారు.

# లక్నో జెయింట్స్‌లో కెప్టెన్ రేస్
### పోటీ పడుతున్న సీనియర్లు
### పటిష్ట పరిచే దిశగా ఫ్రాంచైజీ



**ఢిల్లీ:** ఈసారి కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో ఇండియన్ సూపర్ లీగ్ (ఐపీఎల్)-2025లో సత్తా చాటాలని లక్ష ్యంగా పెట్టుకుంది. ఈ సీజన్లో అయినా తొలి టైటిల్ కైవసం చేసుకోవాలని ఆ జట్టు ఫ్రాంచైజీ మాస్టర్ ప్లాను వేస్తుంది. లక్నో సూపర్ జెయింట్స్ గత సీజన్లలో ప్లే ఆఫ్ స్థాయి జట్టుగా నిలిచినప్పటికీ ఐపీఎల్-2024లో తమ ప్రదర్శనతో నిరాశపరిచింది. పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచిన లిలీబి లోనెట్ రన్ రేట్ కారణంగా ప్లేఆఫ్‌ను కోల్పోయింది. ఈ నేపథ్యంలో, ఐపీఎల్-2025 సీజన్‌కు ముందుగా తమ కొత్త కెప్టెన్‌ను ప్రకటించేందుకు కసరత్తు చేస్తోంది. లక్నో సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ తమ జట్టు కెప్టెన్ కెఎల్ రాహుల్‌ను వదులుకొని, రిషబ్ పంత్, నికోలస్ పూరన్‌నులో ఒకరిని కొత్త సారథిగా నియమించనున్నట్లు సమాచారం. రిషబ్ పంత్ తన అనుభవంతో ముందస్తు ఎంపికగా కనిపిస్తుండగా, పూరన్ కూడా సమర్థమైన ప్రత్యామ్నాయంగా ఉంది. ఇదే సమయంలో రిషబ్, పూరన్‌తో పాటు, మయాంక్ యాదవ్, రవి బిష్ణోయ్, మోహ్సిన్ ఖాన్, ఆయుష్ బదోనీలు సైతం పోటీ పడుతున్నారు. అయితే కెప్టెన్సీ రేసులో వారిలో రిషబ్ పంత్, నికోలస్ పూరన్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. దీంతో ఫ్రాంచైజీ యాజమాన్యం కెప్టెన్సీ ఎంపిక విషయంలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధరగా రూ.27 కోట్లకు 2024 మెగా వేలంలో లిలీబి ద్వారా కొనుగోలు చేయబడ్డ పంత్, కెప్టెన్సీ రేసులో ముందు ఉన్నాడు. 2021-2024 మధ్య ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా ఉన్న పంత్, తన కెప్టెన్సీ అనుభవంతో ప్రత్యేకంగా నిలుస్తున్నాడు. 2023 సీజన్ మినహా, ఇతర సీజన్లలో అతని నాయకత్వం జట్టుకు బలాన్నిచ్చింది. అలాగే వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ పూరన్ లక్నో జట్టులో ప్రధాన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. 2024 సీజన్‌లో పూరన్ అత్యధిక రన్లు సాధించాడు. ప్రస్తుతం ఐఎల్‌టి20లో ఎంఐ ఎమిరేట్స్‌కు నాయకత్వం వహిస్తున్న పూరన్, ఫ్రాంచైజీ క్రికెట్‌లో కెప్టెన్సీ అనుభవం కలిగి ఉన్నాడు. కాగా 2022 నుంచి లక్నో కెప్టెన్‌గా వ్యవహరించిన రాహుల్, 2024 ఐపీఎల్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమి తర్వాత యజమాని సంజీవ్ గోయెంకాతో వచ్చిన మనస్పర్థల కారణంగా జట్టును విడిచాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరాడు. గతంలో ముంబై ఇండియన్స్‌తో పని చేసిన జహీర్ ఖాన్, ప్రస్తుతం లక్నో జట్టుకు మెంటార్‌గా సేవలందిస్తున్నాడు. అతని మార్గదర్శకత్వంలో, జట్టు పునర్నిర్మాణం చేపట్టనుంది. దీనికి సంబంధించి ఈ నెల 20న కోల్‌కతాలోని ఆర్‌పి సంజీవ్ గోయంకా గ్రూప్ (ఆర్‌పిఎస్‌జి) ప్రధాన కార్యాలయంలో జరగబోయే విలేకరుల సమావేశంలో గ్రూప్ ఛైర్మన్ సంజీవ్ గోయెంకా కొత్త కెప్టెన్ పేరును వెల్లడిస్తారని సమాచారం. ఫ్రాంచైజీ కొత్త జెర్సీ ఆవిష్కరణ కూడా జరిగే అవకాశం ఉంది.

## సాత్విక్, చిరాగ్ జోడీ ఓటమి
### ఇండియన్ ఓపెన్‌లో ముగిసిన భారత్ ప్రస్థానం

**ఢిల్లీ:** ఇండియన్ ఓపెన్ సూపర్-750 టోర్నమెంట్‌లో భారత ప్రస్థానం ముగిసింది. టైటిల్‌పై ఆశలు రేపిన భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి పోరాటానికి సెమీ ఫైనల్లోనే చుక్కెదురైంది. పురుషుల డబుల్స్ సెమీస్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 18-21, 14-21తో మలేషియాకు చెందిన గో జె ఫి-నూర్ ఇజుద్దీన్ ద్వయం చేతిలో ఓటమిపాలైంది. దాదాపు 40 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ఏడో సీడ్‌సాత్విక్, చిరాగ్‌జంట తొలి గేమ్‌లో మాత్రమేఒకింత దీటైన పోటీనిచ్చింది.అయితే కీలకమైన రెండో గేమ్‌లో ప్రత్యర్థికి సవాలు విసిరేందుకు ప్రయత్నించినా లాభంలేకపోయింది. మెరుపులాంటి స్మాష్‌లకు తోడు సుదీర్ఘమైన ర్యాలీలతో మలేషియా జోడీ పాయింట్లు ఖాతాలోవేసుకుని మ్యాచ్‌ను తమవశం చేసుకుంది.





# తొలి టెస్టులో పాకిస్థాన్ గెలుపు
### 127 పరుగుల తేడాతో వెస్టిండీస్ ఓటమి

**ఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో పాకిస్తాన్ 127 పరుగుల తేడాతో గెలుపొందింది. ముల్తాన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ నిర్దేశించిన 251 పరుగుల లక్ష ్య ఛేదనలో విండీస్ చేతులెత్తేసింది. పాక్ స్పిన్నర్లు సాజిద్ ఖాన్ (15-3-50-5), అబ్రార్ అహ్మద్ (11.3-2-27-4), నౌమన్ అలీ (10-1-42-1) చెలరేగడంతో విండీస్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో 123 పరుగులకే కుప్పకూలింది. విండీస్‌ను గెలిపించేందుకు అలిక్ అథనాజ్ (55) విఫలయత్నం చేశాడు. విండీస్ ఇన్నింగ్స్‌లో క్రెయిగ్ బ్రాత్‌వైట్ (12), మికైల్ లూయిస్ (13), టెవిన్ ఇమ్లాచ్ (14), కెవిన్ సింక్లెయిర్ (10) రెండంకెల స్కోర్లు చేశారు. కీసీకార్తీ 6, జస్టిన్ గ్రీవ్స్ 9, కవెమ్ హాడ్జ్, మోటీ, వార్రికన్ డకౌటయ్యారు. విండీస్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ జోమెల్ వా ర్రికన్ (18-3-32-7) స్పిన్ మాయాజాలం దెబ్బకు పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌లో 157 పరుగులకే ఆలౌటైంది. గుడకేశ్ మోటీ ఓ వికెట్ తీయగా, ఇద్దరు పాక్ ఆటగాళ్లు రనౌట్ అయ్యారు. పాక్ ఇన్నింగ్స్‌లో షాన్ మసూద్ (52) టాప్ స్కోరర్ కాగా, ముహమ్మద్ హురైరా 29, బాబర్ ఆజమ్ 5, కమ్రాన్ గులామ్ 27, సౌద్ షకీల్ 2, మహ్మద్ రిజ్వాన్ 2, సల్మాన్ అఘా 14, నౌమన్ అలీ 9, సాజిద్ ఖాన్ 5, ఖుర్రమ్ షెహజాద్ డకౌటయ్యారు. అంతకు ముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 137 పరుగులకే కుప్పకూలింది. నౌమన్ అలీ (11-2-39-5), సాజిద్ ఖాన్ (12-0-65-4), అబ్రార్ అహ్మద్ (1.2-16-1) విండీస్ నడ్డివిరిచారు. విండీస్ ఇన్నింగ్స్‌లో 10, 11వ నంబర్ ఆటగాళ్లు వార్రికన్ (31 నాటౌట్), జేడన్ సీల్స్ (22) మాత్రమే 20కి పైగా పరుగులు చేశారు. బ్రాత్‌వైట్ (11), కెవిన్ సింక్లెయిర్ (11), మోటీ (19) రెండంకెల స్కోర్లు చేయగా, మికైల్ లూయిస్ (1), కీసీకార్తీ (0), కవెమ్ హాడ్జ్ (4), అలిక్ అథనాజ్ (6), జస్టిన్ గ్రీవ్స్ (4), టెవిన్ ఇమ్లాచ్ (6) సింగిల్ డిజిట్ స్కోర్లకే టపా కట్టేశారు. ఇక ఈ మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 230 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (84), మహ్మద్ రిజ్వాన్ (71) అర్ధ సెంచరీలు సాధించి పాక్‌కు గౌరవప్రదమైన స్కోర్ అందించారు. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో షాన్ మసూద్ 11, ముహమ్మద్ హురైరా 6, బాబర్ ఆజమ్ 8, కమ్రాన్ గులామ్ 5, సల్మాన్ అఘా 2, నౌమన్ అలీ 0, సాజిద్ ఖాన్ 18, ఖుర్రమ్ షెహజాద్ 7 పరుగులు చేశారు. విండీస్ బౌలర్లలో వార్రికన్, జేడన్ సీల్స్ తలో మూడు వికెట్లు పడగొట్టగా, కెవిన్ సింక్లెయిర్ 2, మోటీ ఓ వికెట్ దక్కించుకున్నారు. ఈ గెలుపుతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో పాక్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో టెస్ట్ ఇదే వేదికగా ఈ నెల 25 నుంచి ప్రారంభం కానుంది.

# 53% పెరిగిన రియల్ ఎస్టేట్ విక్రయాలు

**న్యూఢిల్లీ, జనవరి 19:** భారతదేశంలో విలాసవం తమైన గృహాల కోసం డిమాండ్ రోజురోజుకూ పెరుగుతుంది. ప్రత్యేకించి రూ.4 కోట్లు, అంతకంటే ఎక్కువ ధర ఉన్న గృహాల డిమాండ్ బాగా పెరిగిందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ సీబీఆర్‌ఈ డేటాలో విశ్లేషించింది. ఈ గృహాల విక్రయాలు 2024లో ఏడు ప్రధాన నగరాల్లో 53 శాతం పెరిగాయని పేర్కొంది. గత ఏడాది విక్రయించిన మొత్తం లగ్జరీ హౌసింగ్ యూనిట్ల సంఖ్య 19,700గా ఉంటే, 2023లో విక్రయించిన 12,895 యూనిట్లుగా ఉంది. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం లగ్జరీ గృహాలకు అతిపెద్ద మార్కెట్‌గా



అవతరించిందని ఆ డేటాలో పేర్కొన్నారు. ముఖ్యంగా ఢిల్లీ ఎన్‌సీఆర్ ఏరియా అమ్మకాల్లో గణనీయమైన పెరుగుదలను నమోదుచేసిందని, 2024లో ఈ ప్రాంతంలో 10,500యూనిట్లు అమ్ముడయ్యాయి. అయితే 2023లో కేవలం 5,525 యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. జాతీయ రాజధాని ప్రాంతంలో హైఎండ్ రియల్ ఎస్టేట్‌కు పెరుగుతున్న డిమాండ్ పెరుగుతున్న విక్రయాల బట్టి అర్థం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.
లగ్జరీ గృహాల అమ్మకాల జోరు భవిష్యత్‌లో కూడా కొనసాగుతుందని, రాబోయే త్రైమాసికాల్లో అమ్మకాలతో పాటు కొత్త గృహాల యూనిట్ లాంచ్‌లు రెండూ స్థిరంగా ఉంటాయని సీబీఆర్‌ఈ ఇండియా, సౌత్‌ఈస్ట్ ఆసియా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా చైర్మన్, సీఈఓ అన్షుమాన్ మ్యాగజైన్ చెబుతున్నారు. నోయిడా, బెంగళూరు, పుణె, చెన్నై వంటి నగరాల్లో మధ్యతరగతి అభివృద్ధితో సాంప్రదాయకంగా అనుబంధం ఉన్న నగరాల్లో ఉన్నతస్థాయి ప్రాజెక్టుల వైపు ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపు తున్నారని చెబుతు న్నారు. లగ్జరీ గృహాల డిమాండ్ పెరగడం అనేది గృహయజమానులపై ప్రజల అవగాహనలో ప్రాథమిక మార్పును ప్రతిబింబిస్తుందని నిపుణులు చెబుతున్నారు లగ్జరీ హౌసింగ్ మార్కెట్‌లో కీలకమైన ముంబైలో అమ్మకాలు బాగా పెరిగాయి. 2024లో 5,500 లగ్జరీ యూనిట్లు అమ్ముడుకాగా 2023లో 4,200 యూనిట్లు అమ్ము డయ్యాయి. పూణేలోని లగ్జరీ హోమ్ మార్కె ట్ గణనీయమైన వృద్ధిని సాధించింది. ఈ నగరంలో అమ్మకాలు 400 యూనిట్ల నుంచి 825 యూనిట్లకు పెరిగా యి. అయితే బెంగ ళూరులో స్వల్ప క్షీ ణత నమోదైంది. ఇక్కడ అమ్మ కాలు గతేడా ది 265 యూని ట్లు ఉంటే ప్రస్తుత త్రైమాసి కంలో 50 యూనిట్లు మాత్రమే అమ్ము డయ్యా యి. అలాగే కోల్‌కతాలో, విలాసవంతమైన గృహాల విక్రయాలు 310 నుంచి 530 యూనిట్లకు పెరిగాయి.ముఖ్యంగా హైదరాబాద్‌లో లగ్జరీ గృహాల అమ్మకాల్లో స్థిరమైన పెరుగుదల కనిపించింది. 2023లో 2,030 యూనిట్ల అమ్మకాలతో పోలిస్తే 2,100యూనిట్లకు చేరుకుంది. చెన్నైలో 2024లో 165-275 యూనిట్లకు పెరి గింది.

# వరల్డ్ నం.3 స్టార్టప్ ఎకోసిస్టంగా భారత్

**న్యూఢిల్లీ, జనవరి 19:** పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ) జనవరి 15 నాటికి దాదాపు 1.59 లక్షలకు పైగా స్టార్టప్‌లను గుర్తించిందని, దీంతో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా ఏర్పడినట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం (జనవరి 15) తెలిపింది. 2016 నుంచి 2024 అక్టోబరు 31 వరకు దేశ యువతకు 16.6 లక్షలకుపైగా ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టించినట్లు వెల్లడించింది. ఇవి నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు గణనీయంగా దోహదపడ్డాయని పేర్కొంది. వీటిల్లో ఐటీ సర్వీసెస్ ఇండస్ట్రీ 2.04 లక్షల ఉద్యోగాలతో అగ్రగామిగా కొనసాగుతుంది. ఆ తర్వాత 1.47 లక్షల ఉద్యోగాలతో హెల్త్‌కేర్ అండ్ లైఫ్‌సైన్స్, దాదాపు 94 వేల ఉద్యోగాలతో ప్రొఫెషనల్ అండ్ కమర్షియల్ సర్వీస్‌లు తర్వాత స్థానాల్లో ఉన్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2016, జనవరి 16న భారత్‌లో ప్రారంభమైన 'స్టార్టప్ ఇండియా' తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుందని ఈ సందర్భంగా గుర్తు చేసింది. 2016లో ప్రారంభమైన స్టార్టప్ ఇండియా దేశంలోనే ఒక పరివర్తనాత్మక ప్రయాణమని కొనియాడింది. అందుకే జనవరి 16వ తేదీని 'నేషనల్ స్టార్టప్ డే'గా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. బెంగళూరు, హైదరాబాద్, ముంబై, ఢిల్లీవిదిశి వంటి ప్రధాన కేంద్రాలు స్టార్టప్ ఇండస్ట్రీలో ముందంజలో ఉన్నాయి. అయితే చిన్న నగరాలు దేశం వ్యవస్థాపక ఊపందుకోవడానికి ఎక్కువగా దోహదపడ్డాయని పేర్కొంది. ఫిన్‌టెక్, ఎడ్‌టెక్, హెల్త్‌టెక్, ఇ-కామర్స్‌లోని స్టార్టప్‌లు స్థానిక సవాళ్లను అధిగమించి ప్రపంచ గుర్తింపును పొందినట్లు పేర్కొంది.గుర్తింపు పొందిన స్టార్టప్‌ల సంఖ్య 2016లో 500 ఉండగా 2025 జనవరి 15 నాటికి వాటి సంఖ్య అనూహ్యంగా 1,59,157కి పెరిగినట్లుతెలిపింది. గతేడాది అక్టోబర్ 31నాటికి గుర్తింపు పొందిన దాదాపు 73,151 స్టార్టప్‌లలో మహిళా డైరెక్టర్‌లు ఉన్నారని, ఇది దేశంలో మహిళా పారిశ్రామికవేత్తల పురోగతిని వెల్లడిస్తుందని కేంద్ర మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది.




# వాణిజ్యం

# ఈక్విటీ మార్కెట్లకు 11 కంపెనీల ఎంట్రీ

**ముంబై, జనవరి 19:** జనవరి నాలుగో వారంలోనూ ఐపీఓల హవా కొనసాగనుంది. మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు మెయిన్ బోర్డ్ నుంచి డెంటా వాటర్‌తో పాటూ ఎస్‌ఎంఈ విభాగం నుంచి మూడు సంస్థలు సిద్ధమవుతున్నాయి. మరో 7 కంపెనీ షేర్లు దలాల్ స్ట్రీట్ లిస్ట్ కానున్నాయి.మెయిన్ బోర్డ్ నుంచి డెంటా వాటర్ అండ్ ఇన్ఫ్రా సొల్యూషన్స్ తొలి పబ్లిక్ ఇష్యూకు రానుంది. ఐపీఓ ద్వారా రూ.220.50 కోట్ల నిధులను సమీకరించాలని లక్ష ్యం గా పెట్టుకుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా 75,00,000 తాజా ఈక్విటీ షేర్లను జారీ చేయ నుంది. ధరల శ్రేణిగా రూ.279-294ను నిర్ణయిం చింది. ఇష్యూ22న ప్రారం భమై 24న ముగియనుం ది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక్క లాట్ (50 షేర్లు)కోసం రూ.14,700 వెచ్చించాలి. జనవరి 29న కంపెనీ షేర్లు దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. ఎస్‌ఎంఈ విభాగం నుంచి కేపిటల్ నంబర్స్ ఇన్ఫోటెక్ పబ్లిక్‌ఇష్యూకు రానుంది. ఐపీఓ ద్వారా రూ.169.37 కోట్లు సమీకరించాలని చూస్తోంది. ధరల శ్రేణి రూ.250-263గా కంపెనీ నిర్ణయించింది. సబ్‌స్క్రిప్షన్ జనవరి 20న ప్రారంభమై 22న ముగుస్తుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 32.20లక్షల తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సెల్ ద్వారా రూ.84.69 కోట్ల విలువైన షేర్లు జారీ కానున్నాయి. జనవరి 27న షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో జాబితా కానున్నాయి. రెక్స్‌ప్రోలో ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఐపీఓ ద్వారా రూ.58.65 కోట్లు సమీకరించనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 32.50 లక్షల తాజా షేర్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 4.50లక్షల షేర్లు జారీ చేయనున్నారు. బిడ్డింగ్ విండో జనవరి 22న ప్రారంభమై 24న ముగుస్తుంది. ధరల శ్రేణి రూ.145గా ప్రకటించింది. రూ.24.58 కోట్లు సమీకరించాలనే ఉద్దేశంతో ఎస్‌ఎంఈ విభాగం నుంచి జీబీ లాజిస్టిక్స్ కామర్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. సబ్‌స్క్రిప్షన్ జనవరి 24న మొదలై 28న ముగుస్తుంది. ధరల శ్రేణి ఇంకా ప్రకటించలేదు. సబ్‌స్క్రిప్షన్‌లో మంచి ఆదరణను




సొంతం చేసుకున్న డెంటల్ ఉత్పత్తుల కంపెనీ లక్ష్మి డెంటల్ లిమిటెడ్ షేర్లు జనవరి 20న జాబితా కాను న్నాయి. కాబ్రా జ్యుయెలర్స్ జనవరి22, రిషబ్ సెక్యూ రిటీస్ జనవరి22, ల్యాండ్‌మార్క్ ఇమిగ్రేషన్ జనవరి23, స్టాలియన్ ఇండియా ఫ్లోరోకెమికల్స్ షేర్లు జనవరి 23, ఇఎంఇ పార్ట్‌నర్స్ జనవరి24న ఎంట్రీ ఇవ్వను న్నాయి.

# పాన్‌కార్డు అప్‌డేట్ పేరిట కొత్త సైబర్ క్రైమ్

**న్యూఢిల్లీ, జనవరి 19:** ఇటీవల కాలంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) కస్టమర్‌లు తమ పాన్ కార్డ్ వివరాలను అప్‌డేట్ చేయనందుకు 24 గంటల్లో తమ బ్యాంక్ ఖాతాలను బ్లాక్ చేసినట్లు మెసేజ్‌లు వస్తున్నాయి. అంతేకాకుండా ఆ మెసేజ్‌లో అనుమానాస్పద లింక్‌లు ఉంటున్నాయని, వాటి ద్వారా పాన్ కార్డు వివరాలను అప్‌డేట్ చేయాలని సూచిస్తున్నాయి. అయితే ఆ మెసేజ్‌లను ఎవరైనా క్లిక్ చేస్తే స్కామ్ వెబ్‌సైట్‌లకు రీ డైరెక్ట్ చేస్తున్నాయి. ముఖ్యంగా స్కామర్‌లు ఫిషింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి సున్నితమైన సమాచారాన్ని బహిర్గతం చేస్తున్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఈసందేశాలను ఫేక్ అని స్పష్టంచేసింది. ఇండియా పోస్ట్ అటువంటి హెచ్చరికలను పంపదని స్పష్టం చేసింది. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయడం,వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం మానుకోవాలని ప్రజలకు సూచించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్‌లో ఈ మేరకు పోస్ట్ చేసింది. ఫిషింగ్ స్కామ్ ద్వారా స్కామర్లు పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలు లేదా క్రెడిట్ కార్డ్ నంబర్‌ల వంటి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తారు. సాధారణంగా మీ బ్యాంక్ లేదా షాపింగ్ వెబ్‌సైట్ వంటి విశ్వసనీయ సంస్థల నుంచి వచ్చినట్లుగా కనిపించే నకిలీ ఇ-మెయిల్‌లు, సందేశాలు లేదా లింక్‌లను పంపుతారు. మీరు ఆ లింక్‌లపై క్లిక్ చేస్తే లేదా మీ వివరాలను ఇచ్చినట్లయితే, స్కామర్‌లు మీ సమా చారాన్ని దొంగిలించి, మీకు హాని కలిగించేలా ఉపయోగించవచ్చు.




# శరవేగంగా విస్తరిస్తున్న క్విక్ కామర్స్

**ముంబై, జనవరి 19:** కిరాణా సరుకులు, నిత్యావసర వస్తువులను నిమిషాల్లో డెలివరీ చేస్తామని హామీ ఇస్తున్న క్విక్ కామర్స్ బిజినెస్ పట్టణ ప్రాంతాల్లో వేగంగా ప్రజాదరణ పొందుతోంది. ఇప్పటికే బ్లింకిట్, ఇన్స్టామార్ట్, బిగ్ బాస్కెట్, జెప్టో వంటి సంస్థలు ఈ సర్వీసులు అందిస్తున్నాయి. అయితే ఈ బిజినెస్‌పై ప్రజాదరణతోపాటు విమర్శలు సైతం పెరుగుతున్నాయి. ఇందుకు కొన్ని కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. వ్యతిరేక పోటీ విధానాలు క్విక్ కామర్స్ సంస్థలు వ్యతిరేక పోటీ విధానాలను అనుసరిస్తున్నాయనే వాదనలున్నాయి. సాంప్రదాయ రిటైలర్లు, ముఖ్యంగా కిరాణా దుకాణాదారులపై క్విక్ కామర్స్ ప్రభావం భారీగా ఉంది. ఈ సంస్థలు అందించే డిస్కౌంట్లు, నేరుగా ఇంటికి డెలివరీ చేసే సేవలతో కిరాణాదారుల వ్యాపా రం తీవ్రంగా దెబ్బతింది. వినియోగదారులకు వేగంగా సర్వీసులు అందించేందుకు స్థానికంగా డార్క్ స్టోర్లను, చిన్న, ఆటోమేటెడ్ గోదాములను ఉపయోగిస్తున్నాయి.సాంప్రదాయ రిటైల్ విధానంలో వివిధ దశల్లో ఉండే మధ్యవర్తుల కమీషన్ల బాదరబందీ లేకపోవడంతో క్విక్ కామర్స్ సంస్థలు ఆకర్షణీయమైన ధరకే ఉత్పత్తులను అందిస్తుండటం సైతం కస్టమర్లు వాటి వైపు మొగ్గు చూపేందుకు దోహదపడుతోంది. ఈ నేపథ్యంలో నిత్యావసరాల మార్కెట్లో ఆధిపత్యం ఉన్న కిరాణా స్టోర్స్ మనుగడ కోసం పోరాడి పరిస్థితులు నెలకొంటున్నాయి. క్విక్ కామర్స్ వినియోగం 2024-25లో 74%వృద్ధి నమోదు చేయనుంది. 2023-28 మధ్యలో 48% వార్షిక వృద్ధితో అత్యంత వేగంగా ఎదిగిన మాధ్యమంగా నిలవనుందని కొన్ని నివేధికలు చెబుతున్నాయి. విదేశీ పెట్టుబడుల దుర్వినియోగం క్విక్‌కామర్స్ వాణిజ్యం పెరగడం స్థానిక రిటైలర్లకు గొడ్డలిపెట్టుగా మారింది. సౌలభ్యం, తక్కువ ధరలకు ఆకర్షితులైన చాలా మంది వినియోగదారులు తమ షాపింగ్ అలవాట్లను మార్చుకుంటున్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ మార్పు ఫలితంగా సాంప్రదాయ దుకాణాల్లో అమ్మకాలు తగ్గిపోయాయి. రిటైల్ మార్కెట్‌ను పూర్తి తమ వైపు తిప్పుకోవాలనే ఉద్దేశంతో క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు విదేశీ పెట్టుబడులను దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపించింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps